www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 22-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 316 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: చవితి రా.2:29 తదుపరి పంచమి, నక్షత్రం: శతభిషం మ.2:27 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: రా.8:52-10:29, దుర్ముహూర్తం: ఉ.10:35-11:19, మ.3:02-3:47, అమృతఘడియలు: ఉ.7:06-8:44, తె 6:31 మొదలు, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:52, సూర్యాస్తమయం: 6:01 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ప్రమాదంలో ధ్వంసమైన బస్సు ముందుభాగం

నాలుగు బస్సులు ఢీ

41 మంది విద్యార్థులకు గాయాలు

ఐదుగురు ఉపాధ్యాయులు, ఒక డ్రైవర్‌కు కూడా..

గేదె అడ్డు రావడంతో సడన్ బ్రేక్.. ఒకదాని వెనుక ఒకటిగా ఢీకొన్న బస్సులు.. అర్ధరాత్రి తూర్పుగోదావరి జిల్లాలో ఘటన

నల్లగొండ విద్యార్థుల ఉత్తరాంధ్ర విజ్ఞాన యాత్రలో ప్రమాదం

13



మరో బస్సులో స్వస్థలానికి పయనమైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

కిల్ స్విచ్, బీమా!

డిజిటల్ అరెస్టుల కట్టడికి కేంద్ర కమిటీ సూచన

యూపీఐ, బ్యాంక్ యాప్స్‌లో అత్యవసర బటన్ సౌకర్యం

దీనిని వినియోగించడం ద్వారా అన్ని లావాదేవీలకు బ్రేక్

బీమాతో పోయిన సొమ్ము వెనక్కి

12

అంతరిక్షానికి బై బై



వ్యోమగామి సునీత రిటైర్మెంట్

27 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు

అధికారికంగా ప్రకటించిన నాసా

అంతరిక్షంలో 608 రోజులు.. 9 సార్లు స్పేస్‌వాక్

మూడుసార్లు అంతరిక్ష కేంద్రానికి వెళ్లొచ్చిన ఘనత

12

ట్రంప్‌కు యూరప్ బానిస కాదు

గ్రీన్‌లాండ్ అంశంలో మాదంతా ఒక్కటే మాట

ఫ్రాన్స్, జర్మనీ, డెన్మార్క్, బ్రిటన్, బెల్జియం ప్రకటన



ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్



కెనడా ప్రధాని కార్నీ

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ట్రంప్‌పై ఫైర్

బలవంతుడిదే రాజ్యం అనే పరిస్థితి తీసుకొస్తున్నారు

అంతర్జాతీయ నిబంధనల్ని ధ్వంసం చేస్తున్నారు

అద్దూ, అదుపు లేని సుంకాలను ఒప్పుకొనే ప్రసక్తే లేదు

మన వద్ద కూడా బలమైన ఆయుధం ఉంది

ఇతర దేశాలు యూరప్ మార్కెట్లలోకి ప్రవేశించడాన్ని కఠినతరం చేద్దాం.. ట్రేడ్ బజూకాను వాడుదాం: మేక్రాన్

ఆర్థిక బలిమిని ఆయుధంగా వాడుకుంటున్నారు

పద్ధతి లేకుండా వాణిజ్య నిబంధనలు రూపొందిస్తున్నారు

ఇది ఎంతో కాలం కొనసాగదు: కెనడా ప్రధాని కార్నీ

మా మీద పన్నులు వేయండి.. 24 దేశాల సంపన్నుల లేఖ

దావోస్, జనవరి 21: గ్రీన్‌లాండ్‌ను బలవంతంగానైనా ఆక్రమించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా యూరప్ దేశాలు తమ గళాలను మరింత బలంగా వినిపించాయి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్)ను అందుకు వేదిక చేసుకున్నాయి. ట్రంప్ గీత దాటితే ఎదురు దాడి తప్పదని స్పష్టమైన హెచ్చరిక జారీచేశాయి. ముఖ్యంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ చేసిన ప్రకటనలు సంచలనంగా మారాయి. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఆ దేశ ఎంపీ ఎడ్ డేవీ, జర్మనీ ఆర్థిక మంత్రి లార్స్ క్లింగ్‌బీల్,

మిగతా 2వ పేజీలో...




గ్రీన్‌లాండ్ స్వాధీనానికి బలప్రయోగం చేయను

ఆ భూభాగాన్ని ఒక్క అమెరికా మాత్రమే కాపాడగలదు

దీనికి సంబంధించిన చర్చలు వెంటనే ప్రారంభం కావాలి

నాతో ఓకే అంటే సరే.. లేదంటే 'గుర్తుపెట్టుకుంటాం'

యూరప్ సరైన దిశలో ప్రయాణించట్లేదు.. దావోస్‌లో ట్రంప్



దావోస్‌లో కాలిబో ఏఐ అకాడమీ వ్యవస్థాపకులు రాజ్ వట్టికూటితో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు



దావోస్ సదస్సు సందర్భంగా మంత్రి లోకేశ్‌తో తెలంగాణ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాటామంతీ

ఏపీ బ్రాండింగ్ @దావోస్!

దావోస్ వేదికగా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు

రాష్ట్రం గురించి ప్రపంచ పారిశ్రామిక రంగం చర్చ

మాది పరిశ్రమల స్నేహపూర్వక ప్రభుత్వం

'ఈజ్ ఆఫ్' నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

పెట్టుబడులతో వచ్చినవారికి తక్షణమే అనుమతులు

విశాఖకు గూగుల్ రాక గొప్ప ముందడుగు

మంత్రి లోకేశ్ చొరవతో సాధించగలిగాం

సంస్కరణలతోనే యువతకు ఉపాధి: సీఎం

అంతర్జాతీయ మీడియాతో బాబు మాటామంతీ

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల ఆకర్షణకు, నూతన ఆవిష్కరణలకు దావోస్ అద్భుత వేదిక అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దావోస్ పర్యటనలో మూడో రోజు బుధవారం ఆయన అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ప్రభుత్వ పాలసీల గురించి వివరించారు. గతంలో ఉమ్మడి ఏపీని, ప్రస్తుత విభజిత ఆంధ్రప్రదేశ్‌ను

మిగతా 14వ పేజీలో...

పరిశ్రమలకు ఏపీ అనుకూలం: లోకేశ్

రాష్ట్రంలో ఇజ్రాయెల్ పారిశ్రామిక క్లస్టర్

సైబర్ సెక్యూరిటీలోనూ అమరావతికి మద్దతు

దావోస్ సదస్సులో సీఎం చంద్రబాబు ప్రతిపాదన

ఆ దేశ వాణిజ్య మంత్రితో భేటీ.. ఇతర దేశాల ప్రతినిధులతోనూ..



11

ఏడాదిన్నర తర్వాత బయటికొస్తా!


అప్పుడే పాదయాత్ర చేస్తా: జగన్

రెండేళ్లయ్యాయి.. ఇక మిగిలింది మూడేళ్లే

ఇప్పుడు ప్రజలు నన్ను కోరుకుంటున్నారు

ఏలూరు నేతల భేటీలో వైసీపీ అధ్యక్షుడు

లోటు రూ.15,651 కోట్లు!



2026-27 కోసం డిస్కమ్‌ల ప్రతిపాదన

ఇప్పటికే ఏపీఈఆర్సీకి నివేదన

దీనిపై నేడు, రేపు విజయవాడలో ప్రజాభిప్రాయ సేకరణ

గృహ వినియోగదారులపై ఆ భారం మోపం: డిస్కమ్‌లు

వాణిజ్య వినియోగదారుల నుంచే లోటు భర్తీ

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఆదాయ వ్యయాల మధ్య 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.15,651 కోట్ల లోటును మూడు డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. అయితే, గృహ వినియోగదారులపై ఆ భారం మోపబోమని స్పష్టం చేశాయి. వాణిజ్య వినియోగదారుల నుంచే ఈ మొత్తం లోటును భర్తీ చేసుకుంటామని తెలిపాయి. ఈ మేరకు విద్యుత్తు నియంత్రణ మండలికి (ఏపీఈఆర్సీ) గత ఏడాది నవంబరులో ప్రతిపాదనలు సమర్పించాయి. వీటిపై ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రజాభిప్రాయాన్ని ఏపీఈఆర్సీ సేకరిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 20న తిరుపతిలో ప్రజాభిప్రాయసేకరణ చేపట్టగా, గురు, శుక్రవారాల్లో విజయవాడలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రెండు రోజులపాటు ఏపీఈఆర్సీ ఇన్‌చార్జి చైర్మన్ పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో డిస్కమ్‌లు ప్రతిపాదించిన విద్యుత్తు యూనిట్ల ధరలు, వివిధ కేటగిరీల టారిఫ్‌లపై వినతులు, అభిప్రాయాలు సేకరిస్తారు. 27న కర్నూలులో

మిగతా 13వ పేజీలో...



చట్టసభల సభాపతుల మహాసభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

ఎమ్మెల్యేలకు నో వర్క్.. నో పే!

అప్పటికీ వినకుంటే రీకాల్ చేసే హక్కును ప్రజలకు కల్పించాలి

అవసరమైతే చట్టాన్ని సవరించాలి

అఖిల భారత స్పీకర్ల సమావేశంలో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు

13



12

ఉదయనిధిది విద్వేష ప్రసంగమే

సనాతనంపై ఆయన వ్యాఖ్యలు హిందువులకు వ్యతిరేకం

ఒక జాతినే నిర్మూలించాలనేలా వ్యాఖ్యలు

కానీ, తమిళనాడులో ఆయనపై కేసు పెట్టరు

పైగా ఆ వ్యాఖ్యల్ని ఖండించిన వ్యక్తిపై కేసా?

హిందూమతంపై డీఎంకే వరుస దాడులు

వందేళ్లుగా సాగుతున్నా చర్యలేమీ ఉండవు

మదురై డివిజన్ బెంచ్ తీవ్ర వ్యాఖ్యలు

ఉదయనిధి రాజీనామా చేయాలి: బీజేపీ

రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకే వెళ్లండి!

మద్యం స్కామ్ నిందితులకు సుప్రీం షాక్


హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేమని స్పష్టీకరణ

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పల పిటిషన్ కొట్టివేత

అరెస్టు నుంచి రక్షణ పొడిగింపు

ట్రయల్ కోర్టులో బెయిల్ రాకుంటే హైకోర్టును ఆశ్రయించవచ్చన్న బెంచ్

ఇందుకోసం వారికి 2 వారాలు వెసులుబాటు



న్యూఢిల్లీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులకు సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకే వెళ్లాలని అప్పటి సీఎంవో కార్యదర్శి కె.ధనుంజయ్‌రెడ్డి, నాటి సీఎం జగన్‌కు ఓఎస్డీగా పనిచేసిన కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు సర్వోన్నత న్యాయస్థానం

మిగతా 11వ పేజీలో...



వసంత రాయులు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

అండగా ఉండి ఆదుకుంటాం

పార్టీ క్రియాశీల సభ్యుడి కుటుంబానికి పవన్ భరోసా

కృష్ణా జిల్లా పెదచందాలకు వచ్చిన డిప్యూటీ సీఎం

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వసంత రాయులు కుటుంబ సభ్యులకు పరామర్శ

11

పన్నుల ఆదాయం పెంచాలి!



వ్యాపారులతో స్నేహంగా ఉండాలి

రిటర్న్ ఫైలింగ్‌ను నూరు శాతానికి చేర్చాలి

ఆటో అప్రూవల్ దుర్వినియోగం కాకుండదు

వాణిజ్య పన్నుల అధికారులకు మంత్రి పయ్యావుల దిశానిర్దేశం

11

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు

రూ.60 కోట్లు

రెండో విడత రాయితీ నిధులు విడుదల

3,617 మందికి లబ్ధి: మంత్రి కొండపల్లి

14

దయాఫ్రం వాల్‌ను చాలా వేగంగా కట్టారు!

11

పోలవరం పనుల్లో నాణ్యత బాగుంది

డీఎస్ఎం అవసరం లేదు: విదేశీ నిపుణులు

ప్రాజెక్టు ప్రాంతంలో ముగిసిన పర్యటన

నేడు బొమ్మూరులో పీపీఏ ఆఫీసులో భేటీ

రేపు ఢిల్లీలో పీపీఏ సీఈవోతో సమావేశం

ఆరావళిలో అక్రమ మైనింగ్‌పై నిపుణుల కమిటీ

- సభ్యుల ఎంపిక కోసం 4 వారాల్లో పేర్లు సూచించండి
- సొలిసిటర్ జనరల్, అమికస్ క్యూరీకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ, జనవరి 21: ఆరావళి పర్వతాల్లో అక్రమ మైనింగ్ కారణంగా పర్యావరణానికి పూడ్చలేని నష్టం జరుగుతుందన్న ఆందోళనల నేపథ్యంలో ఆ పర్వతాల్లో జరుగుతున్న మైనింగ్, సంబంధిత సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని నియమిస్తామని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఆరావళి పర్వతాల్లో జరుగుతున్న మైనింగ్, ఇతర సమస్యలపై ఆ కమిటీ పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తుందని పేర్కొంది. కమిటీ నియామకం కోసం 4 వారాల్లో మైనింగ్‌లో విశేష అనుభవం ఉన్న పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తల పేర్లను సూచించాలని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎమ్ పంచోలీతో కూడిన ధర్మాసనం అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి, అమికస్ క్యూరీ పరమేశ్వర్‌ను ఆదేశించింది. ఈకమిటీ సుప్రీంకోర్టు మార్గదర్శకత్వంలో, పర్యవేక్షణలో పనిచేస్తోందని ధర్మాసనం స్పష్టం చేసిం ది. ఆరావళి పర్వతాల ఎత్తును నిర్వచిస్తూ నవంబరు 20న ఇచ్చిన తీర్పు ను నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం పొడిగించింది. ఆరావళి పర్వతాల్లో అక్రమ మైనింగ్ జరగొద్దని, అదే జరిగితే పర్యావరణ పరంగా తీవ్ర విపరిణామాలు సంభవిస్తాయని, వాటిని పూడ్చలేమని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

నాలుగోసారి తల్లి కాబోతున్న ఉషా వాన్స్

న్యూఢిల్లీ, జనవరి 21: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణి ఉషా వాన్స్ నాలుగో బిడ్డకు జన్మనివ్వనున్నారు. మంగళవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ శుభవార్తను పంచుకున్నారు. 'ఉష గర్భవతి అని తెలియజేయడానికి చాలా సంతోషిస్తున్నాం. ఈసారి పుట్టబోయేది అబ్బాయి. జూలై నెలాఖరులో ఆ చిన్నారికి స్వాగతం పలకడానికి మేమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం' అని ఆ పోస్టులో వాన్స్ పేర్కొన్నారు. ఇప్పటికే ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు ఎవాన్(8), వివేక్(5), మిరాబెల్(4) ఉన్నారు. భర్త పదవిలో ఉన్నప్పుడు అమెరికా ఉపాధ్యక్షుడి భార్య గర్భవతి కావడం ఇదే తొలిసారి. కాగా, కొన్ని వారాల క్రితం ఉషా వాన్స్ చేతి కి వెడ్డింగ్ రింగ్ లేకపోవడం, ఆమె మతం మారుతుందని ఆశిస్తున్నామంటూ జేడీవాన్స్ వ్యాఖ్యానించడంతోపాటు ఎరికా కిర్క్‌తో కలిసి ఆయన వేదిక పంచుకున్న సమయంలో జరిగిన పరిణామాలు తీవ్ర దుమారం రేపాయి. ఈ దంపతులు విడాకులకు సిద్ధమవుతున్నారంటూ వదంతులు వ్యాపించాయి. తాజా ప్రకటనతో వాటికి చెక్ పెట్టినట్లయింది.

అటల్ పెన్షన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు

న్యూఢిల్లీ, జనవరి 21: అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు పెన్షన్ ఇచ్చేందుకు తీసుకొచ్చిన అటల్ పెన్షన్ యోజన (ఏపీవై)ను మరో ఐదేళ్లపాటు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకాన్ని పొడిగిస్తూ కేంద్ర క్యాబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈ పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలని, తగినన్ని నిధులు సమకూర్చాలని తీర్మానించింది. 2015 మార్చి 9న ప్రారంభించిన అటల్ పెన్షన్ పథకం కింద 60 ఏళ్లు దాటిన అసంఘటిత రంగ కార్మికులకు పెన్షన్ అందజేస్తున్నారు.

ఎన్డీఏ కూటమిలోకి టీటీవీ దినకరన్

చెన్నై, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బహిష్కృతనేత, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ బుధవారం ఎన్డీఏ కూటమిలో చేరారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టాలని ప్రతిపక్ష అన్నాడీఎంకే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ బీజేపీతో జత కట్టింది. అనంతరం ఈ కూటమిలో అన్బుమణి నేతృత్వంలోని పీఎంకే వర్గం చేరింది. ఈ క్రమంలో ఎన్డీఏ సీఎం అభ్యర్థిగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని అంగీకరించమంటూ ప్రకటనలు గుప్పించిన టీటీవీ దినకరన్ బుధవారం చెన్నైకి వచ్చిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఎన్డీఏ కూటమిలో చేరుతున్నట్టు ప్రకటించారు. ఇదిలా ఉండగా మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం మద్దతుదారుడు, అన్నాడీఎంకే ఎమ్మెల్యే వైద్యలింగం డీఎంకేలో చేరారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన వైద్యలింగం, డీఎంకే కార్యాలయానికి వెళ్లి సీఎం ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

ఆ బంధంలో మహిళకు 'భార్య' హోదా

- గాంధర్వ/ ప్రేమ వివాహంగా పరిగణన
- అప్పుడే ఆమెకు రక్షణ దొరుకుతుంది
- సహజీవన సంబంధాలపై మద్రాస్ హైకోర్టు సూచన

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సహజీవన (లివింగ్ టుగెదర్) సంబంధాల్లో, మహిళలకు గాంధర్వ/ప్రేమ వివాహం కింద 'భార్య' హోదా కల్పించడం ద్వారా వారిని రక్షించాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం అభిప్రాయపడింది. అప్పుడే ఆ సంబంధంలో సమస్యలున్నా, ఆమె 'భార్య' హోదాతో తట్టుకోగలుగుతుందని పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని మాయమాటలతో నమ్మించి సహజీవనం చేసిన ఓ యువకుడు ముందస్తు బెయిలు కోరుతూ దాఖలుచేసిన పిటిషన్ కొట్టివేస్తూ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.శ్రీమతి ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రాచీన భారతదేశంలో ఉన్న 8 రకాల వివాహాల్లో ఒకటి గాంధర్వ వివాహం. అదే ప్రేమ వివాహం. సహజీవన సంబంధాలను ఆ వివాహాలుగా గుర్తించవచ్చు. అమ్మాయిలు తాము ఆధునికులమని భావించి సహజీవన సంబంధాన్ని ఎంచుకుంటున్నారు. కొంతకాలం తర్వాత వివాహం ద్వారా లభించే రక్షణ ఏదీ సహజీవనంలో లభించదని వారు గ్రహించినప్పుడు, వాస్తవం నిప్పులా వారిని దహించడం ప్రారంభిస్తుంది. ఇలాంటి వ్యవహారాల్లో మహిళలకు రక్షణ కల్పించేది బీఎన్ఎస్‌లోని సెక్షన్ 68 మాత్రమే. ఈ సెక్షన్ కింద నమోదైన కేసుల్లో పురుషులు బీఎన్ఎస్ సెక్షన్ 69 కింద విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

రాంమాధవ్‌కు మళ్లీ పెద్దపీట!

- బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికలకు ఇన్‌చార్జిగా నియామకం

న్యూఢిల్లీ, జనవరి 21: బీజేపీ సీనియర్ నేత రాంమాధవ్‌కు ఆ పార్టీ నాయకత్వం మరోసారి కీలక బాధ్యతలు అప్పగించింది. బుధవారం ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్.. మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర ఆఫీసు బేరర్లతో సమావేశమయ్యారు. ఈ ఏడాది అసెంబ్లీ, మున్సిపల్ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకూ ఇన్‌చార్జులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా రాంమాధవ్‌ను బృహద్ బెంగళూరు మహానగర్ పాలికె (బీబీఎంపీ) ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించారు. సీనియర్ నాయకుడు వినోద్ తావ్‌డేకు కేరళ బాధ్యతలు అప్పగించారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె సహఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. తావ్‌డే చండీగఢ్ కార్పొరేషన్ ఎన్నికల పరిశీలకుడిగానూ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఇక తెలంగాణ మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు మహారాష్ట్ర మంత్రి ఆశీష్ శేలార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. రాజస్థాన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు అశోక్ పర్నామీ, బీజేపీ రాజ్యసభ సభ్యురాలు రేఖా శర్మ సహ ఇన్‌చార్జులుగా ఆయనకు సహకరిస్తారు.

రాంమాధవ్.. ఐదేళ్ల తర్వాత తెరపైకి: ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాంమాధవ్ 2003 నుంచి 2014 వరకు ఆర్ఎస్ఎస్ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. నరేంద్ర మోదీ సారథ్యంలో బీజేపీ 2014 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచాక.. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన అమిత్‌షా అదే ఏడాది రాంమాధవ్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీరు ఇన్‌చార్జిగా ఆయన పని చేశారు. ఈశాన్య భారతంలో చిన్న చిన్న పార్టీలతో పొత్తులతో బీజేపీని అక్కడ బలోపేతం చేశారు. గట్టి వ్యూహకర్తగా పేరు సంపాదించారు. 2020లో జేపీ నడ్డా బీజేపీ అధ్యక్షుడయ్యాక చేసిన సంస్థాగత మార్పులతో రాంమాధవ్ తిరిగి ఆర్ఎస్ఎస్‌లోకి వెళ్లారు. గత ఏడాది జరిగిన జమ్మూకశ్మీరు అసెంబ్లీ ఎన్నికలకు మళ్లీ బీజేపీ ఇన్‌చార్జిగా వెళ్లారు. ఆ ఎన్నికల్లో 29 స్థానాలతో బీజేపీ రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఇప్పుడా పార్టీ బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మే నెలలో జరిగే ఈ ఎన్నికల్లో విజయం సాధించి.. అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో మరింత బలోపేతమయ్యే లక్ష్యంతో రాంమాధవ్‌ను బీజేపీ బరిలోకి దించినట్లు చెబుతున్నారు.

ఆఫీసు బేరర్లతో విస్తృత చర్చలు: బుధవారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో నితిన్ నబీన్ అధ్యక్షతన తొలిసారి జాతీయ ఆఫీసు బేరర్ల సమావేశం జరిగింది. తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్, కేరళ, అసోం ఎన్నికల సన్నాహాలు, సంస్థాగత బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఏపీ, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు కూడా పాల్గొని తమ రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితిపై నివేదికలిచ్చారు.

తుపాకులు అమర్చిన రోబో డాగ్స్!

గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించనున్న సైన్యం



న్యూఢిల్లీ, జనవరి 21: భారత సైన్యం సరికొత్త రోబోటిక్ ఆయుధాలను సమకూర్చుకుంది. ఇటీవల ఆర్మీ తన ఆయుధ సంపత్తిలోకి 100 రోబోటిక్ మ్యూల్స్ (మల్టీ యుటిలిటీ లెగ్డ్ ఎక్విప్‌మెంట్)ను ప్రవేశపెట్టింది. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరగనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్ రిహార్సల్స్‌లో భాగంగా తుపాకులు అమర్చిన రోబోటిక్ డాగ్‌లను ఆర్మీ ప్రదర్శించింది. నాలుగు కాళ్లు కలిగి ఉండే ఈ రోబోలను తొలుత ఐపీఎల్‌లో వినియోగించగా.. అందరి దృష్టినీ ఆకర్షించాయి. వాటికి కెమెరాలను అమర్చి క్రికెట్ మ్యాచ్‌ల చిత్రీకరణకు వాడారు. తాజాగా ఆ రోబోటిక్ డాగ్‌లకు రైఫిళ్లు అమర్చి, సైన్యం రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రదర్శించనుంది. ఇక రిపబ్లిక్ డే పరేడ్‌లో డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన దీర్ఘ శ్రేణి 'యాంటీ షిప్ హైపర్‌సోనిక్ గ్లైడ్ క్షిపణి'ని కూడా 77వ గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించనున్నారు. 1500 కి.మీ. రేంజ్ కలిగిన ఈ క్షిపణితో హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత రక్షణ సామర్థ్యాలకు మరింత ఊతమిచ్చినట్లవుతుంది.

లోకం తీరు



గ్రీన్‌లాండ్ స్వాధీనానికి బలప్రయోగం చేయను

దాన్ని డెన్మార్క్‌కు అప్పగించడమే మా బుద్ధి తక్కువ పని.. దావోస్‌లో ట్రంప్

> "గ్రీన్‌లాండ్.. అమెరికా, రష్యా, చైనా మధ్య వ్యూహాత్మక ప్రాంతంలో ఉంది. భద్రతా కారణాల రీత్యానే అమెరికా ఆ భూభాగాన్ని కోరుకుంటోంది తప్ప అరుదైన ఖనిజాల కోసం కాదు. అమిత శక్తిని, బలాన్ని ఉపయోగిస్తే తప్ప మాకు అది దక్కకపోవచ్చు. అలా చేస్తే మమ్మల్ని ఆపే శక్తి కూడా ఏదీ లేదు. కానీ, నేను అలా చేయను. దాన్ని స్వాధీనం చేసుకోవడం కోసం నేను బలప్రయోగం చేస్తానని అందరూ అనుకుంటున్నారు. అలా చేయాలని నేను అనుకోవట్లేదు. చేయను కూడా. ఆ అతి పెద్ద మంచు ఖండాన్ని ఒక్క అమెరికా మాత్రమే కాపాడగలదు. దాన్ని అభివృద్ధి చేయగలదు. అలా కాపాడాలంటే యాజమాన్య హక్కు కావాలి. లీజులతో కుదరదు. వాస్తవానికి అది ఉత్తర అమెరికాలో భాగం. పశ్చిమార్థ గోళానికి ఉత్తర హద్దులో ఉంది. అది మా భూభాగం. అందుకే అమెరికా ఆ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడానికి సంబంధించిన చర్చలు వెంటనే ప్రారంభం కావాలని నేను కోరుకుంటున్నాను."
>
> - దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

దావోస్, జనవరి 21: గ్రీన్‌లాండ్‌పై కన్నేసి ఆ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. దాన్ని బలప్రయోగంతో స్వాధీనం చేసుకోబోమని దావోస్‌లో హామీ ఇచ్చారు. గ్రీన్‌లాండ్‌ను ఒక్క అమెరికా మాత్రమే కాపాడగలదన్న ఆయన.. యూరప్ సరైన దిశలో ప్రయాణించట్లేదని అసంతృప్తి వెలిబుచ్చారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో దాదాపు 70 నిమిషాలపాటు ప్రసంగించిన ట్రంప్.. రెండోసారి అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటిదాకా సాధించిన విజయాల గురించి, గ్రీన్‌లాండ్ గురించి, సుంకాలు, పర్యావరణం, వలసలు.. ఇలా పలు అంశాల గురించి ప్రస్తావించారు. "చాలామంది స్నేహితులు, కొద్దిమంది శత్రువులకు అభినందనలు" అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన ట్రంప్.. తన ప్రసంగంలో గ్రీన్‌లాండ్ గురించే ప్రధానంగా ప్రస్తావించారు. రెండో ప్రపంచయుద్ధ సమయానికి అమెరికా అతి పెద్ద శక్తి అని.. గ్రీన్‌లాండ్‌ను తామే రక్షించి, యుద్ధం ముగిసిన తర్వాత డెన్మార్క్‌కు అప్పగించామని.. ఇప్పుడు తమ దేశం మరింత శక్తిమంతమైనదని గుర్తుచేశారు. "అమెరికా తప్ప.. ఏ ఒక్కదేశమో, దేశాల కూటమో గ్రీన్‌లాండ్‌ను కాపాడలేదు. అమెరికా అతి పెద్ద శక్తి. అందరూ అనుకుంటున్నదానికన్నా శక్తిమంతమైనది. ఈ విషయాన్ని వెనెజువెలాలో రెండువారాల క్రితమే అంతా గమనించి ఉంటారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో డెన్మార్క్ జర్మనీతో కేవలం ఆరుగంటలపాటు పోరాడి చేతులెత్తేసినప్పుడు.. తననుగానీ, గ్రీన్‌లాండ్‌నుగానీ కాపాడుకోలేని సమయంలో అమెరికా రంగంలోకి దిగింది" అని గుర్తుచేశారు. అసలు ఆనాడు తాము (అమెరికా) వారికి ఆ భూభాగాన్ని ఇవ్వడమే బుద్ధి తక్కువ పని అని వ్యాఖ్యానించారు. అప్పుడు తామే లేకపోతే ఈపాటికి డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌వాసులు జర్మన్, కొద్దిపాటి జపనీస్ మాట్లాడుతూ ఉండేవని ఎద్దేవా చేశారు. డెన్మార్క్‌కు కృతజ్ఞత లేదన్న ట్రంప్.. ఆ దేశం నుంచి గ్రీన్‌లాండ్‌ను తీసుకునే విషయంలో తక్షణమే చర్చలు జరగాలని అభిప్రాయపడ్డారు.



గతంలో యూరప్ దేశాలు కూడా ప్రపంచంలో పలు భూభాగాలను స్వాధీనం చేసుకున్నాయి కాబట్టి.. తాను గ్రీన్‌లాండ్‌ను అడగడంలో తప్పేమీ లేదని సమర్థించుకున్నారు. ఈ సందర్భంగా.. తన గ్రీన్‌లాండ్ ఆశకు అడ్డంకిగా నిలుస్తున్న నాటో సభ్య దేశాలకు ఆయన ఒక హెచ్చరిక కూడా జారీ చేశారు. దశాబ్దాలుగా వారికి తాము ఇచ్చిన దానికన్నా వారి నుంచి అడుగుతున్నది చాలా తక్కువని గుర్తుచేశారు. "(గ్రీన్‌లాండ్ స్వాధీనానికి) మీరు సరేనంటే మేం కృతజ్ఞులుగా ఉంటాం. 'కాదు' అంటే మాత్రం.. మేం గుర్తుపెట్టుకుంటాం" అని పరోక్షంగా హెచ్చరించారు. మళ్లీ అంతలోనే.. "ఇది నాటో కు హెచ్చరిక కాదు" అని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.

యూరప్‌పై అసహనం..

ప్రపంచ దేశాలపై తాను విధించిన సుంకాల ద్వారా వస్తున్న ఆదాయాన్ని అమెరికా పరోగతి కోసం, ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నట్టు ట్రంప్ తెలిపారు. రెండేళ్ల క్రితం అమెరికా ఒక మృత దేశమని.. ఇప్పుడు మళ్లీ బతికి, బలంగా నిలబడిందని, అమెరికన్లుతనను ఎన్నుకున్నందుకు ఆనందంగా ఉన్నారని సొంత గొప్పలు చెప్పి, జబ్బలు చరుచుకున్నారు. "ఈ భూగోళానికి అమెరికా ఆర్థిక ఇంజన్‌లాంటిది. అమెరికా ఎదిగినప్పుడు ప్రపంచం మొత్తం ఎదుగుతుంది. ఇదే చరిత్ర" అని ఘనంగా చెప్పుకొన్న ఆయన.. యూరప్ దేశాలపై మాత్రం అసహనం వ్యక్తం చేశారు. యూరప్ ప్రజల గురించి అమెరికా ఆలోచిస్తుందని.. తన తాతముత్తాతలు కూడా యూరప్ నుంచి వచ్చినవారే కాబట్టి, తనకు కూడా యూరప్‌తో లోతైన అనుబంధం ఉందని పేర్కొన్నారు. కానీ.. యూరప్ తనంత తానుగా బలహీనపడుతోందని అభిప్రాయపడ్డారు. యూరప్‌ను బలహీన ఖండంగా అభివర్ణించారు. "యూరప్ దేశాలు ఇప్పుడు తమ మార్గాన్ని మార్చుకోవాలి. గత పదేళ్లలో అవి ఏర్పరచుకున్న ఆలోచనాసరళిని విడిచి బయటకు రావాలి. వారు తమను తామే నాశనం చేసుకుంటున్నారు. మాకు బలమైన మిత్రులు కావాలి. బలహీనమైన మిత్రులు కాదు. యూరప్ బలంగా ఉండాలని మేం కోరుకుంటున్నాం." అని ట్రంప్ స్పష్టం చేశారు. వలసలు, ఆర్థిక ప్రగతి, సంస్కృతి వంటి విషయాల్లో యూరప్ తీసుకుంటున్న నిర్ణయాలు అంతర్గత రాజకీయాలకే పరిమితం కావని.. వాటి ప్రభావం ఆ దేశాల భద్రతతో పాటు, అమెరికా, ప్రపంచ భద్రతపై కూడా పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్‌పై..

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని గంటల వ్యవధిలో పరిష్కరించగలనని తాను అనుకున్నానని.. కానీ, అదంత సులభం కాదని అర్థమైందని ట్రంప్ తెలిపారు. అయితే, ఆ యుద్ధాన్ని ఆపే ఒప్పందానికి తాను బాగా దగ్గరలో ఉన్నానని ఆయన పేర్కొన్నారు. పుతిన్, జెలెన్‌స్కీ ఈ యుద్ధాన్ని ఇప్పుడు ఆపకపోతే అది మూర్ఖత్వమేనన్నారు. "కానీ వాళ్లు మూర్ఖులు కాదని నాకు తెలుసు" అని వ్యాఖ్యానించారు. తన ప్రసంగంలో పర్యావరణ లాబీ గురించి కూడా ప్రస్తావించిన ట్రంప్.. యూరప్‌లో కొంతమంది మూర్ఖులు పవనవిద్యుత్తు విషయంలో అమాయకంగా వ్యవహరిస్తున్నారని.. చైనా వారికి విండ్‌మిల్స్‌ను విక్రయించి సొమ్ము చేసుకుంటోందని ఎద్దేవా చేశారు. చైనాలో ఎక్కడా విండ్‌మిల్స్ ఉన్నట్టు తాను చూడలేదని.. వాటివల్ల పక్షులు చనిపోతాయని, ప్రకృతి అందాలను చెడగొడతాయని.. మూర్ఖులే వాటిని కొంటారని దుయ్యబట్టారు. "విద్యుత్తు ద్వారా డబ్బు సంపాదించాలి తప్ప కోల్పోకూడదు. విండ్‌మిల్స్ వల్ల డబ్బు కోల్పోతారు" అని పేర్కొన్నారు. ఇక, అమెరికా నుంచి ఎన్నో ఉచితాలను పొందుతున్న కెనడా.. అమెరికా పట్ల కృతజ్ఞతగా ఉండాలని వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు కంటి సమస్య కారణంగా పెట్టుకున్న కళ్లజోడు గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. "ఆ అందమైన చలువ కళ్లద్దాలతో ఆయన్ను నిన్న చూశాను. అసలేం జరిగింది?" అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. ప్రసంగం అనంతరం 20 నిమిషాలపాటు ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. భారత ప్రధాని మోదీ పట్ల తనకు గౌరవం ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారత్‌తో మంచి వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అలా చేస్తే ఇరాన్.. భూమ్మీదే లేకుండా పోతుంది

- తన జోలికి వస్తే ఆ దేశమే ఉండదని ట్రంప్ హెచ్చరిక
- ఖమేనీ పాలన త్వరలోనే అంతమవుతుందని వ్యాఖ్య

వాషింగ్టన్/న్యూఢిల్లీ, జనవరి 21: తన జోలికి వస్తే, తనకేమైనా అయితే ఇరాన్ భూమ్మీదే లేకుండా పోతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. వారేమైనా చేస్తారో లేదోగానీ తాను ఏం చేస్తాననేది మాత్రం చెబుతున్నానని పేర్కొన్నారు. ఇరాన్ ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో ఖమేనీ ప్రభుత్వం దిగిపోవాలంటూ ఆ దేశంలో ఆందోళనలు జరుగుతున్నాయి. అవి హింసాత్మకంగా మారి వేలాది మంది మరణించారు. ఈ క్రమంలో ఆందోళనకారులు చంపితే.. ఇరాన్‌పై దాడి చేస్తామని కొన్ని రోజుల క్రితం ట్రంప్ హెచ్చరించారు. తాజాగా త్వరలోనే ఇరాన్‌లో ఖమేనీ పాలన అంతమవుతుందని పేర్కొన్నారు. అయితే అమెరికా ఖమేనీకి వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు చేపట్టినా.. ఆ ఒక్క చేతినే కాదు, మొత్తం ప్రపంచాన్నే తగలబెడతామని, ట్రంప్‌ను చంపేస్తామని ఇరాన్ సైన్యం అధికార ప్రతినిధి అబోల్ ఫజల్ షెకార్చి వ్యాఖ్యానించారు. దానికితోడు ఇరాన్‌పై దాడికి దిగితే.. తమవద్ద ఉన్న అన్ని రకాల ఆయుధాలతో ప్రతిదాడికి దిగుతామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి బుధవారం దావోస్ సదస్సు వేదికగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు.

పశ్చిమాసియా వైపు అమెరికా సేనలు

సుమారు వారం రోజుల క్రితమే ఇరాన్‌పై దాడికి ట్రంప్ సిద్ధమయ్యారని.. ఇజ్రాయెల్, అరబ్ దేశాల విజ్ఞప్తితో వాయిదా వేశారని వార్తలు వచ్చాయి. దానితో ఇప్పట్లో దాడి చేయకపోవచ్చని భావించారు. కానీ అమెరికా తన సేనలను పశ్చిమాసియా వైపు తరలిస్తోంది. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను ఎత్తుకెళ్లడానికి ముందు కరీబియన్ ప్రాంతంలో మోహరించిన విమాన వాహక నౌకలు, ఆగ్నేయాసియా ప్రాంతంలోని సైనిక స్థావరాల నుంచి పేట్రియాట్, థాడ్ క్షిపణి వ్యవస్థలను పశ్చిమాసియాకు తరలించి, కీలక ప్రాంతాల్లో మోహరిస్తోందని రక్షణ పరిశోధన వెబ్‌సైట్లు వెల్లడించాయి.

ఒక్కో యుద్ధానికి ఒక నోబెల్ ఇవ్వాలి: ట్రంప్

తాను ఎన్నో యుద్ధాలు ఆపానని, నిజానికి తనకు ఒక్కో యుద్ధానికి సంబంధించి ఒక్కో నోబెల్ ఇవ్వాల్సిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం వ్యాఖ్యానించారు. తనకు ఆ బహుమతి అందకపోయినా.. తాను లక్షలాది మంది ప్రజల ప్రాణాలు కాపాడానని చెప్పారు. నోబెల్ శాంతి బహుమతిపై ఆశలు పెట్టుకున్న ట్రంప్.. తనకు ప్రకటించకపోవడంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న విషయం తెలిసిందే. నార్వే ప్రధాని కావాలనే తనకు నోబెల్ ఇవ్వకుండా అడ్డుపడ్డారని కూడా ట్రంప్ ఇటీవల ఆరోపించారు. కానీ నోబెల్ బహుమతులకు ఎంపికలను నోబెల్ కమిటీయే చూసుకుంటుందని, నార్వే ప్రధాని జోనాస్ గహెర్ ప్రకటించారు.

ట్రంప్‌కు యూరప్ బానిస కాదు

(మొదటిపేజీ తరువాయి)

డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రధానులు మెట్టే ఫ్రెడరిక్‌సెన్, జెన్స్ ఫ్రెడరిక్ నీల్సెన్, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ తదితరులు కూడా ట్రంప్ విధానాలను తీవ్రంగా ఖండించారు. యూరప్ దేశాలన్నీ ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు. ట్రంప్‌కు యూరప్ బానిస కాదని బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డె వీవర్ దావోస్‌లో తేల్చి చెప్పారు. మార్క్ కార్నీ ప్రసంగానికి సభికులంతా లేచి నిలబడి చప్పట్లు కొట్టారు.

సామ్రాజ్యవాదం పెరుగుతోంది: మేక్రాన్

ప్రపంచంలో ప్రస్తుతం కొన్ని దేశాలకు సామ్రాజ్యవాద కోరికలు మళ్లీ పెరుగుతున్నాయని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ విమర్శించారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. మనం బెదిరించేవాళ్లకు, క్రూరమైన చట్టాలకే గౌరవం ఇస్తున్నామంటూ ప్రస్తుత యూరప్ విధానాలను తూర్పారబట్టారు. '2024లో 60 యుద్ధాలు జరిగాయి. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలను ధ్వంసం చేస్తున్నారు. బలవంతుడిదే రాజ్యం అనే పరిస్థితి తీసుకొస్తున్నారు. సహకారం, భాగస్వామ్యం లేని ప్రపంచం తీవ్రమైన పోటీకి దారితీస్తుంది. సమస్య సద్దుమణిగిందని అనుకోవద్దు. ద్వైపాక్షిక వాణిజ్యం విషయంలో అమెరికా డిమాండ్లు యూర్ఎను బలహీనపర్చి, ఆశ్రిత పక్షంగా ఉండేలా చేసేందుకే. అడ్డు అదుపు లేని సుంకాలను ఒప్పుకొనే ప్రసక్తే లేదు. యూరప్ వద్ద కూడా బలమైన ఆయుధం ఉంది. అదే ట్రేడ్ బజూకా (ఇతర దేశాలు యూరప్ మార్కెట్లలోకి ప్రవేశించటాన్ని కఠినతరం చేసే విధానం). మనపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్నవారిపై దీనిని ప్రయోగించే సమయం ఆసన్నమైంది. ఈ విషయంలో యూరప్ వెనక్కు తగ్గొద్దు' అని సూచించారు. గాజా పునర్నిర్మాణం కోసం ట్రంప్ ప్రకటించిన బోర్డ్ ఆఫ్ పీస్‌లో చేరబోమని కూడా ఫ్రాన్స్ అధికారులు ప్రకటించారు.

రూల్స్ పాటిస్తే సురక్షితంగా ఉంటామన్న గ్యారెంటీ లేదు: కార్నీ

ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలు పాటిస్తే సురక్షితంగా ఉంటామన్న గ్యారెంటీ చిన్న, బలహీన దేశాలకు లేదని కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆందోళన వ్యక్తంచేశారు. డబ్ల్యూఈఎఫ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 'మనం ఇప్పుడు పరిణామ దశలో కాకుండా ఒక చీలిక మధ్యలో ఉన్నాం. పాత పరిస్థితులు మళ్లీ రావు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం అంతా నడుస్తుందని అనుకోవటం తప్పు అని మనకు అర్థమైంది. బలవంతులు తమ అవసరాల కోసం ఈ చట్టాల నుంచి తమను తాము మినహాయించుకుంటున్నారు. ఒక పద్ధతి అంటూ లేకుండా వాణిజ్య నిబంధనలు రూపొందిస్తున్నారు. ఇది ఎంతోకాలం కొనసాగదు. శక్తిమంతమైన దేశాలు ఆర్థిక బలిమిని ఆయుధంగా వాడుకొంటున్నాయి' అని ఆరోపించారు. గ్రీన్‌లాండ్ విషయంలో డెన్మార్క్‌కు ఆయన మద్దతు ప్రకటించారు.

ట్రంప్ అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్

ట్రంప్ అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్‌గా మారి తన కు ఇష్టమైనవన్నీ లాక్కోవటానికి ప్రయత్నిస్తున్నారని బ్రిటన్ ఎంపీ ఎడ్ డేవీ ఆ దేశ పార్లమెంటు లో విమర్శించారు. మిత్రదేశాలపై ట్రంప్ సుంకా లు విధించటం సరికాదని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మన్ అన్నారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామన్న ట్రంప్ ప్రకటన అంతర్జాతీయ చట్టాలను ప్రమాదంలో పడేసిందని గ్రీన్‌లాండ్ ప్రధా ని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సెన్ విమర్శించారు. 'మనముందు ఇప్పుడున్న పరిస్థితులు చాలా దారుణమైనవి. మనం వివాదాలు కోరుకోవటం లేదు. స్థిరమైన సహకారాన్నే ఆశిస్తున్నాం' అని డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడరిక్‌సెన్ స్పష్టంచేశారు. ఈయూ పార్లమెంటులో డెన్మార్క్ సభ్యుడు ఆండ్రెస్ విస్టిసెన్.. ఏకంగా ట్రంప్‌ను బూతులు తిట్టారు. బ్లాక్‌మెయిల్‌కు లొంగబోమని జర్మనీ ఆర్థిక మంత్రి లార్స్ క్లింగ్‌బీల్ స్పష్టంచేశారు. వాణిజ్యాన్ని రాజకీయాల కోసం వాడుకోవటం మంచిది కాదని యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా సూచించారు.

మా మీద భారీగా పన్నులు వేయండి

దావోస్‌కు హాజరైన దేశాల అధినేతలను ఉద్దేశించి 24 దేశాలకు చెందిన 400 మంది సం'పన్ను'ల లేఖ

న్యూఢిల్లీ, జనవరి 21: ప్రభుత్వాలు విధించే పన్నుల తాకిడికి తట్టుకోలేక.. పనామా, బహమాస్ వంటి ట్యాక్స్‌ఫ్రీ దేశాలకు వెళ్లి అక్కడ స్థిరపడే సంపన్నుల గురించి వినే ఉంటారు! కానీ తొలిసారిగా.. 'కమాన్, మా మీద అధిక పన్నులు వేయండి' అంటూ 24 దేశాలకు చెందిన 400 మంది సూపర్ రిచ్ కుబేరులు దావోస్‌లో భేటీ అవుతున్న ప్రపంచ దేశాధినేతలకు ఒక బహిరంగ లేఖ రాశారు. "టైమ్ టు విన్.. వుయ్ మస్ట్ విన్ బ్యాక్ అవర్ ఫ్యూచర్. లీడర్స్ ఎట్ దావోస్, ట్యాక్స్ ద సూపర్ రిచ్ (గెలవాల్సిన సమయం.. మన భవిష్యత్తును తిరిగి పొందాలి. దావోస్‌లోని నాయకులారా, అత్యంత సంపన్నులపై పన్నులు విధించండి)' అనే శీర్షికతో రాసిన లేఖపై హాలీవుడ్ నటుడు మార్క్ రఫాలో ('హల్క్' పాత్రధారి), అబిగెయిల్ డిస్నీ (వాల్ట్ డిస్నీ మనవరాలు) వంటివారు సంతకాలు చేశారు. ఇది మనకు చాలా కొత్తగా అనిపించొచ్చుగానీ.. 'పేట్రియాటిక్ మిలియనీర్స్ (దేశభక్త కోటీశ్వరులు అనొచ్చు!)' పేరిట అమెరికాలోని అత్యంత ధనవంతులు చాలాకాలంగా ఈ డిమాండ్ చేస్తున్నారు. పేదలు, అత్యంత సంపన్నుల మధ్య నానాటికీ పెరిగిపోతున్న అంతరాలను తగ్గించడానికి తమలాంటివారిపై ప్రభుత్వం అధికంగా పన్నులు విధించాలన్నది వారి డిమాండ్. అమెరికా మిలియనీర్ల స్ఫూర్తితో కెనడా, యూకేల్లోని కొందరు మిలియనీర్లు కూడా అదే పేరుతో సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా కలిసి.. ఇదే తరహాలో పనిచేసే 'మిలియనీర్స్ ఫర్ హ్యూమానిటీ', పేదరిక నిర్మూలన కోసం అంతర్జాతీయ స్థాయిలో కృషి చేసే 'ఆక్స్‌ఫామ్' వంటి సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు ప్రపంచం నలుమూలల నుంచీ వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు, రాష్ట్రాల సీఎంలు, ఆర్థిక మంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్లు వస్తారు కాబట్టి.. సూపర్ రిచ్‌పై పన్నులు వేసేలా వారిని కోరుతూ ఈ లేఖ రాశారు. ఐదున్నర దశాబ్దాల క్రితం దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక తొలి సదస్సు జరిగినప్పుడు మానవాళి గణనీయమైన ప్రగతి అనే ఉదయకాలం ముందు నిలబడిందని.. ఈ 55ఏళ్ల కాలంలో టెక్నాలజీ, వైద్యం, సమాచార ప్రసారం, ప్రపంచ వాణిజ్యం ఇలా అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందని లేఖలో గుర్తుచేశారు. ఈరోజు ప్రపంచ ప్రజలందరూ గతంలో ఎన్నడూలేనంతగా (టెక్నాలజీ పరంగా) అనుసంధానమై ఉన్నామని.. అదే సమయంలో (ఆర్థికంగా) ఎప్పుడూ లేనంతగా విడిపోయి ఉన్నామన్నారు. దశాబ్దాలుగా సాగుతున్న ఆవిష్కరణల ప్రయాణం.. అసమానతలు, పర్యావరణ విధ్వంసంతోపాటే జరిగిందని గుర్తుచేశారు. ప్రపంచ జనాభాలో కేవలం 1శాతంగా ఉన్న అత్యంత సంపన్నుల వద్ద.. మిగిలిన జనాభాలో 95శాతం మందికన్నా ఎక్కువ ధనం పోగుపడిందన్నారు. అత్యంత ధనవంతులకు, మిగతావారికి మధ్య ఉన్న ఈ తేడా రోజురోజుకూ, తరతరాలకూ పెరుగుతూపోతోందని.. అపార సంపద కలిగిన గుప్పెడు మంది అపరకుబేరులు ప్రజాస్వామ్యాలను కొనుగోలుచేశారని.. ప్రభుత్వాలపై ఆధిపత్యం సాధించారని.. పత్రికాస్వేచ్ఛను హరించారని.. టెక్నాలజీ, ఆవిష్కరణలపై పట్టు సాధించారని, పేదరికాన్ని సామాజిక అసమానతలను పెంచేశారని ఆందోళన వెలిబుచ్చారు. తమలాంటి ధనవంతులే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారంటే.. సమాజం ప్రమాదకరమైన అంచున నిలబడి ఉందన్న విషయంలో సందేహమూ లేదన్నారు. "మన ప్రజాస్వామ్యాలు, సమాజాలు, మన భవిష్యత్తు మనకు తిరిగి కావాలి. 2026లో మనం చేయాల్సింది ఇంకా చాలా ఉంది" అని పేర్కొన్నారు. అందుకు తాము సూచిస్తున్న ప్రభావవంతమైన పరిష్కారం ఒక్కటేనని.. అది అత్యంత సంపన్నులపై అత్యధికంగా పన్నులు వేయడమన్నారు.



25న 'ఉత్తమ ఎన్నికల విధానాల అవార్డులు' ప్రదానం

- కలెక్టర్ల నుంచి బీఎల్‌వోల వరకు 61 మంది ఎంపిక
- ఓటర్ల నమోదులో అగ్రస్థానంలో పశ్చిమ గోదావరి

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా 25న నిర్వహించనున్న 'ఉత్తమ ఎన్నికల వి. దానాల అవార్డులు-2025'కు రాష్ట్రవ్యాప్తంగా 61 మం దిని కేంద్ర ఎన్నికల సంఘం ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆయా జిల్లాలకు సమాచారం పంపింది. ఓటర్ల నమోదులో విశేష ప్రతిభ కనబరిచిన పశ్చిమగోదావరి జిల్లా టాప్‌లో నిలిచింది. అత్యధిక ఓటర్ల నమోదు విభాగంలో ఈ ఒక్క జిల్లా మాత్రమే అవార్డుకు ఎంపికైంది. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చదలవాడ నాగరాణికి ఎన్నికల కమిషన్ పురస్కారం ప్రదానం చేయనుంది. విశాఖపట్నం, విజయనగరం, తిరపతి, నంద్యాల, ఎన్టీఆర్ డీఈవోలు (కలెక్టర్లు)... బెస్ట్ ఎలక్షన్ డిస్ట్రిక్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఓవరాల్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ విభాగంలో తిరుపతి, నం ద్యాల, ఎన్టీఆర్ జిల్లాల డీఈవోలు, అత్యధిక ఓటర్ల మ్యాపింగ్- 2026 (ఎస్ఐఆర్)లో ప్రకాశం, చిత్తూరు, కాకినాడ, కృష్ణా, నెల్లూరు డీఈవోలను అవార్డులకు ఎంపిక చేశారు. ఆయా జిల్లాలకు చెందిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు(ఈఆర్‌వోలు), అసిస్టెంట్ ఈఆర్‌వోలు(ఎంఆర్‌వోలు), ఎన్నికల సూపరింటెండెంట్లు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు కూడా ఈ అవార్డులకు ఎంపికయ్యారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 25న జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో వీటిని ప్రదానం చేస్తారు.

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో రూ.37 కోట్లతో 32 ఆలయాల పునర్నిర్మాణం

- మరో 300 ఆలయాలకూ మరమ్మతులు: మంత్రి ఆనం

నెల్లూరురూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల నాటికి గోదావరి నదీ పరీవా హక ప్రాంతాల్లోని 32 ప్రధాన ఆలయాలను రూ.37 కోట్లతో పునర్నిర్మించనున్నట్టు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ మండలంలోని వేదగిరి క్షేత్రంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన ఆలయాలతోపాటు 300 చిన్న ఆలయాలకు కూడా మరమ్మతులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు.

ఆ మరుసటి ఏడాది వచ్చే కృష్ణా పుష్కరాల నిర్వహణపై సీఎం చంద్రబాబు దావోస్ నుంచి రాగానే మంత్రివర్గ ఉపసంఘంతో సమీక్షించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ఆలయాలను టీటీడీతో పాటు తమ శాఖ నిధులతో నిర్మించనున్నట్టు వెల్లడించారు. వేదపండితులుగా గుర్తింపు పొందిన రాష్ట్రంలోని 599 మందికి మూడేళ్లపాటు నెలకు రూ.3 వేలు చొప్పున సంభావన అందచేస్తున్నట్టు చెప్పారు. 112 ఆలయాల్లోని అర్చకులకు నెలకు రూ.15 వేలు చొప్పున రూ.11.43 లక్షలు, ధూప, దీప నైవేద్యాలకు 450 ఆలయాలకు రూ.10 వేలు చొప్పున రూ.45 లక్షలు ప్రతి నెల తమ శాఖ నుంచి చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు.

డీఏ బకాయిల రిజెక్ట్ బిల్లులకు మళ్లీ చాన్సివ్వండి

- సీఎఫ్ఎంఎస్‌లో స్పెషల్ ఎనేబుల్ ఆప్షన్ ఇవ్వండి
- ఆర్థిక మంత్రి పయ్యావులను కోరామన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన 2018, 2019 సంవత్సరాల డీఏ, డీఆర్ బకాయిల చెల్లింపులో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి కోరినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. 1-7-2018 నుంచి మంజూరైన డీఏ బకాయిలు ఇప్పటికీ అనేక మంది ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు అందని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అప్పట్లో 2018-19 సంవత్సరాలకు సంబంధించిన డీఏ బకాయిల బిల్లులు సబ్మిట్ చేయకపోవడం, డీడీవో, లేదా ట్రెజరీ స్థాయిలో బిల్లులు రిజెక్ట్ కావడం, ఒకసారి రిజెక్ట్ అయిన బిల్లులను సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో మళ్లీ సబ్మిట్ చేయడానికి అవకాశం లేకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కాబట్టి సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో బిల్లులను తిరిగి సబ్మిట్ చేయడానికి అవకాశం కల్పించాలని మంత్రిని కోరినట్లు బొప్పరాజు పేర్కొన్నారు.

శ్రీవాణి ట్రస్టు దాతల సమస్యలకు చెక్

- ఒకేసారి విరాళం, టికెట్ ధర చెల్లించేలా టీటీడీ చర్యలు



తిరుమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దర్శన టికెట్ల కొనుగోలులో శ్రీవాణిట్రస్టు దాతలు ఎదుర్కొంటున్న సమస్యలకు చెక్ పెట్టేలా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. ఒకేసారి విరాళంతో పాటు టికెట్ ధర చెల్లించి దర్శనం పొందేలా ఏర్పా ట్లు చేస్తోంది. టీటీడీ ప్రస్తుతం 500 శ్రీవాణి టికెట్లను ఆన్‌లైన్ ద్వారా మూడు నెలల ముందు విడుదల చేస్తోంది. ఇక కరెంట్ బుకింగ్‌లో రేణిగుంటలోని విమానాశ్రయంలో 200 టికెట్లను జారీ చేస్తున్న టీటీడీ, తిరుమలలో కరెంట్ బుకింగ్‌లో ఇచ్చే 800 టికెట్లను తీసుకునేందుకు భక్తులు ఇబ్బందిపడుతున్నారనే ఉద్దేశంతో.. ఇటీవల ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. అయితే ఈ విధానంలో టికెట్లు కొనుగోలు చేద్దామనుకునే భక్తులకు వింత సమస్య ఎదురవుతోంది. రోజూ ఉద యం 9 గంటలకు విడుదలయ్యే ఈ కోటాలో ట్రస్టుకు విరాళం అందించి, తర్వాత దర్శనం టికెట్‌కు రూ.500 చెల్లించే లోపు టికెట్ల కోటా పూర్తవుతోంది. సాధారణంగా శ్రీవాణి ట్రస్టుకు విరాళం ఇచ్చేది దర్శనం కోసం. కానీ విరాళం ఇచ్చిన భక్తులకు దర్శన టికెట్ రాకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే చాలా మంది భక్తులు తాము విరాళం ఇచ్చినా దర్శనం టికెట్లు రాలేదంటూ తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే టీటీడీ ఓ నూతన నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం రెండు ప్రైవేట్ బ్యాంకులు శ్రీవాణి టికెట్ల కేటాయింపు బాధ్యతలను నిర్వహిస్తున్నాయి. అయితే త్వరలో విరాళంతో పాటు టికెట్‌కు కూడా ఒకేసారి నగదు చెల్లించేలా టీటీడీ యూనియన్ బ్యాం క్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ బ్యాంక్ పేటీఎం సంస్థ ద్వారా ఈ శ్రీవాణి ట్రస్టు టికెట్ల నిర్వహణ బాధ్యతను తీసుకోనున్నట్టు తెలిసింది.

ఆన్‌లైన్‌లో విరాళాలు చెల్లించిన భక్తుల మాటేంటి?

మూడు నెలల ముందు ఆన్‌లైన్‌లో విడుదల చేసే శ్రీవాణి దర్శన టికెట్ల కోసం భక్తులు ఇప్పటికే భారీ సంఖ్యలో శ్రీవాణి ట్రస్టుకు విరాళాలు అందించినట్టు తెలుస్తోంది. అయితే టికెట్ల కోటా మాత్రం రోజుకు 500 మాత్రమే ఉండటంతో చాలా మంది శ్రీవాణి కోటాలో విడుదలయ్యే దర్శన టికెట్ల కోసం ఎదురుచూస్తున్నారు. భవిష్యత్తులో వీరందరికి దర్శనం కల్పించకపోతే విమర్శలు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరీ వీరి విషయంలో టీటీడీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

పశ్చిమ ఏజెన్సీలో పెద్దపులి సంచారం

త్రుటిలో తప్పించుకున్న అన్నదమ్ములు.. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అధికారుల హెచ్చరిక

బుట్టాయగూడెం/కుక్కునూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపులి సంచారంతో పశ్చిమ ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తెలంగాణలోని దమ్మపేట అటవీ రేంజ్ సరిహద్దులోని కావడిగుండ్ల ప్రాంతంలో పెద్దపులి గత వారం ఒక ఆవుపై దాడి చేసి చంపింది. అదే ప్రాంతంలో మంగళవారం వరకు సంచరించిన పెద్దపులి బుధవారం తెల్లవారుజామున సరిహద్దు కన్నాయిగూడెం అటవీ ప్రాంతం గుండా ఏలూరు జిల్లా బుట్టాయగూడెం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించింది. పందిరిమామిడి గూడేనికి చెందిన బొల్లి రవీంద్రారెడ్డి, బొల్లి సత్తిబాబురెడ్డి అనే అన్నదమ్ములు పందిరిమామిడిగూడెం-కామవరం గ్రామాల మధ్య ఉన్న ఊటకాలువ సమీపంలోని తాటిచెట్ల వద్దకు కల్లుగీత కోసం వెళ్లారు. కల్లు సేకరించి దిగుతున్న రవీంద్రారెడ్డికి 10 అడుగుల దూరంలో గాండ్రిస్తున్న పెద్దపులి కనిపించింది. తాము చూసిన పులి నాలుగు అడుగుల ఎత్తు, ఆరు అడుగులు పొడవు ఉన్నట్టు అన్నదమ్ములు తెలిపారు. శ్రీగుబ్బల మంగమ్మతల్లి ఆలయానికి వెళ్తున్న భక్తుల వాహనాల్లో ఎక్కి ఇళ్లకు చేరుకున్నామని చెప్పారు. బూరుగువాడ ప్రాంతంలోని పంట పొలాల నుంచి పందిరిమామిడిగూడెం వైపుగా రోడ్డు దాటి ఆర్‌సీఎంకు చెందిన సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వెనుక వైపున ఉన్న కొండ ప్రాంతంలోకి పులి వెళ్లినట్టు తెలిపారు. కాగా.. పెద్దపులి సాయంత్రానికి పందిరిమామిడిగూడెం సమీపంలోని శ్మశానాల వద్ద ప్రత్యక్షమైనట్టు పలువురు పశువుల కాపరులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు పొలంలో పులి జాడలను గుర్తించారు. కాగా.. పులి సం చారం నేపథ్యంలో అటవీ ప్రాంతంలో నివాసం ఉం టున్న ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



పెద్దపులి పాద ముద్ర

కసిరెడ్డి రాజశేఖరరెడ్డికి వైద్య పరీక్షలు

విజయవాడ : మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డిని బుధవారం జైలు అధికారులు విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. కుడి భుజం నొప్పితో బాధపడుతున్న కసిరెడ్డికి ఆర్థోవైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. బి2, బి12 విటమిన్ పరీక్షలు చేయించాలని సూచించారు.

యముళ్లుగా మారిన మొగుళ్లు!

- అనంతలో ఇద్దరు మహిళల హత్య
- వివాహేతర బంధం అనుమానంతో చంపేసిన భర్తలు



వీరాంజినేయులు, లక్ష్మీగంగ దంపతులు



కుళ్లాయమ్మ

అనంతపురం క్రైం, రాయదుర్గం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో ఇద్దరు మహిళలు కట్టుకున్నవారి చేతిలో హత్యకు గురయ్యారు. రెండు ఘటనలకూ వివాహేతర సంబంధం ఉందన్న అనుమానాలే కారణం కావడం గమనార్హం. అనంతపురం నగరం, రాయదుర్గం పట్టణంలో బుధవారం తెల్లవారుజామున ఈ హత్యలు జరిగాయి. అనంతపురం నగరంలోని ఎల్లమ్మ కాలనీలో నివసించే లక్ష్మీగంగ(26) నగరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తుండగా, ఆమె భర్త వీరాంజినేయులు(29) బేల్దారి పనులు చేస్తుంటాడు. వీరికి పదేళ్ల కిందట వివాహం జరిగింది. లోకేష్, తనుశ్రీ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న వీరాంజినేయులు, ఆమెతో తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలోనే బుధవారం వేకువజామున లక్ష్మీగంగను గొంతుకోసి హతమార్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లేసరికి మృత దేహంపై దుప్పటి కప్పి, పిల్లలను తీసుకుని వీరాంజినేయులు వెళ్లిపోయాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగి, హత్యకు దారితీసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. హతురాలి తండ్రి గంగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వన్ టౌన్ సీఐ తెలిపారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మరో ఘటనలో రాయదుర్గం పట్టణంలోని ముత్రాసికాలనీలో కుళ్లాయమ్మ(46) అనే మహిళను ఆమె భర్త మారెన్న నరికి చంపేశాడు. భార్యపై అనుమానం పెంచుకుని, మారెన్న తరచూ గొడవపడేవాడు. కొంతకాలంగా కలహాలు తీవ్రం కావడంతో నాలుగురోజుల క్రితం కుళ్లాయమ్మ పుట్టింటికి వచ్చింది. ఆమె కోసం మారెన్న కూడా అత్తవారి ఇంటికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున మారెన్న మచ్చుకత్తితో కుళ్లాయమ్మపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. అనంతరం స్థానిక పోలీసులకు లొంగిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న కుళ్లాయమ్మను కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేబిస్‌తో యువకుడు మృతి

- ఐదు నెలల క్రితం కుక్కకాటు
- వ్యాక్సిన్ వేయించుకోకుండా నిర్లక్ష్యం

కర్నూలు హాస్పిటల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కుక్క కరిచినా వ్యాక్సిన్ వేయించుకోవడంలో నిర్లక్ష్యం వహించడంతో ఓ యువకుడు రేబిస్ వైరస్‌తో కర్నూలు జీజీహెచ్‌లో బుధవారం మృతి చెందాడు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం జమ్ములదిన్నె గ్రామానికి చెందిన టి.హరి గోపాల్ (25)ను ఐదు నెలల క్రితం పిచ్చి కుక్క కరిచింది. యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోకుండా స్థానికంగా ప్రాథమిక వైద్యం చేయించుకుని నిర్లక్ష్యం చేయడంతో కొద్ది రోజులకే హరి గోపాల్ ఆరోగ్యం దెబ్బతింది. ఈ క్రమంలో గత శుక్రవారం నుంచి అతను అన్నపానీయాలు తీసుకోవడం లేదు. నీటిని చూస్తేనే భయంతో వణికిపోయేవాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈ నెల 19న అతన్ని కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి.. రేబిస్ సోకినట్టు నిర్ధారించి, వెంటనే చికిత్స ప్రారంభించారు. ఈ క్రమంలో హరి గోపాల్ బుధవారం మృతి చెందాడు. రేబిస్ వ్యాధి సోకితే బతికే అవకాశాలు తక్కువగా ఉంటాయని, కుక్క కరిచిన వెంటనే యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని కర్నూలు జీజీహెచ్ జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ డి.శ్రీరాములు ప్రజలకు సూచించారు.

కూలిన న్యాయం

మణిపూర్ ఘోరకలిలో సామూహిక అత్యాచారానికి గురైన ఒక యువతి ఇటీవల మరణించింది. కుకీ తెగకు చెందిన ఈమెను 2023 మే 15న మీతీ తెగకు చెందిన నలుగురు యువకులు జీపులో అపహరించుకుపోయి బిష్ణాపూర్ కొండల్లో సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తరువాత ఆమెను తమ తెగకు చెందిన అరంబాయ్ తెంగోల్ అనే మిలిటెంట్ గ్రూప్‌కు అప్పగించారు. వారు ఆ రాత్రంతా ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. తెల్లవారిన తరువాత బాత్‌రూమ్‌కు వెళ్ళడానికి వారిలో ఒకడు ఆమె కట్లు విప్పడంతో ఎలాగో తప్పించుకొని కూరగాయల ఆటోలో దాక్కొని వెనక్కు రాగలిగింది. సమస్త వ్యవస్థలు మీతీల ఆధిపత్యంలో ఉంటూ, శాంతిభద్రతలు అత్యంత క్షీణదశలో ఉన్న కారణంగా ఆమె ఎటూ కదల్లేకపోయింది. రహస్యంగా కుకీల ఆశ్రయంలో ఉంటూ, నాగాలాండ్‌లోని ఒక ఆస్పత్రిలో కొంతకాలం చికిత్స తీసుకున్న తరువాత ఆమె స్వరాష్ట్రంలో తనపై జరిగిన ఘోరంపై జూలై 21న కొంతమంది సాయంతో ఫిర్యాదు చేసింది. నిందితులకోసం తీవ్రంగా గాలిస్తున్నామని, ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని నెలరోజుల తరువాత ప్రకటించిన పోలీసులు ఇప్పటికీ అదేమాటమీద నిలబడ్డారు. భౌతికంగానూ, మానసికంగానూ కుంగిపోయిన ఆమె తనకు న్యాయం చేకూర్చని ఈ లోకం నుంచి నిష్క్రమించింది.

ఈ మూడేళ్ళలో ఇరుగుపొరుగు రాష్ట్రాలతో సహా వివిధ ఆస్పత్రుల్లో ఆమెకు చికిత్స చేయించినా ప్రయోజనం లేకపోయింది. గాయాల ప్రభావంతో, తీవ్ర మనోవేదనతో ఆమె జీవచ్ఛవంలాగా మారిపోయింది. తరచుగా స్పృహతప్పి పడిపోయేదని, కన్నుమూసే ఆఖరు క్షణంవరకూ ఆ ఘోరాన్ని మరిచిపోలేదని, అవమానభారంతో పాటు, నిందితుల్లో ఒక్కరినీ ఇప్పటివరకూ అరెస్టుచేయకపోవడం ఆమెను మరింత కుంగదీసిందని తల్లి బాధపడుతోంది. చలాకీగా, నవ్వుతూ గలగలామాట్లాడే తన కుమార్తె తనతో తప్ప మిగతావారితో మాట్లాడటం మానేసిందని, ఒంటరిగా గదిలో ఉంటూ వొణికిపోయేదని ఆ తల్లి ఆవేదన చెందింది. మణిపూర్‌లో మే తొలివారంలో మంటలు రేగి, అనతికాలంలోనే ఉధృతంగా సాగిన నేరాలూ ఘోరాలమీద ఎవరూ నోరువిప్పని, ఏ వ్యవస్థలూ అడ్డుపడని వాతావరణం ఎంతోకాలం యథేచ్ఛగా కొనసాగింది. ఇద్దరు కుకీ యువతులను మీతీ తెగకు చెందినవారు నగ్నంగా ఊరేగిస్తున్న వీడియో ఒకటి వెలుగుచూస్తే కానీ, అక్కడి తీవ్రత బాహ్య ప్రపంచానికి తెలియరాలేదు. కానీ, దీనికి నెలరోజుల ముందే నార్త్ అమెరికన్ మణిపూర్ ట్రైబల్ అసోసియేషన్ వంటి సంస్థలు జాతీయ మహిళా కమిషన్‌కు చేసిన ఫిర్యాదులో మొత్తం ఆరు దారుణాలను ప్రస్తావిస్తే అందులో ఈ ముగ్గురు మహిళలకు సంబంధించిన రెండు ఘటనలూ ఉన్నాయి. మణిపూర్‌లో జరుగుతున్నదేమిటో తెలిసి కూడా ఢిల్లీ పెద్దలతో పాటు, అత్యున్నత సంస్థలు, వ్యవస్థలు స్పందించలేదన్నది నిజం.

కుకీ, మీతీ తెగల మధ్య సుదీర్ఘకాలం సాగిన ఆ ఊచకోతల్లో వందల మంది మరణించారు, అనేకమంది మహిళలు అత్యాచారాలకు గురైనారు. మీతీ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఒక పథకం ప్రకారం కుకీ–జోలపై ఈ హింసను అనుమతించి, మీతీలకు ఆశీస్సులతో పాటు ఆయుధాలు సైతం అందించి తీవ్రంగా అప్రదిష్టపాలైనా బీజేపీ పెద్దలు ఆయనను తప్పించడానికి ఇష్టపడలేదు. చివరకు సుప్రీంకోర్టు అక్షింతలు వేశాక, అవిశ్వాస తీర్మానంలో బీరేన్ ఓటమి ఖాయమని తేలడంతో దించేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రధాని మణిపూర్ సందర్శించినా, అక్కడ ఏమీ జరగనట్టు, తానేమీ ఎరగనట్టుగా ప్రవర్తించి వచ్చేశారు. మణిపూర్‌ను రాష్ట్రపతి పాలనలోకి తెచ్చి వచ్చేనెలకు ఏడాది అవుతోంది. అయినా, బాధిత కుటుంబాల వారికి అదే నిర్లక్ష్యం, నిర్లిప్తత, బాధ్యతారాహిత్యం ఎదురవుతున్నాయి. ఇప్పుడు కన్నుమూసిన యువతి కేసు సహా ఇలా జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినవేవీ ముందుకు కదల్లేదని, నిందితులను గుర్తించడం, పట్టుకోవడం జరగలేదని మీడియా విశ్లేషిస్తోంది. స్థానిక పోలీసు స్టేషన్లనుంచి సీబీఐ చేతుల్లోకి పోయిన కేసుల్లో ఈమెది కూడా ఒకటి. కేసులు తేల్చకుండా, మూయకుండా ఒక నిస్సిగ్గు నాటకం అలాగే కొనసాగుతోంది. ఇద్దరు యువతులను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశాన్ని కుదిపేసింది కనుక, దానికి కారకులైనవారిలో కొందరిని మాత్రం అరెస్టుచేసి సీబీఐ కేసులు పెట్టింది. బిష్ణాపూర్ కొండల్లోనూ, మీతీ మిలిటెంట్ల చేతుల్లోనూ సామూహిక అత్యాచారానికి గురైన ఈ కుకీ యువతికి మరణానంతర న్యాయమైనా చేకూర్చమని కుకీ జో సంఘాలు చేస్తున్న డిమాండ్లు, ప్రార్థనలు ఫలిస్తే సంతోషం.

భారతదేశ ఆర్థికవ్యవస్థలో అంతర్గతంగా ఇమిడి ఉన్న పలు బలహీనతలను సవరించకుండా, పెరుగుతున్న స్థూల జాతీయాభివృద్ధి ఫలాలు అందరికీ చెందేలా చర్యలు తీసుకోకుండా, దేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని చాటుకోవడం ఆత్మవంచనే అవుతుంది.

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అసమానతల భారత్!

మూడున్నర దశాబ్దాల క్రితం నాటి ప్రధాని పీవీ నరసింహారావు కొన్ని అనివార్య పరిస్థితుల్లో దేశంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల వల్ల, ఆ తదుపరి వచ్చిన ప్రపంచీకరణ పుణ్యమా అని, పేదలకూ సంపన్నులకూ మధ్య పూడ్చలేనంత వ్యత్యాసం ఏర్పడింది. ఆర్థిక సంస్కరణల వల్ల సృష్టించబడే సంపద అట్టడుగున ఉన్న పేదల వరకూ చేరుతుందనీ, దానిని 'ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్' అంటారనీ అప్పట్లో కొందరు ఆర్థికవేత్తలు, పాలకులు ఊదరగొట్టారు. అయితే, సంస్కరణల పేరుతో సాగిన ప్రైవేటీకరణ కారణంగా సృష్టించబడిన సంపదలో సింహభాగం పై స్థాయికి చేరింది. నామమాత్రపు భాగం మాత్రమే కిందికి చేరుకుంది. ఫలితంగా, ఆర్థిక అసమానతలు అంతకుముందెన్నడూ లేనంతగా పెరిగిపోయి, నేడు అది భూమ్యాకాశాలకు మధ్య ఉన్నంత అంతరంగా మారిపోయింది. అందుకనే రాజకీయ నాయకులు కొందరు ఒకప్పుడు ఊతపదంలా ఉపయోగించిన 'ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్' గురించి ఇప్పుడు మాట్లాడటం మానేశారు.

ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్ ఏ విధంగా తలక్రిందులైందంటే– నేడు దేశంలో 10శాతం ప్రజల వద్ద 77శాతం దేశ సంపద పోగుపడింది. కింది స్థాయిలో ఉన్న 50శాతం మంది ప్రజల వద్ద నామమాత్రంగా 4.1శాతం సంపద మాత్రమే ఉంది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం 2022–23 ఆర్థిక సంవత్సరంలో 22.3శాతం జాతీయాదాయాన్ని 1శాతం మంది ఎగరేసుకుపోయారు. ఇది ఒకప్పటి రాచరిక వ్యవస్థలో అసమానతల కంటే ఎక్కువ. ఇంకా విపులంగా చెప్పాలంటే, ప్రముఖ అమెరికన్ పత్రిక 'ఫోర్బ్స్' కథనం ప్రకారం, 1991లో భారతదేశంలో ఒకే ఒక్క బిలియనీర్ ఉన్నాడు. 3 దశాబ్దాల కాలంలో అమలైన సంస్కరణల ఫలితంగా, బిలియనీర్‌ల సంఖ్య 162కు చేరుకొంది. ఈ 162 మంది నయా కుబేరుల సంపద ఎకాఎకిన జాతీయాదాయం పెరుగుదలలో 25శాతంగా ఉంది!

ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడాన్ని ఎవ్వరూ తప్పుపట్టవలసిన పనిలేదు. కానీ, వాటి ప్రయోజనాల్ని కొందరు పారిశ్రామికవేత్తలు పొందుతున్న తీరు, అందుకు కొందరు పాలకులు సహకరిస్తున్న విధానం, వారికి లబ్ధి చేకూరేలా తీసుకుంటున్న పాలసీల కారణంగా సంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నారు. ముఖ్యంగా, అసంబద్ధమైన పన్ను విధానాలను అవలంబించడం వల్ల జాతీయాదాయానికి భారీగా గండిపడుతున్నది. దేశ జనాభాకు చేరవలసిన సంపద గద్దల్లాంటి కొందరికి ఫలహారంగా మారిపోతున్నది. ఫలితంగా, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేయాల్సిన దుర్గతి పట్టింది. సహజ వనరుల్ని కొద్దిమందికి ధారాదత్తం చేయకుండా ఉంటే, ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.

పేదలు మరింత పేదలు కావడానికి, మధ్యతరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధాన కారణాలు– ఈ వర్గాల వారికి విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడమే! సరైన ఆదాయంలేని పేద గ్రామీణ ప్రాంతాల ప్రజలలో పోషకాహార లోపం వల్ల రోగనిరోధక శక్తి క్షీణించి, వారు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. వారికి ప్రభుత్వపరంగా అందే వైద్యం అందుబాటులో లేక, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి దోపిడీకి గురవుతున్నారు. ఇక 'విద్య'దీ ఇదే తంతు. ప్రభుత్వ పాఠశాలల్లో అందే విద్యపై నమ్మకం కోల్పోయి, తాహతుకు మించిన ప్రైవేటు బడులకు తమ పిల్లల్ని పంపించి చదివిస్తున్నారు ఆ పేద తల్లిదండ్రులు. ఫలితంగా మరింతగా అప్పుల ఊబిలోకి జారిపోతున్నారు.



కరోనా సమయంలో కుప్పకూలిన ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమ)లు ఇప్పటి వరకూ కోలుకోలేదు. కారణం– వాటిని గాడిలో పెట్టగల ప్రోత్సాహకాలు అరకొరగా అందడమే! నిజానికి భారత ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఈలే వెన్నెముక. దేశంలోని ప్రతి నగరం, పట్టణంలో రోడ్ల మీద కన్పించే తోపుడుబళ్ల వ్యాపారాలు మొదలుకొని, ఏటా 10 నుంచి 20 లక్షల టర్నోవర్ ఉండే చిన్న చిన్న వ్యాపారాల మీద ఆధారపడి సుమారు 20కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. రోడ్ల విస్తరణ, బైపాస్ రోడ్లు వేయడం, ప్రభుత్వాల నుంచి ఎటువంటి సబ్సిడీలు అందకపోవడం తదితర కారణాల వల్ల, స్వయం ఉపాధి పొందుతున్న వీధి వ్యాపారులు లక్షల సంఖ్యలో రోడ్డున పడ్డారు. మరోపక్క వ్యవసాయ రంగంలోని చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం గిట్టుబాటుకాక, సాగుకు స్వస్తి పలికినట్లు, వీరి సంఖ్య దేశ వ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలుగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఉపాధి లేమి, పేదరికం, అప్పుల కారణంగా దేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య కూడా అంతకంతకూ పెరిగిపోతోంది. నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డుల ప్రకారం– ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో నిరుద్యోగులు, కూలీలు, స్వయం ఉపాధి పొందుతున్నవారు ఎక్కువగా ఉన్నారు. ఇటీవలి కాలంలో పిల్లల్ని పెంచలేక, వారిని చంపి తామూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న తల్లులు, తండ్రుల సంఖ్య పెరగడం అందర్నీ ఆందోళనకు గురిచేస్తోంది. దేశంలో ఒకవైపు బిలియనీర్ల సంఖ్యతో పాటు, మరోవైపు ఇలా ఆత్మహత్యల సంఖ్య పెరుగుతూ పోవడం దేశ ఆర్థిక రంగంలోని వైరుధ్యాలకు అద్దం పడుతోంది.

భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్నదని వేసుకొంటున్న లెక్కలు నిజమే కావచ్చు. కానీ, మేడిపండులా కనిపించే ఈ ఆర్థిక వ్యవస్థలోని అసమానతల్ని తగ్గించకుండా, కేవలం జీడీపీ లెక్కలతో మురిసిపోతే ప్రయోజనం ఏమిటి? ఆకలి చావుల సూచీల్లో మన దేశం సబ్ సహారా దేశాల కంటే దిగజారిన స్థాయిలో ఉండటం నిజం కాదా?

ఆర్థిక అసమానతలు లేకుండా ప్రపంచంలోని ఏ దేశమూ ఉండదన్న మాట నిజమే. అగ్రరాజ్యాలుగా చెప్పుకుంటున్న అమెరికా, ఫ్రాన్స్, జపాన్, జర్మనీ వంటి దేశాల్లో కూడా ఆర్థిక అసమానతలు ఉన్నాయి. కానీ, ఆ దేశాల్లో సామాన్య ప్రజలకు అందుబాటులో మెరుగైన ప్రభుత్వ విద్య, వైద్యం ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అందరూ పనిచేయడానికి ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అక్కడ దాదాపు 90శాతం మంది ప్రజలకు ఏదో ఒక రంగంలో నైపుణ్యం ఉన్నది. అక్కడి సంపన్నులపై 1శాతం సంపద పన్ను అదనంగా వేస్తున్నారు. ఇక్కడ మాదిరిగా కార్పొరేట్ పన్నుల్లో రాయితీలు ఇవ్వడం, ఉద్యోగాల కల్పన పేరుతో భూముల్ని తేరగా ఇచ్చే విధానాలు లేవు. పైగా ఆ దేశాల నుంచి నల్లధనం తరలించడం దుర్లభం.

మన దేశ ఆర్థిక వ్యవస్థలో అంతర్గతంగా ఇమిడి ఉన్న పలు బలహీనతలను సవరించకుండా, పెరుగుతున్న స్థూల జాతీయాభివృద్ధి ఫలాలు అందరికీ చెందేలా చర్యలు తీసుకోకుండా, భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని చాటుకోవడం ఆత్మవంచనే అవుతుంది. 'కరి మింగిన వెలగపండు' పైకి గుండ్రంగాను, పెద్దదిగాను కనిపిస్తుంది. కానీ లోపల మాత్రం అంతా డొల్లే! మన దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ఇలాగే ఉందన్నది వాస్తవం.

● సి.రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

ఈ గొడవ స్త్రీల దుస్తుల గురించి కాదు!

ఇటీవల ఇద్దరు తెలుగు సినిమా హీరోయిన్లు షాపింగ్ మాల్స్‌కు వెళ్ళినప్పుడు చుట్టూ వున్న మగాళ్లు వారిని బహిరంగంగా వేధించారు. ఆ మగాళ్ల ముఖాలు స్పష్టంగా కన్పిస్తున్నప్పటికీ పోలీసులు వారి మీద ఏ కేసులూ పెట్టలేదు. అనుమతి లేకుండా ఆడవాళ్ళ శరీరాన్ని ముట్టుకోవటానికి ప్రయత్నించటం, తాకటం, బట్టలు లాగటం, లైంగిక వేధింపుల కిందకు వస్తాయని వారికి తెలియంది కాదు. ఆయా ఆడవాళ్లు ఎందుకు ఫిర్యాదు చెయ్యలేదు అనటానికి ఇవెక్కడో రహస్యంగా జరిగినవి కూడా కాదు. ఈ సంఘటనలను కేవలం సెలెబ్రిటీ సంస్కృతిలో భాగమని కొట్టిపడెయ్యలేం. హోలీ పండుగప్పుడు ఉత్తర భారతదేశంలో, కొత్త సంవత్సర వేడుకలప్పుడు బెంగళూరులో, గోవాలో ఇలా బహిరంగ వేధింపులు జరుగుతాయని వార్తల్లో వింటూనే వున్నాం. దీనికున్న చారిత్రక సాంస్కృతిక కారణాలు లోతయినవే.


బహిరంగ స్థలాల్లో తమ కుటుంబ మగవాళ్ళతో కాకుండా తమంతట తాము స్వేచ్ఛగా తిరిగే ఆడవాళ్ళను భారతీయ మగస్వామ్యం 'అందరికీ చెందిన ఆడవాళ్ళు'గా పరిగణిస్తుంది. తరతరాలుగా భూస్వామ్య సంస్కృతిలో అధికార కులాల మగవాళ్ళు శ్రామిక వర్గ– కుల స్త్రీలను హక్కుగా వాడుకున్న అలవాటు వల్ల, ఇంటికి బందీ అయ్యి ఉండకుండా బయట తిరిగి, పనిచేసే ఆడవాళ్ళందరినీ తక్కువ చూపు చూసే అలవాటు బలంగా వేళ్ళూనుకుని వుంది. ఆ చూపు ఆడవాళ్ళను 'మర్యాదస్థులు' 'అమర్యాదస్థులు' అని విభజిస్తుంది. ఈ కనిపించని గీతకు సరయిన వైపు ఉండటానికి, అంటే తమను తాము మర్యాదస్థులని నిరూపించుకోవటానికి, ఈ దేశంలో ప్రతి మహిళా, నాతో సహా, తన శరీరాన్ని, ఆహార్యాన్ని, నడకను, నడవడికను ఎప్పటికప్పుడు పోలీసింగ్ చేసుకుంటూ ఉంటుంది.

బహిరంగ స్థలాల్లో తమ కుటుంబ మగవాళ్ళతో కాకుండా తమంతట తాము స్వేచ్ఛగా తిరిగే ఆడవాళ్ళను భారతీయ మగస్వామ్యం 'అందరికీ చెందిన ఆడవాళ్ళు'గా పరిగణిస్తుంది. తరతరాలుగా భూస్వామ్య సంస్కృతిలో అధికార కులాల మగవాళ్ళు శ్రామిక వర్గ– కుల స్త్రీలను హక్కుగా వాడుకున్న అలవాటు వల్ల, ఇంటికి బందీ అయ్యి ఉండకుండా బయట తిరిగి, పని చేసే ఆడవాళ్ళందరినీ తక్కువ చూపు చూసే అలవాటు మన సంస్కృతిలో బలంగా వేళ్ళూనుకుని ఉంది.

నటీమణుల వేధింపుల విషయంలో ఇంకొక పార్శ్వం కూడా వుంది. ఒక శతాబ్దం క్రితం వరకూ, తీరికగా కళను అభ్యసించి, వాటిలో నైపుణ్యం తెచ్చుకున్న ఆడవాళ్ళందర్నీ కొన్ని ప్రత్యేక సమూహాల కింద పరిగణించేవారు. తవాయిఫ్, దేవదాసీ, కళావంతులు, భోగంవాళ్ళు– అని వివిధ పేర్లున్న ఈ సమూహాల స్త్రీలు నృత్యం, సంగీతం, ఇతర కళల్లో ఆరితేరి జమీందార్లు, రాజులు, జాగీర్దార్లు, ఇతర వ్యాపారస్థులను అలరించి, ప్రతిఫలంగా ఆస్తిని పొంది, స్వతంత్రంగా బతికేవాళ్ళు. రాచరిక–భూస్వామ్య పితృస్వామ్యంలో వీరికొక స్థానం ఉండేది. అన్ని రకాల నృత్యాలు, సంగీతాలను శతాబ్దాల పాటు కాపాడింది ఈ సమూహాల స్త్రీలే. హిందీ సినిమాల నుంచి తమిళ, తెలుగు సినిమాలలోకి మొదట ప్రవేశించిన నటీమణులలో అనేకమందికి ఈ కళా సమూహాల నుంచి వచ్చిన నేపథ్యం ఉంది.

అయితే, ఇలా కుటుంబాల బయట స్వతంత్ర స్త్రీలు ఉండటం బ్రిటిష్ మగస్వామ్యానికి నచ్చక 19వ శతాబ్దపు రెండవ భాగంలో కొత్త చట్టాలు తీసుకొచ్చి, వీళ్ళపై అమర్యాదస్థులు అని ముద్ర వేసి, వాళ్ళ ఆస్తిని, భూమిని లాగేసుకుని, వారిని అందరికీ శరీరాన్ని అమ్ముకునే స్త్రీలుగా దిగజార్చింది. ఈ మార్పులో అప్పటికి రూపుదిద్దుకుంటున్న భారతీయ మధ్యతరగతి మగస్వామ్యం కూడా అత్యుత్సాహంగా పాల్గొంది. జాతీయోద్యమం సమయంలో బ్రిటిష్ విక్టోరియన్ భావజాలాన్ని తమదిగా చేసుకున్న మధ్యతరగతి మగస్వామ్యం బలపడింది. అది ఇటువంటి 'అమర్యాదకరమైన' సమూహాల స్త్రీల నుంచి సంగీతాన్ని, నృత్యాన్ని ఉద్ధరించే కార్యక్రమం చేపట్టింది. వీరేశలింగం వంటి మొదటితరం మగ సంఘసంస్కర్తలు ఈ చర్యలకు మద్దతు ఇచ్చారు. ఈ మధ్యతరగతివారు తమ కుటుంబాల స్త్రీలకు కొంత సంగీతాన్ని, నృత్యాన్ని నేర్పించటంతో మొదలుపెట్టి, ఆ కళారూపాల నుంచి శృంగార సంబంధిత పార్శ్వాలన్నింటినీ 'అశ్లీలం' పేరుతో తీసిపడేసి, దైవభక్తికి ముడేసి, వాటిని 'శాస్త్రీయ' కళలుగా మార్చారు. ఆ క్రమంలోనే సదిర్ నుంచి భరత నాట్యం రూపొందింది. ఇక వీరు అమర్యాదకరమని ముద్ర వేసిన అసలైన కళా సమూహాలు సెక్స్ వర్క్ లేదా సాధారణ రికార్డింగ్ నృత్యాల వంటి ప్రమాదకరమైన లైంగిక శ్రమలోకి నెట్టివేయబడ్డాయి. కుల, వర్గ, మగస్వామ్య సంస్కృతి ఈ రెండిటి మధ్య గీతను గీసి, నియంత్రించింది.

1947 తర్వాత పోషక వర్గ మగస్వామ్య చూపుతో రూపుదిద్దుకున్న సినిమావరణం, మధ్యతరగతి మగవాళ్ళకు ఒక పక్క రికార్డింగ్ డాన్సులు, మరో పక్క శాస్త్రీయ నృత్యరూపాలు, ఈ రెండిటినీ ఒకే తెర మీద చూపించింది. పౌరాణిక, జానపద సినిమాల్లో మగ ఋషుల తపస్సును భగ్నం చెయ్యటానికో, దేవేంద్రుడి సభలో రంభా ఊర్వశి నృత్యాలనో, రాజుసభలో నృత్యమనో, మగ కవికి ఉత్సాహం అందించటానికో, మగ హీరోల శృంగార కలల్లోనో వివిధ రకాల శృంగార శాస్త్రీయ నృత్య రూపాలు వాడారు. సాంఘిక సినిమాలు పెరిగాక, మగ పాత్రలు క్లబ్బుకు వచ్చినప్పుడు మర్యాదస్థులు కాని స్త్రీలు కాబట్టి, వాళ్ళతో రికార్డింగ్ నృత్యాలు చేయించారు.



సినిమాల్లో శృంగార నృత్యాలు, సంసార పాత్రలు, క్లబ్బు నృత్యాలు... ఏం చేసే స్త్రీలకయినా, మధ్యతరగతి కుటుంబ స్త్రీలకు లేని స్వతంత్ర జీవితం, డబ్బు, స్వేచ్ఛ వృత్తిరీత్యా లభిస్తుంది. అయితే, మగస్వామ్య ద్వంద్వ విలువలను కాపాడటం కోసం, ప్రేక్షకుల కోసం తెరమీద ఎంత రిస్కీ పాత్ర పోషించినా, బయట మాత్రం సంప్రదాయ మహిళల వలె మగ ఆధారిత జీవన విధానాన్ని అనుకరించాలి. కొంతమంది పెట్టి పుట్టిన వాళ్ళు తప్ప ఎవరూ తమ స్వతంత్రతను చూపించుకోలేరు. 1990లలో ఆర్థిక ఉద్దీపన విధానాల అనంతరం లైంగికత, శరీరం, బట్టల గురించిన విలువలు తీవ్ర గతిన మారిన తర్వాత, గత ఇరవయ్యేళ్ళల్లో తెరపై జీవితానికి, తెర బయట జీవితానికి మధ్య తేడా చెరిగి, హీరోయిన్ల స్వతంత్ర జీవితం కొంత వెలుగులోకి వచ్చింది. తమది కాని సంప్రదాయ జీవితాన్ని నటించాల్సిన ఒత్తిడి కొంత తగ్గింది.

కానీ తెలుగు మగస్వామ్య చూపు ఇంకా బలంగా నిలబడే ఉంది. వెల్లువలా వచ్చిన సాంస్కృతిక మార్పును పక్కకు తోసి నయానో భయానో కొంత స్వతంత్రం, అధికారం, సమానత్వం రుచి చూసిన ఇటువంటి ఆడవాళ్లను బట్టల పేరుతో కట్టడి చెయ్యాలని చూస్తోందది. 19వ శతాబ్దపు మగ సంస్కర్తలు తాము ఆడవాళ్ళ ఉద్ధరణ కోసమే అంతా చేస్తున్నామని భావిస్తే, ఇప్పటి సినిమా–మీడియా సంస్కర్తలు స్త్రీల రక్షణ కోసమే ఇదంతా చేస్తున్నామని అంటున్నారు.

19వ శతాబ్దపు చివర్లో బ్రిటిషు వాళ్ళు తీసుకొచ్చిన మార్పులను దేవదాసీ సమూహానికి చెందిన బెంగళూరు నాగరత్నమ్మ వంటి స్త్రీలు– ముద్దు పళని రాసిన శృంగార కావ్యం 'రాధికా సాంత్వనం' ప్రచురించి వ్యతిరేకించారు. కొన్ని దశాబ్దాల తర్వాత 20వ శతాబ్దంలో ముత్తు లక్ష్మిరెడ్డి వంటి మరి కొంతమంది కళలు, కళారూపాలు సంతరించుకున్న కులస్వామ్య రూపాన్ని వద్దన్నారు. శతాబ్దం కిందే తెలుగునాట చదువుకున్న ఆడవాళ్లు 'మాకీ సంస్కరణ– సంరక్షణ– రక్షణా చట్రం వద్దు' అంటూ మగస్వామ్య ద్వంద్వ విలువలను ప్రశ్నించారు. 1980లు, 1990లలో వచ్చిన స్త్రీవాదం మగస్వామ్య చూపును, దృక్కోణాన్ని ఎండగట్టింది. 'నిండుగా' చీర మాత్రమే కట్టుకున్న తరానికి చెందిన స్త్రీవాది అయిన జయప్రభ మగచూపులను తట్టుకోలేక, 'పైటను తగలేద్దాం' అని ప్రకటించారు. గత పదేళ్ల నుంచి తెలుగు రాష్ట్రాల్లో యాక్టివిస్టు స్త్రీలందరూ మీడియా మోరల్ పోలీసింగ్‌కు, సైబర్ బుల్లియింగ్‌కు వ్యతిరేకంగా గొంతెత్తుతూనే ఉన్నారు. కానీ తమ చూపు, ఆసక్తులు, ప్రయోజనాలు, సందేశాలు తప్ప వేరే ఏవీ పట్టని అభినవ గిరీశాలకు ఇవన్నీ ఎప్పుడు గుర్తుండాలి?!

ఇక్కడ విషయం– అసలు దుస్తుల గురించి కాదేమో. తాము ఏ పాత్ర పోషించినా, ఏ పని చేసినా, తమ సౌందర్యం గురించి తాము అవమానపడబోమని, మగస్వామ్యం గీసిన మర్యాద గీతను, ద్వంద్వ విలువలను పట్టించుకోబోమని చెప్తున్న ఆడవాళ్ళ గురించి. 'ముందు మీ చూపు మార్చుకుని, మిమ్మల్ని మీరు ఎందుకు సంస్కరించుకోకూడదు' అంటే వస్తున్న ఆగ్రహం ఇది. ప్రపంచమంతా స్త్రీల స్వతంత్రతకు అలవాటు పడుతుంటే, తెలుగు మగవాళ్ళు మాత్రం ఇలా మాట్లాడుతున్నారంటే, సంస్కరణ కావాల్సింది ఎవరికన్నట్లు? తమ ఒప్పుకోలు, చూపు, నియంత్రణ వద్దూ అంటున్న స్త్రీలను చూసి, తప్పిపోతున్న తమ నియంత్రణను కాపాడుకోవటానికి ఆధునిక మగస్వామ్యం చేస్తున్న ఆక్రందనల్లా కన్పిస్తున్నాయి ఇవన్నీ. ఈ మొత్తంలో ఆ ఇద్దరు హీరోయిన్లపై బహిరంగ వేధింపులు జరగగా... ఏ చట్టపరమైన చర్యా తీసుకోకుండా, చేతులు కట్టుకుని చూస్తూ ఊరుకున్న పోలీసు వ్యవస్థది మాత్రం అతి ప్రత్యేక స్థానం!

■ ఎ. సునీత

నాడు దిశానిర్దేశనం... నేడు సమగ్రాభివృద్ధి!

విజయవాడలో 1965లో జరిగిన భారతీయ జనసంఘ్ జాతీయ మహాసభ సాధారణ రాజకీయ సమావేశం కాదు. అది స్వాతంత్ర్యానంతరం భారతదేశానికి దిశా నిర్దేశనంతో పాటు ఏ మార్గంలో అభివృద్ధి జరగాలి? అన్న ప్రశ్నలకు సమాధానంగా నిలిచిన ఒక ఆలోచన. పాశ్చాత్య దేశాల మాదిరిగా యాంత్రిక అభివృద్ధిని గుడ్డిగా అనుసరించాలా? లేదా మన సంస్కృతిని, సమాజాన్ని కాపాడుకుంటూ ఆధునికతను స్వీకరించాలా? ఈ సందిగ్ధంలో జనసంఘ్ స్పష్టంగా చూపిన బాట– భారతీయత ఆధారంగా భారతదేశ అభివృద్ధి ఉండాలి అని.

జనవరి 23 నుంచి 26 వరకూ జరిగిన నాటి ఈ భారతీయ జనసంఘ్ 12వ వార్షిక మహాసభ ఒక మైలురాయి. ఇక్కడే, ఆధునిక హిందూ జాతీయవాద ఆలోచనాస్రష్ట పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ... పాశ్చాత్య భౌతికవాదం, మార్క్సిస్టు సిద్ధాంతాల దుష్ట ప్రభావాలను తిరస్కరిస్తూ, భారతీయ సనాతన జ్ఞాన సంప్రదాయంపై ఆధారితమైన ఏకాత్మ మానవత అనే సమగ్ర తత్వశాస్త్రాన్ని ప్రకటించారు. ఏకాత్మ మానవత అభివృద్ధిని ఆపేది కాదు. అభివృద్ధికి దిశ చూపించేది. అభివృద్ధి అంటే– గ్రామం నుంచి రాజధాని వరకూ సమాన అవకాశాలు కల్పించడం; పేదరికం నిర్మూలనతో పాటు స్వాభిమానాన్ని నిర్మించడం; ఆర్థిక బలంతో పాటు సాంస్కృతిక ఆత్మవిశ్వాసం పెంపొందించడం.

ఈ మహాసభకు 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో అదే విజయవాడలోనే ఈ నెల 23, 24 తేదీలలో జరగనున్న సదస్సులో ఎనిమిది కాలాంశాలు 'నేటి కాలానికి ఏకాత్మ మానవ దర్శనం ఆవశ్యకత', 'రాజకీయ, సాంస్కృతిక దృష్టి కోణం, భారతీయత–ప్రపంచ వ్యాప్తంగా దాని ప్రభావం', 'ఆర్థిక పరిపుష్టి–వికేంద్రీకరణ, సమగ్ర ఆలోచనా విధానం ద్వారా విశ్వదర్శనం–భారతీయ రక్షణ', 'ఏకాత్మ మానవ దర్శనం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన', సమకాలీన అనువర్తనాలు–భవిష్యత్తు కార్యాచరణ లాంటి అనేక అంశాలను చర్చిస్తారు.



1965లో జనసంఘ్ కలగన్న ఆలోచనలే 2014 నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో ప్రత్యక్ష రూపం దాల్చాయి. స్వదేశీ ఆర్థిక దృష్టి, ఆత్మనిర్భర్ భారత్, మౌలిక సదుపాయాల విప్లవం, జాతీయ భద్రతలో స్పష్టత, విదేశాంగ విధానంలో సమర్థత లాంటివి లోతుగా అమలు చేస్తూ, ఒక విశ్వశక్తిగా మన దేశం ఎదుగుతోంది.

1965 మహాసభను ఒక సాధారణ సమావేశంగా చూడకూడదు; ఇది ఒక దార్శనిక పరివర్తన. ఈ మహాసభలో అధ్యక్షులుగా ఎన్నికైన దీనదయాళ్... జనసంఘ్ పార్టీ 'సూత్రాలు– విధానాలు' ద్వారా ఏకాత్మ మానవతను ప్రధాన భావనగా స్థాపించారు. ఈ తత్వం భారతదేశాన్ని ఒక సజీవ సమష్టిగా భావిస్తూ, భౌతిక పురోగతిని ఆధ్యాత్మిక సంపూర్ణతతో ఏకీకృతం చేస్తుంది. ఈ సిద్ధాంతం బలవంతంగా భారతీయులపై రుద్దుతున్న పాశ్చాత్య భావజాలాల్ని, సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ, భారతీయ ధర్మ–సంస్కృతికి అనుగుణమైన విధానాలను దీనదయాళ్ జీ ప్రతిపాదించారు.

ఇందులోని కీలకమైన సూత్రాలు... అంత్యోదయ– సమాజంలోని అంతిమ వ్యక్తి (చిట్టచివరి వ్యక్తి) ఉద్ధరణను ప్రధాన లక్ష్యంగా చేసుకోవడం. స్వదేశీ, స్వావలంబన– విదేశీ ఆధారితను తగ్గించి, స్థానిక ఆవిష్కరణలు, వనరులను ఉపయోగించడం. వికేంద్రీకరణ– కేంద్రీకృత శక్తి నుంచి గ్రామీణ, స్థానిక స్థాయిలకు అధికార వికేంద్రీకరణ. నైతిక ఆర్థికత– లాభాపేక్షకు మించి, సామాజిక శ్రేయస్సును ప్రోత్సహించే ఆర్థిక వ్యవస్థ.

ఈ మహాసభ నేపథ్యంలో దీనదయాళ్ జీ సాంస్కృతిక స్వాభిమానాన్ని, సమగ్రాభివృద్ధి ప్రణాళికలను బలపరచడం ద్వారా, జనసంఘ్‌ను ఒక రాజకీయ శక్తిగా ఎదిగేలా చేశారు. 1965లో జనసంఘ్ కలగన్న ఆలోచనలే 2014 నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో ప్రత్యక్ష రూపం దాల్చాయి. స్వదేశీ ఆర్థిక దృష్టి, ఆత్మనిర్భర్ భారత్, మౌలిక సదుపాయాల విప్లవం, జాతీయ భద్రతలో స్పష్టత, విదేశాంగ విధానంలో సమర్థత లాంటివి లోతుగా అమలు చేస్తూ, విశ్వశక్తిగా మన దేశం ఎదుగుతోంది. ఆత్మనిర్భర్ భారత్– స్వదేశీ ఉత్పాదనను ప్రోత్సహిస్తూ, విదేశీ ఆధారితను తగ్గించడం. ఇది దీనదయాళ్ గారి స్వావలంబన సూత్రానికి సాక్ష్యం. ఉదాహరణకు మేకిన్ ఇండియా. అంత్యోదయ సాకారం– పీఎం కిసాన్, వీబీ జీరామ్‌జీ చట్టాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు అణగారిన వర్గాల జీవితాల్ని మారుస్తున్నాయి. సాంస్కృతిక పునరుత్థానం– ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిర నిర్మాణం, యోగా– ఆయుర్వేద ప్రపంచీకరణ లాంటివి ఏకాత్మ మానవతా ఆధ్యాత్మిక పునరుజ్జీవనాన్ని ప్రతిబింబిస్తాయి. డిజిటల్ వికేంద్రీకరణ– డిజిటల్ ఇండియా, యూపీఐ వంటివి ప్రజల ఆర్థిక స్వావలంబనను పెంచుతున్నాయి. పర్యావరణ సమతుల్యత– ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్, గ్రీన్ ఎనర్జీ వంటి కార్యక్రమాలు మానవ–ప్రకృతి సమన్వయాన్ని బలపరుస్తాయి. జాతీయ భద్రత– స్వదేశీ రక్షణ పరికరాలు (తేజస్ ఫైటర్, బ్రహ్మోస్ మిస్సైల్స్), 5 ట్రిలియన్ డాలర్ ఆర్థిక లక్ష్యాలు సమగ్ర అభివృద్ధి ఫలితాలు.

2023 జీ–20 సమ్మిట్‌లో 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే థీమ్, వసుధైక కుటుంబకం ఆధునిక వ్యాఖ్యానం. ఈ ఆలోచన భారతదేశాన్ని విశ్వగురుగా స్థాపిస్తుంది. అయితే, ఈ విజయాలు సవాళ్లు లేకుండా రాలేదు. ఆధునిక కాలంలో విభజనవాద శక్తులు, గ్లోబల్ అనిశ్చితులు లాంటివి ఎదురైనా తట్టుకుని ముందుకు వెళుతున్నాం.

ఈ నెలలో ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న సదస్సు 1965 మహాసభను పునఃస్మరణ చేస్తూ 'దీనదయాళ్ జీ దృక్పథం ఎలా అభివృద్ధిని సమగ్రంగా రూపొందించింది, ఆధునిక భారతదేశం దానిని ఎలా సాకారం చేస్తోంది' అనే అంశాలపై లోతైన చర్చలు జరపనుంది. ఈ సదస్సు కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం కోసమే కాదు, భవిష్యత్తును రూపొందించుకోవడం కోసం కూడా. "మనం జీవితాన్ని సమగ్ర దృష్టితో చూడాలి" అని దీనదయాళ్ జీ అనేవారు. నేటి తరానికి ఏకాత్మ మానవతా దర్శనం చక్కటి మార్గదర్శకం చేస్తుందనడంలో సందేహం లేదు.

◆ సాదినేని యామినిశర్మ
బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

పోలియో పీడితుల పాలిట దేవుడు

ప్రముఖ ఎముకల వైద్యులు, సమాజ సేవకులు, పద్మశ్రీ పురస్కృతులు డా. ఆదినారాయణరావు మృతి ప్రజలకు తీరని లోటు. సమాజానికి, ముఖ్యంగా పోలియో వ్యాధిగ్రస్తులకు చేసిన సేవలే ఆయనకు ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డును తెచ్చి పెట్టాయి. స్థానికంగా విశాఖపట్నంలో అందించిన నిర్విరామ వైద్యసేవలే కాకుండా, దేశవ్యాప్తంగా ఆయన నిర్వహించిన శిబిరాలు, లక్షలాది శస్త్ర చికిత్సలు ఆయా బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపాయి. ఆయన గురువు, ఆంధ్రా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్, ప్రముఖ ఎముకల వైద్యులు డా. వ్యాఘ్రేశ్వరుడు కేజీహెచ్‌లో పోలియో పీడితుల కోసం ఒక నూతన శస్త్రచికిత్సా విధానాన్ని కనిపెట్టారు. ఐదు, పది నిమిషాలు పట్టే ఆ విధానం పూర్తిగా నడక సాధ్యం కాని రోగులకు వరంగా మారింది. వారి నడక మెరుగైంది. అదే విధానాన్ని మెరుగుపరచి, దేశవ్యాప్తంగా శిబిరాల నిర్వహణతో విస్తృతపరచడం ద్వారా ఆదినారాయణ రావు లక్షలాది రోగులకు బతుకు భరోసానిచ్చారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఒక రోజు శిబిరంలో వెయ్యి సర్జరీలు జరిగేవి. అలాంటివి ఒక విడతలో ఆరేడు జరిగేవి. అన్నీ ఆయనే చేసేవారు, అలుపు లేకుండా. ఆ వయసుకి అలా చేయగలగడం ఆశ్చర్యం అనిపించేది.

నేను ఎనస్థీషియా పీజీగా ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఉన్నప్పుడు మా ప్రొఫెసర్ డా. నారాయణమూర్తి ఒకసారి ఆయనతో వెళ్ళడం కుదరక నన్ను పంపారు. నేను ఆయనతో బాటు వేలాది శస్త్రచికిత్సల్లో పాల్గొన్నాను. మంచి మానవీయ అనుభవం, అదృష్టం అది. వృత్తి పరంగానే కాకుండా సేవా, సామాజిక కోణాల్లో పాఠాలు నేర్పిన ప్రధాన ఘట్టం. ఆ తర్వాత ఇంకో విడత కూడా ఆయనతో క్యాంపులో పాల్గొన్నాను. భాషా, ప్రాంత భేదాలు లేకుండా వివిధ రాష్ట్రాల్లో, దేశవ్యాప్తంగా పోలియో పీడితులు, వారి బంధువులు ఆయన్ని దేవుడిలా చూసేవారు.

–డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ


నల్లపాడు - నంద్యాల సెక్షన్‌లో సేఫ్టీ చెక్ నిర్వహిస్తున్న రైల్వే జీఎం శ్రీవాస్తవ, పక్కన డీఆర్ఎం సుధేష్ణసేన్

అమృత్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో మంజూరు చేసిన అమృత్ స్టేషన్లలో పునరాభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు. బుధవారం ఆయన గుంటూరు డివిజన్‌లోని నంద్యాల - నల్లపాడు సెక్షన్‌లో తనిఖీ నిర్వహించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, ఆధునిక మౌలిక సదుపాయాలను అందించడంలో సహాయపడే పనులను సకాలంలో పూర్తి చేయడానికి, వాటి వేగాన్ని పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. గుండ్లకమ్మ వంతెన భద్రతా అంశాలపై వివరణాత్మక సమీక్ష నిర్వహించారు. నల్లపాడు రైల్వేస్టేషన్‌లోని సరుకు రవాణా సైడింగ్‌ను తనిఖీ చేశారు. సరుకు రవాణ మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రోజువారీ పనిలో ఎదురయ్యే సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో డీఆర్ఎం సుధేష్ణసేన్, తదితరులు హాజరయ్యారు.

23న అమృత్ భారత్ రైలు కూత

- 24 ఉదయం 10.20 గంటలకు గుంటూరు చేరిక

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరువనంతపురం నార్త్ - చర్లపల్లి ప్రత్యేక అమృత్ భారత్ రైలు ఈ నెల 23న పట్టాలెక్కనుంది. దీనికి 06308 నంబరుని రైల్వే శాఖ కేటాయించింది. ఈ రైలు శుక్రవారం ఉదయం 10.45 గంటలకు తిరువనంతపురం నార్త్‌లో బయలుదేరి 24వ తేదీ ఉదయం 8.30 గంటలకు బాపట్ల, 9.38 గంటలకు తెనాలి, 10.20 గంటలకు గుంటూరు వస్తుంది. అనంతరం 10.30కి బయలుదేరి 11.23 గంటలకు సత్తెనపల్లి, సాయంత్రం 4.30 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. రెగ్యులర్ సర్వీసు కాలమాన పట్టికని రైల్వే బోర్డు కొద్ది రోజుల్లోనే ఖరారు చేయనున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి.

ఇక రోజులే..

ముగియనున్న స్థానిక ప్రథమ పౌరుల పదవీ కాలం

- పురాలకు 55.. పంచాయతీలకు 73 రోజులే
- స్థానిక సంస్థలకు ఇప్పట్లో ఎన్నికలు లేనట్లే?

పల్లెలు.. పట్టణ ప్రథమ పౌరుల పదవీ కాలం ముగుస్తోంది. మునిసిపాలిటీలు, పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు పాలన రానుంది. స్థానిక సంస్థలకు ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితులు లేవు. స్థానిక సంస్థల పాలక వర్గాల పదవీ కాలం ముగిసే లోపు ఎన్నికలు జరిగాల్సి ఉంది. ఈ దిశగా ఏర్పాట్లు జరగడం లేదు. 2027లోనే ఎన్నికలు నిర్వహి స్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో స్థానిక పదవులపై ఆశలు పెట్టుకున్న రాజకీయ పార్టీల నేతలు నీరస పడ్డారు. మునిసిపాలిటీ పాలక వర్గాల పదవీ కాలం 55, పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ఇంకా 73 రోజులే ఉంది.

- ప్రత్యేక అధికారుల పాలనకు కసరత్తు
- 2027లో ఎన్నికలంటూ ప్రచారం


తెనాలి మునిసిపల్ కార్యాలయం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘ పాలక వర్గాల పదవీ కాలం మార్చి 17తో ముగుస్తుంది. పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీ కాలం కూడా ఏప్రిల్ 4తో ముగియనుంది. స్థానిక సంస్థల పాలక వర్గాల పదవీ కాలం పూర్తయిన మరుసటి రోజు నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారుల సమచారం సిద్ధం చేస్తున్నారు. పల్నాడు నరసరావుపేట మునిసిపాలిటీ ఎన్నికలు జరగలేదు. ఇక్కడ ప్రత్యేక అధికారి పాలన సాగుతోంది. చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, దాచేపల్లి, గురజాల, వినుకొండ మునిసిపాల్టీల కౌన్సిల్ పదవీ కాలం ముగియనుంది. జిల్లాలో 519 పంచాయతీలు ఉన్నాయి.

గుంటూరు జిల్లాలో గుంటూరు నగర పాలక సంస్థతో పాటు, మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీలు, 943 గ్రామ పంచాయతీలున్నాయి. బాపట్ల (మిగతా 8వ పేజీలో)

పాలకవర్గం ఉంటేనే నిధులు

స్థానిక సంస్థలకు పాలకవర్గాలు ఉంటేనే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తుంది. వాటికి అయువు పట్టు ఆర్థిక సంఘం నిధులే. పాలక వర్గం లేకపోతే ఆర్థిక సంఘం నిధులు రావనడానికి ఉదాహరణగా నరసరావుపేట మునిసిపాల్టీ నిలిచింది. మూడు విడతల్లో నరసరావుపేటకు రూ.16.52 కోట్ల ఆర్థిక సంఘం నిధులను కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ మునిసిపాలిటీలో విలీనం అయిన లింగంగుంట్ల, యల్లమంద, కేసానుపల్లి, ఇస్సపాలెం, రావిపాడు పంచాయతీలకు కూడా ఆర్థిక సంఘం నిధులు విడుదల నిలిపివేశారు.



స్థానిక సంస్థలకు 2027లో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందని అధికారులు అంటున్నారు. ఎన్నికలు వస్తే పోటీ చేయాలని ఇప్పటికే రాజకీయ పార్టీల నేతలు సమయాత్తమయ్యారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహి స్తారన్న స్పష్టత లేకపోవడంతో వారు అసంతృప్తికి లోనవుతున్నారు. అధికారుల పాలన వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కావన్న అభిప్రాయం వ్యక్తమవు తోంది. పాలక వర్గాలు ఉంటే ప్రజా సమస్యలు, వారి అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే అవకాశాలు ఉంటాయని ప్రజలు భావిస్తున్నారు.


టీడీపీ జిల్లా కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, వేదికపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం

- టీడీపీ జిల్లా కమిటీకి పలువురు అభినందనలు
- హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ముఖ్యనేతలు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సమక్షంలో బుధవారం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. పార్టీ జిల్లా కార్యాలయంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పలువురు నేతలు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పెమ్మ సాని మాట్లాడుతూ పార్టీ గళాన్ని బలంగా వినిపించిన నేత పిల్లి మాణిక్య రావు అని కొనియాడారు. ఆయన ప్రతిభను గుర్తించిన చంద్రబాబు రాజకీయంగా ఎంతో బలమైన, ప్రతిష్ఠాత్మకమైన గుం టూరు జిల్లాని పిల్లి మాణిక్యరావు చేతిలో పెట్టారన్నారు. పార్టీని సంస్థగతంగా నిర్మాణం చేయడంతోపాటు అందరినీ కలుపుకుని పనిచేయగల సమర్థత మాణిక్యరావుకు ఉందని నమ్ముతున్నానన్నారు. వర్ల రామయ్య మాట్లాడుతూ గుంటూరు జిల్లా అధ్యక్ష పదవి అతి సామాన్యుడికి రావడం చంద్రబాబు గొప్పదనమన్నారు. జిల్లాలో పార్టీని సమర్థవంతంగా నడిపించడంలో పిల్లి మాణిక్యరావు విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో కార్యకర్తలపై నమోదైన కేసులు తొలగించడానికి మాణిక్యరావు కృషి చేయాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సహకారంతో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు, మొహమ్మద్ నసీర్, మద్దులూరి మాలకొండయ్య, మేయర్ కోవెలమూడి రవీంద్రతో పాటు నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, పోతినేని శ్రీనివాసరావు, మల్లె ఈశ్వరరావు, గోనుగుంట్ల కోటేశ్వరరావు, నాదెండ్ల బ్రహ్మంచౌదరి, గళ్ళా రామచంద్రరావు, షేక్ హసన్‌బాష, కలపటపు బుచ్చిరాంప్రసాద్, వడ్రాణం హరిబాబు, భీమినేని వందనాదేవి, దాసరి రాజామాష్టారు, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, కనపర్తి శ్రీనివాసరావు, చిట్టాబత్తిన (శ్రీనివాసరావు) చిట్టిబాబు, కసుకుర్తి హనుమంతరావు, సుఖవాని శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, గురజాల మాల్యాద్రి, నిమ్మల శేషయ్య పాల్గొన్నారు.

మిర్చి.. మెరిసే

- ఘాటెక్కిన ధర.. రైతుల్లో సంతోషం
- తాలుకాయలూ రూ.10 వేలకు కొనుగోళ్లు

మేలిమి రకం క్వింటాల్ రూ.25 వేలు



పాతకాయలు అమ్మేస్తున్నాం..

మిర్చికి ఇప్పుడు మంచి గిరాకీ వచ్చింది. అన్ని రకాలు మంచి రేటు పడుతున్నాయి. క్వింటాల్‌కు రూ.17 వేలు నుంచి 19 వేలు తగ్గకుండా కొంటున్నారు. సీజన్ ఆరంభంతో పోలిస్తే ఇప్పుడు ధర చాలా బాగుంది. టీ 4 రకం అయితే క్వింటా ఏకంగా రూ.25 వరకు పోతుంది. పాత కాయలు అన్ని అమ్ముకునే అవకాశం వచ్చింది.

- చేరెడ్డి వెంకటేశ్వర్లు, దొనకొండ, ప్రకాశం జిల్లా


నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి టిక్కీలు

గుంటూరు, గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చి సాగు చేసిన రైతులకు శుభవార్త. ఘాటెక్కిన ధరతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిస్తున్నాయి. గత ఏడా ది మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత మూడు నెలలుగా మిర్చి ధర రూ.12 వేల నుం చి రూ.14 వేల మధ్య అమ్మకంతో తీవ్రంగా నష్ట పోతున్న రైతులు డీలా పడ్డారు. శీతల గిడ్డంగుల్లోని కాయలను కూడా అమ్మకుండా రైతులు వదిలేశారు. ఈ పరిస్థితుల్లో ఒక్క సారిగా మిర్చికి డిమాండ్ రావడం.. అదే స్థాయి లో ధర పెరగడంతో రైతుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. పచ్చళ్లకు ఇది సీజన్ కావ డంతో దేశవ్యాప్తంగా (మిగతా 8వ పేజీలో)

నడికూడిలో ధర రూ.22 వేలు

నడికూడి మిర్చి యార్డులో బుధవారం 334 రకం కాయలు రూ.10 వేలు నుంచి రూ 22వేలు వరకు అమ్మకం జరిగాయి. తేజ రకం కాయలు రూ.9 వేలు నుంచి రూ.19 వేలు వరకు అమ్మకాలు జరిగాయి. తాలు కాయలు రూ.3 వేలు నుంచి రూ.9 వేలు వరకు అమ్మకాలు జరిగాయి. తాలు కాయలు కూడా గరిష్టంగా రూ 9వేలకు అమ్మకం సాగటంతో మార్కెట్ సందడిగా మారింది. ఈ రేటు నిలకడగా ఉంటుందా?, మరింత పెరుగుతుందా? అనేది వ్యాపారుల్లోను, రైతుల్లోను ఆలోచింప చేస్తుంది. ఇదే రేటు కొనసాగితే ఇప్పటి వరకు సాగు చేసిన రైతులకు కొంత మేరకు నష్టాల బాట నుంచి బయట పడే అవకాశం ఉందని వ్యాపారులు చెపుతున్నారు. కాగా ఒకే రోజు 4,200 మిరప టిక్కీలు అమ్మకం జరగటం విశేషం.

ఆర్వోబీ పనులకు సహకరించాలి

- నిబంధనల మేరకు టీడీఆర్ బాండ్లు, నష్టపరిహారం
- మేయర్ రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ ఆర్వోబీ పనుల వేగవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, స్థలాలు లేదా భవనాలు కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం టీడీఆర్ బాండ్లు, నష్టపరిహారం అందిస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. బుధవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో కమిషనర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి శంకర్ విలాస్ వంతెన నిర్మాణ.. ప్రభావిత భవన యజమానులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శంకర్‌విలాస్ వంతెన నిర్మాణం వల్ల ఏ ఒక్కరికీ నష్టం కలగకూడదని, ఎవరిని ఇబ్బంది పెట్టకూడదనే తమ లక్ష్యమన్నారు. ప్రజల సౌకర్యం దృష్ట్యా వంతెన పనులు వేగంగా జరిగేలా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. వంతెన నిర్మాణంలో భాగంగానే ఆర్వోబీ నిర్మాణం చేయాలని ప్రభుత్వానికి కౌన్సిల్ తీర్మానం చేసి పంపామని, త్వరలో అనుమతులు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. భవన యజమానులకు అనుమానాలు నివృత్తి చేయడానికి జాయింట్ సర్వే చేయిస్తామని, అందుకు తేదీని తెలపాలని కోరారు.

ముందుకొస్తే .. త్వరగా పనులు

కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాల ని విజ్ఞప్తులు అందుతున్నాయన్నారు. ఇప్పటికే సుమారు 70 శాతానికి పైగా యజమానులు ఆమోదం తెలిపారని, వారికి నష్టపరిహారం చెల్లించామని, టీడీఆర్ బాండ్లు ఆన్‌లైన్ ప్రాసెస్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన వారు కూడా ముందుకు వస్తే వంతెన పనులు త్వరితగతిన పూర్తవుతాయని తెలిపారు. యజమానుల అను మానాలు నివృత్తి చేసేలా వారితో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, బ్రాడిపేట, అరండల్ పేట భవన యజమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ అశోక్

కోటప్పకొండ తిరునాళ్ళకు 650 ఆర్టీసీ బస్సులు

● ఇతర శైవక్షేత్రాలకూ స్పెషల్ సర్వీసులు ● నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి 650 బస్సులు నడుపుతున్నట్టు నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోని శిక్షణ సమావేశ మందిరంలో డీపీటీవో డి.సామ్రాజ్యం అధ్యక్షతన నాగేంద్రప్రసాద్ గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఒంగోలు జిల్లాల ప్రజారవాణాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోటప్పకొండపైకి వెళ్లే మార్గంలో మినీ బస్సులతో పాటు వీవీఐపీల ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. ట్రాఫిక్ ఆటంకాలు లేకుండా మొబైల్ టీమ్‌లను సిద్ధం చేస్తామన్నారు. మొత్తం 6 క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి క్యాంపులో సీనియర్ అధికారి పర్యవేక్షిస్తారన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అమరావతి, క్రోసూరు, గోవాడ, సత్తెనపల్లి తదితర శైవక్షేత్రాలకూ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఆర్టీసీ కేంద్ర కార్యాలయ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఏ.జాన్‌సుధాకర్, నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎమ్, సీఎమ్ఈలు, ఇతర అధికారులున్నారు.

బీఏ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన 6వ సెమిస్టర్ బీఏ, బీకామ్, బీబీఎమ్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను బుధవారం దూరవిద్య కేంద్రం పరీక్షల నిర్వహణాధికారి దిట్టకవి రామచంద్రన్ విడుదల చేశారు.

అగ్నివీర్ నియామక ర్యాలీ ఏర్పాట్ల పరిశీలన

● ఫిబ్రవరి 17 నుంచి ఏఎన్‌యూలో నిర్వహణ

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 17వ తేదీ నుంచి 27 వరకు గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్న ఆర్మీ అగ్నివీర్ నియామక ర్యాలీ ఏర్పాట్లను ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ రజత్ సువర్ణతో కలసి గుంటూరు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఏపీ, తెలంగాణకు చెందిన పురుష అభ్యర్థులు ఈ ఎంపికకు హాజరవుతారన్నారు. ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ రజత్ సువర్ణ మాట్లాడుతూ, జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లరికల్, స్టోర్ కీపర్, ట్రేడ్స్‌మెన్ తదితర విభాగాలలో అగ్నివీర్ రిక్రూట్మెంట్ జరుగుతుందన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వివిధ దశలలో జరుగుతుందని చెప్పారు. మొదట ఏఎన్‌యూలోని సింథటిక్ ట్రాక్‌పై 1.60 కిలోమీటర్ల పరుగు నిర్వహిస్తామని, అభ్యర్థులు స్పైక్ షూ కాకుండా సాధారణ షూ ధరించవచ్చని అన్నారు. శారీరక పరీక్షలలో భాగంగా పుల్ అప్స్, జిగ్ జాగ్, 9 అడుగుల లాంగ్ జంప్ తదితర అంశాలలో పరీక్షించి అందులో ఎంపికైన వారికి ఎత్తు, బరువు తదితర శారీరక కొలతలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి రాత పరీక్ష ఉంటుందని చెప్పారు. అనంతరం మెడికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరుగు ప్రక్రియ అర్థరాత్రి 12 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థుల శరీరంపై ఎక్కడా ఐదు సెంటిమీటర్లు మించి టాటూలు ఉండకూడదని, గిరిజన తెగలకు మాత్రం వెసులుబాటు ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వారు రిజిస్టర్ చేసుకున్న ఈ మెయిల్‌కు నియామక ఉత్తర్వులు పంపిస్తామన్నారు. జిల్లా యంత్రాంగం మౌలిక సదుపాయాలు కల్పనలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ స్పోర్ట్స్ డైరెక్టర్ సత్య పాల్, ఆర్మీ మేజర్ అమర్‌దీప్ కుమార్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ హనుమంతు, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా రవాణాధికారి కె.శ్రీహరి, జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాస రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఏఎన్‌యూలో ఆర్మీ నియామక ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

బ్యాడ్మింటన్ పోటీల విజేత జైన్ వర్సిటీ

● కేఎల్‌యూలో ముగిసిన అంతర్ వర్సిటీల టోర్నీ

తాడేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో శనివారం నుంచి జరుగుతున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల బాడ్మింటన్ పోటీలు-2026 బుధవారం ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా నాలుగు జోన్‌లలో విజేతలైన పదహారు యూనివర్సిటీల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో ప్రథమ స్థానాన్ని కర్ణాటకకు చెందిన జైన్ యూనివర్సిటి జట్టు కైవసం చేసుకోగా ద్వితీయ స్థానాన్ని పంజాబ్‌కు చెందిన ఛండీఘడ్ యూనివర్సిటి సాధించింది. కేరళకు చెందిన యూనివర్సిటి ఆఫ్ కాలికట్, చెన్నైకు చెందిన ఎస్ఆర్ఎం ఐఎస్‌టీ యూనివర్సిటీ జట్లు సంయుక్తంగా తృతీయ స్థానంలో నిలిచి బహమతులు అందుకున్నాయి. విజేతలకు అమరావతి బోటింగ్ క్లబ్ అధ్యక్షుడు, కేఎల్‌యూ పూర్వ విద్యార్థి తరుణ్ కాకాని, వీసీ సారధివర్మ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా తరుణ్ కాకాని మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశంలో క్రీడలకు పెద్ద పీట వేస్తోందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత క్రీడాకారులు సత్తా చాటుతున్నారన్నారు. తనకు చదువు చెప్పిన అధ్యాపకుల సమక్షంలో ముఖ్య అతిథిగా రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ డాక్టర్ సారధివర్మ, కేఎల్‌యూ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కాకర్ల హరికిషోర్, ఆలిండియా యూనివర్సిటీల పరిశీలకుడు డాక్టర్ కిరణ్, ప్రోవీసీలు, అధికారులు, రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్‌లు పాల్గొన్నారు.



ప్రథమ స్థానం సాధించిన జైన్ యూనివర్సిటీ జట్టుకు బహుమతి అందిస్తున్న తరుణ్ కాకాని

నాటక మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

● గుంటూరులో వచ్చే నెల 6 నుంచి..

తాడేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ప్రాతూరులోని ఏపీ నాటక అకాడమి కార్యాలయంలో భారత్‌రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవం-2026కు సంబంధించిన ముందస్తు సమాచార బ్రోచర్‌ను ఏపీ నాటక అకాడమి ఛైర్మన్, కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఢిల్లీ ఆధ్వర్యంలో ఈ అంతర్జాతీయ నాటక మహోత్సవం నిర్వహించనున్నట్టు యడ్లపాడు వేదిక, తెలుగు నాటక సమాఖ్య సంస్థ అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు నాటక మహోత్సవం జరుగుతుందని చెప్పారు. దేశ, అంతర్జాతీయ స్థాయి నుంచి నాటక బృందాలు ఈ మహోత్సవంలో పాల్గొననున్నాయని తెలిపారు. నాటక కళకు విస్తృత ప్రాచుర్యం కల్పించడంతోపాటు తెలుగు నాటకాన్ని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మరింత బలంగా నిలబెట్టడమే ఈ మహోత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా తెలుగు నాటక రంగానికి చెందిన పలువురు ప్రముఖులను సత్కరించనున్నట్లు సురేష్‌బాబు చెప్పారు. ఈ మహోత్సవానికి ఏపీ సాంస్కృతిక, సృజనాత్మక సమితి, ఏపీ నాటక అకాడమి ద్వారా అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని నాటక అకాడమి ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు గుదే పాండురంగరావు, కోవ్వూరి నాగేశ్వరరావు, ముత్తవరపు పద్మారావు, నటులు, దర్శకులు పొగర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భారత్‌రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవం 2026 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ

ఉపాధ్యాయ ఉద్యమ నేత అంజిరెడ్డి కన్నుమూత

గుంటూరు (విద్య), జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ నేత టి.అంజిరెడ్డి (96) పెదకాకాని మండలం నంబూరులో బుధవారం కన్నుమూశారు. యూటీఎఫ్ నాయకులు అంజిరెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఉద్యమంలో చివరిదాకా నిలబడి యూటీఎఫ్ ఏర్పడటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన అంజిరెడ్డి మృతి ఉపాధ్యాయ, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటన్నారు. మరణించిన తర్వాత ఆయన పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించేలా ఆయన తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంజిరెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యు.రాజశేఖర్, ఎం.కళాధర్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులున్నారు.



అంజిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	175, 184, 195
చికెన్ విత్ స్కిన్(కిలో)	340.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	350.00

మిర్చియార్డు సమాచారం

(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	72,795
అమ్మకాలు	69,825
నిల్వ	16,603

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13000	22000
నెంబరు. 5	13500	21500
273	----	----
341	14000	24000
4884	----	----
సూపర్ 10	13500	21500

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	13500	21500
దేవనూరు డీలక్స్	14000	24500
ఆర్మూరు	12000	17000

ఏసీ కామన్ వెరైటీ		
334	12500	17500
నెంబరు. 5	----	----
	----	----
341	13000	21000
4884	----	----
సూపర్ 10	----	----

ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	12500	17500
బ్యాడిగి 355	12500	19500
దేవనూరు డీలక్స్	14000	23000
తాలుకాయలు	6000	10500

ఆలయ ట్రస్టీగా ఇందుమతి బాధ్యతల స్వీకరణ

చేబ్రోలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి క్వారీ బాల కోటేశ్వర స్వామి ఆలయ ఫౌండర్ ట్రస్టీగా బుధవారం కె.ఇందుమతి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని తిరునాళ్ళ నేపథ్యంలో ప్రస్తుతం ఆలయం చిన్నదిగా ఉన్నందున, భవిష్యత్తులో తమ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత వైకాపా ప్రభుత్వ కాలంలో వడ్లమూడి గ్రామానికి చెందిన వ్యక్తి తామే ట్రస్టీలమని చెప్పుకుంటూ ఆలయం వద్ద కొన్నేళ్లపాటు పెత్తనం సాగించారని, ఇకపై అటువంటి వ్యవహారాలకు తావుండదని ఇందుమతి స్పష్టం చేశారు. ఆలయ ఈవో నరసింహ మాట్లాడుతూ, దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇందుమతిని ఫౌండర్ ట్రస్టీగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి అధ్యక్షుడు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



అధికారికంగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఇందుమతి

తండ్రి మందలించాడని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

తాడికొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని రావెల గ్రామానికి చెందిన సతీష్ (18) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లో ఉంటూ గుంటూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు రావటంతో ఇంటికి వచ్చాడు. ఈ నెల 19న తండ్రి మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి వాంతులు చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు గుంటూరుకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పెమ్మసానిని కలిసిన మేయర్ అశోక్

● నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ



కేంద్ర మంత్రి పెమ్మసానికి మొక్క అందజేస్తున్న కమిషనర్ మేయర్ అశోక్

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ని గుంటూరు కమిషనర్ కేమేయర్ అశోక్ బుధవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. నగరాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో కీలకమని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. గుంటూరు నగర అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పెమ్మసాని భరోసా ఇచ్చారు.

నూరు శాతం పన్ను వసూలు కావాలి : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ప్రతి అసెస్మెంట్ నుంచి నూరుశాతం పన్ను వసూలు కావాలని, దీనికోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని నగర కమిషనర్ కేమేయర్ అశోక్ స్పష్టం చేశారు. బుధవారం పెద్దపలకలూరులోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ఆస్తి పన్ను వసూళ్లు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై పరిశీలించి, అధికారులకు తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా ఆస్తి, ఖాళీ స్థల, నీటి మీటర్ల చార్జీలు నూరుశాతం వసూళ్లు చేయాలన్నారు. అలాగే భవన వినియోగం ఆధారంగా పన్ను విధింపు ఉండాలని, తమ రోజువారీ పర్యటనల్లో నేరుగా తనిఖీ చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను సమగ్రంగా చేపట్టాలని, ఇంటింటి చెత్త సేకరణ చేయాలన్నారు. రోడ్ల మీద వ్యర్థాలు వేయడానికి వీల్లేదని, డ్రెయిన్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, కార్పొరేటర్ సాంబిరెడ్డి, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈఎంహెచ్ డాక్టర్ శాంతి కళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ వేణుగోపాల్, ప్రజారోగ్య, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి సహకరిస్తాం

● కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, వైసీపీ కార్పొరేటర్లు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నగర సమగ్ర అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము పూర్తి సిద్ధంగా ఉంటామని ఎమ్మెల్సీ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్, మేయర్ అశోక్‌ను ఆయన వైసీపీ కార్పొరేటర్లతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధిలో అందరినీ భాగస్వాముల్ని చేయాలని ఆయన కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కమిషనర్‌తో కూలంకషంగా చర్చించారు. తొలుత కమిషనర్ మేయర్ అశోక్‌ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు వైసీపీకి చెందిన కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లి మాణిక్యరావు, పోతినేని శ్రీనివాస్‌లకు

ఎమ్మెల్యే గళ్లా మాధవి అభినందనలు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే గళ్లా మాధవి అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె గుంటూరులో ఒక ప్రకటనను విడుదల చేశారు. రాజకీయ చైతన్యం కలిగిన జిల్లాకు తెలుగుదేశం పార్టీ సారథిగా ప్రమాణ స్వీకారం చేసిన పిల్లి మాణిక్యరావు, ప్రధాన కార్యదర్శి పోతిన శ్రీనివాస్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుకు కృషి చేయాలి

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అరుణ్‌కుమార్

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు సక్రమంగా జరిగేలా కృషి చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు రామకృష్ణను కోరారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జి.రామకృష్ణను బుధవారం ఆయన కార్యాలయంలో గోళ్ల అరుణ్‌కుమార్, దారా అంబేద్కర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి రోస్టర్ విధానం సక్రమంగా అమలయ్యేలా చేయటంతో పాటు విశ్రాంత పొందిన ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్స్‌కి సంబంధించిన అనేక అంశాల మీద రానున్న రోజుల్లో సచివాలయ ఉద్యోగుల అండదండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగుల సంఘం నాయకులు, మాలమహానాడు నాయకులు ఉన్నారు.

నేటి నుంచి శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో వార్షిక వేడుకలు



శ్రీ కనకదుర్గమ్మ మూలవిరాట్

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పొన్నూరు రోడ్డులోని నంగిడి గుంట వద్దనున్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 22, 23 తేదీల్లో వార్షిక వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి జనార్దనరెడ్డి తెలిపారు. ఆలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గురువారం ఉదయం 8.30కి ఆలయ ధ్వజస్తంభ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. శుక్రవారం శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ 27వ వార్షికోత్సవం సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని గుంటూరు రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీడీవో బండి శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు స్థితి, ప్రజా సమస్యలు, మౌలిక సదుపాయాలపై చర్చించారు. అనంతరం ఇంటూరి పద్మావతి మాట్లాడుతూ సమస్యలేవైనా పరిష్కరించి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఏవో విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కే శ్రీనివాసరావు, మండల సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లెనిన్ రచనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి : మాల్యాద్రి

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): లెనిన్ రచనలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. లెనిన్ వర్ధంతి సందర్భంగా బుధవారం కొత్తపేట, సీపీఐ కార్యాలయంలో లెనిన్ విగ్రహానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, సుబ్బారావు, చిన్నా, దేవానాయక్, లక్ష్మీ శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 25న సామూహిక ఉపనయనాలు

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25వ ఉచిత సామూహిక ఉపనయనాలు నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ బొప్పూడి శివరామకృష్ణ ప్రసాద్ తెలిపారు. స్థానిక బ్రాడీ పేట, 13వ లైనులో సమితి కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో సభ్యులు నందిరాజు పాండురంగారావు, వేదాంతం వెంకట వినోద్ కిరణ్, రంగావజ్జల లక్ష్మీపతి, తుమ్మల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా రహదారి విస్తరణ

● ఇష్టారీతిన కొలతలతో పనులు
● విస్తుబోతున్న స్థానికులు

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శారదాకాలనీలో రహదారి విస్తరణ పనుల్లో లోపాలు స్థానికులను విస్తుపోయేలా చేస్తోన్నాయి. రహదారి విస్తరణ పనులను చేపట్టిన అధికారులు ఒక్కో చోట ఒక్కో కొలతలతో అడ్డగోలుగా మార్కింగ్ చేసి పనులు చేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శారదాకాలనీ 21వ లైను నుంచి 32వ లైను వరకు మెయిన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. వాస్తవానికి 60 అడుగుల రోడ్డు విస్తరణకు పనులు చేపట్టిన అధికారులు అసలు ఆర్చ్ సెంటర్‌లో విస్తరణను వదిలేయటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు ప్రారంభించిన ప్రదేశంలో 45 అడుగులు విస్తరణలో ఉన్న రహదారి చివరికి వచ్చే సరికి 60 అడుగులకు చేరటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవటంతో పనులు అడ్డదిడ్డంగా జరుగుతున్నాయి. ప్రధాన సెంటర్‌లో ట్రాఫిక్ రద్దీతో కాలనీ ప్రజలు ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ సెంటర్‌లో పూర్తి స్థాయిలో ఆక్రమణలను తొలగించి 60 అడుగులకు విస్తరించి పనులు చేయకపోతే, భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విస్తరణ పనులు చేయకపోతే ఇక్కడ రహదారి నిర్మాణ పనులు చేసి ఏం ప్రయోజనమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



22వ లైను వద్ద 45 అడుగులకు మాత్రమే విస్తరణ పనులు



26వ లైను వద్ద విస్తరణ తరువాత 60 అడుగుల రహదారి

పీఎం సూర్య ఘర్ లక్ష్యాలు సాధించాలి : కలెక్టర్



పీఎం సూర్యఘర్‌పై సమీక్షిస్తోన్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య ఘర్ లక్ష్యాలను నిర్దేశిత సమయంలో సాధించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఈ పథకం అమలుపై జిల్లాలో ల్యాండ్ సర్వే పూర్తయిన చోట సోలార్ పరికరాలు ఏర్పాటు చేసే పనిని మొదలుపెట్టాలని, నాణ్యత పరిశీలించాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలితో కలసి ఏపీసీపీడీసీఎల్ అధికారులు, బ్యాంకర్స్‌తో సూర్యఘర్ ప్రాజెక్టు ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సూర్యఘర్ పథకం ముఖ్యమైన కార్యక్రమమని, ప్రతి వారం ప్రగతి రావాలని స్పష్టం చేశారు. బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని పేర్కొంటూ బ్యాంకుల వారీగా ఉన్న పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకర్స్‌కు ఏమైనా సమస్యలుంటే ఎల్‌డీఎం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సాహించుటకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, మార్చి 31 లోపల పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టులుగా తీసుకుని 100 శాతం సూర్యఘర్ పథకం అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సీహెచ్ రమేష్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, సీఆర్‌డీఏ ఎస్ఈ ఎం శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, వెండర్స్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ, సరస్ మేళాను విజయవంతం చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియాను జనసేన నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి అంతర్ముఖం పుస్తకాన్ని అందజేశారు. సరస్ మేళా రూపంలో జిల్లా వాసులకు మరచిపోలేని సంక్రాంతి పండుగ శోభను అందించారని అభినందించారు. మినీ భారత్‌గా సాగిన సరస్ మేళాను ప్రజలెప్పటికి మరచిపోలేరని, ప్రతి ఏడాది సరస్ మేళా నిర్వహించాలని కలెక్టర్‌ను నాయకులు కోరారు. జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరావు, కొలసాని బాలకృష్ణ, కోటంశెట్టి బాలు, షేక్ సాధిక్, సునీల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఎలక్టోరల్ విధానాల అమలు అవార్డుకు డీఆర్వో ఎంపిక

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 25వ తేదీన ప్రదానం చేసే ఉత్తమ ఎలక్టోరల్ విధానాల అమలు అవార్డుకి జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి ఎంపికయ్యారు. ఈ మేరకు చీఫ్ ఎలక్టోరల్ అధి కారి వివేక్ యాదవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్వోతో పాటు ప్రత్తిపాడు ఏఈఆర్వో ఎస్ హెనాప్రియా, ప్రత్తిపాడు బీఎల్వో చల్లా శ్రీనివాస్‌ని కూడా సీఈవో ఎంపిక చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ముగ్గురు అధికారులు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారి యాని సీఈవో ఆదేశించారు.

మూడు నెలల్లో 22 రేషన్ షాపులపై కేసులు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రేషన్ మాఫియా అక్రమాలను అరికట్టడానికి జిల్లా పౌర సరఫరాల శాఖ యంత్రాంగం పకడ్బందీగా పని చేస్తోందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పీ.కోమలి పద్మ తెలిపారు. అక్టోబరు నుంచి జిల్లాలో 22 రేషన్ షాపు ల మీద 6ఏ కేసులు, 4 క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారిపై చర్యలకు అదేశించామని ఆమె తెలిపారు. అక్రమంగా రవాణా అవుతున్న 763 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, 6ఏ కేసులు 31, క్రిమినల్ కేసులు 28 నమోదు చేశామన్నారు.

విశ్వబ్రాహ్మణుల ఆత్మగౌరవ ప్రతీక రామ్మూర్తి

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విశ్వబ్రాహ్మణులకు సముచితస్థానం కల్పించి, వారి ఆత్మగౌరవ ప్రతీకగా పండిత్ రావుసాహెబ్ గానాల రామ్మూర్తి నిలిచారని విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు కొనియాడారు. రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక అరండల్‌పేట, బ్రహ్మంగారి మఠం వద్ద ఉన్న ఆయన విగ్రహాన్ని శుభ్రపరచి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు వినుకొండ వెంకట సుబ్బారావు, సిద్ధా వీర బ్రహ్మాచారి, ఫణితపు శ్రీనివాసరావు, సన్నమూరి శ్రీనివాసరావు, కొలకలూరి భారతి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐజీని కలిసిన బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని బుధవారం ఆయన కార్యాలయంలో బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. త్రిపాఠి మాట్లాడుతూ ప్రజలందరూ సంఘటితంగా ఉండి, మంచి నడవడికతో ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, స్పైసెస్ బోర్డ్ డైరెక్టర్ కొత్తూరి వెంకట సుబ్బారావు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, నాయకులు పాలపాటి రవికుమార్, జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్‌సీ భవనం వేగంగా పూర్తి చేయాలి

గుంటూరు సిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జడ్పీ ఆవరణలో నిర్మిస్తున్న డీపీఆర్‌సీ భవనం వేగవంతంగా పూర్తి చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్--ఆర్‌జీఎస్‌ఏ కన్సల్టెంట్ (కెపాసిటీ బిల్డింగ్, ట్రైనింగ్ సెల్) డాక్టర్ అభిషేక్ సింగ్ ఆదేశించారు. జిల్లాలో పర్యటించిన ఆయన డీపీఆర్‌సీ భవనాన్ని సందర్శించారు. డీపీఆర్‌సీ భవనం నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. జడ్పీ సీఈవో జ్యోతిబసు అభిషేక్‌సింగ్‌ను శాలువతో సన్మానించారు.

సామూహిక కుంకుమార్చనలు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. కాగా రెండో రోజున ముత్తైదవులతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఈసీ సభ్యుడు కొనకళ్ళ సత్యం, ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోట శేషగిరిరావు, కాకుమాను శ్రీనివాసరావు, కారంశెట్టి లోకేశ్, జూలూరి హేమాంగద గుప్తా తదితరులున్నారు.

15 మంది గంజాయి విక్రేతల అరెస్టు

● 4.2 కిలోలు స్వాధీనం

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయం., వినియోగం కేసులో 15 మంది నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసారు. వారి నుంచి సుమారు 4.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంజాయి కేసుల్లోని పాత నేరస్థులు, గంజాయి సేవిస్తున్న వారి వివరాలు సేకరించి పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా కాజా టోల్ ప్లాజా సమీపంలోని మధురానగర్‌లో నిర్మాణాలు జరుగుతున్న అపార్ట్మెంట్లో కొంతమంది గంజాయి కలిగి ఉన్నారని అందిన సమాచారం మేరకు రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లు నేతృత్వంలోని పోలీస్ సిబ్బంది ఆకస్మిక దాడిచేసి ఇద్దరు మైనర్లు సహా 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. గడచిన మూడు నెలల్లో గంజాయి విక్రయం, వినియోగానికి సంబంధించి 232 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. 82.5 కేజీల ఘన గంజాయిని, 250 గ్రాముల లిక్విడ్ గంజాయిని, 34 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బైక్‌ల దొంగ అరెస్టు

● ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న వసంతరాయపురం 2వ లైనుకు చెందిన కొండ్రాజు శీను అనే నిందితుడిని అరండల్‌పేట పోలీసులు అరెస్ట్ చేసారు. అతడి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరచి వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐ ఆరోగ్యరాజు కేసు వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా కొండబోయినపల్లికి చెందిన శీను కొంత కాలంగా గుంటూరులో ఉంటున్నాడు. అతను ఈ నెల 18న అరండల్‌పేటలో ఓ బైక్ చోరీ చేశాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 20న డొంక రోడ్డు వెల్ఫేర్ సెంటర్ వద్ద ఈ కేసులో నిందితుడైన శీనును అదుపులోకి తీసుకొని విచారించగా అతను ఏడు ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు అంగీకరించాడు. అతడి నుంచి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, పక్కన సీఐ ఆరోగ్యరాజు

కృష్ణబాబుకాలనీ, టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నట్లు వెస్ట్ డీఎస్పీ అరవింద్, సౌత్ డీఎస్పీ భానోదయ తెలిపారు. బుధవారం వెస్ట్ సబ్ డివిజన్‌లోని నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణబాబుకాలనిలోనూ, అలాగే సౌత్ సబ్ డివిజన్‌లోని నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల టిడ్కో గృహాల్లో సెర్చ్ ఆపరేషన్‌లు నిర్వహించారు.

మందుబాబులకు జైలు శిక్ష.. జరిమానా

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబు లకు కోర్టు జైలు శిక్ష.. జరిమానా విధించింది. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఏ. అశోక్‌కుమార్, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తమ సిబ్బందితో కలిసి నగర పరిధిలో ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులను న్యాయస్థానంలో హాజరుపరిచారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యాచారం కేసులో మూడేళ్ళుగా తప్పించుకు తిరుగుతున్న ఊదర నరసింహారావును పోలీసులు బుధవారం అరెస్టు చేసారు. 2020లో బాలికపై జరిగిన అత్యాచారం కేసులో ఏటీ అగ్రహారం 2వ లైనుకు చెందిన నరసింహారావు నిందితుడిగా ఉన్నాడు. అయితే కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. హైదరాబాద్‌లో ఉన్న నిందితుడిని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచారు.

ఆస్తి కాజేసిన వారిపై కేసు

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఒరిజినల్ డాక్యుమెంటు పోయినట్టుగా పోలీస్ సర్టిఫికెట్ సృష్టించడమే కాకుండా తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకుని ఆస్తి కాజేసిన విలేకరితో పాటు ఆయన కుటుంబసభ్యులపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది.



బాధితుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే నసీర్

గత ప్రభుత్వం పట్టాలిచ్చి స్థలాలు చూపించలేదు

● ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టా చేతికిచ్చి ఆర్భాటంగా ప్రచారం చేసుకుని, స్థలం కూడా చూపించని గత వైసీపీ అసమర్థ ప్రభుత్వాన్ని ఏమనాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ ప్రశ్నించారు. తూర్పు కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. మొత్తం 232 మంది తమ సమస్యలపై వినతులు అందించారు. ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సమస్యకూ పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాదర్బార్ ప్రజల వేదనలను ఆలకించే వేదికగా మారిందని చెప్పారు. రేషన్ కార్డుల్లో తప్పులు, ఇంటి పట్టాలు, పించన్లు వంటి అంశాలపై ప్రజల నుంచి అధికంగా వినతులు వచ్చాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి పట్టాలకు కనీసం స్థలాలు ఎక్కడో కూడా చూపించలేదని ఎక్కువ మంది బాధితులు ఫిర్యాదు చేశారన్నారు.

రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని ఎల్‌బీ నగర్లో రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నామని చెప్పారు.



బాల్య వివాహ విముక్తి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మహిళా ప్రజా ప్రతినిధులు

రాష్ట్రంలో బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, అసెంబ్లీ మహిళా, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ కమిటీ సభ్యురాలు గళ్లా మాధవి చెప్పారు. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం బాల్య వివాహ విముక్తి ప్రచార రథాన్ని సంక్షేమ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని, వాటి నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు సమాజమంతా బాధ్యతగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను చైతన్యపరిచేలా ఈ ప్రచార రథం విస్తృతంగా తిరుగుతూ అవగాహన కల్పించనుందని తెలిపారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్‌లో కమిటీ చైర్‌పర్సన్, కమిటీ సభ్యుల అధ్యక్షతన నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే మాధవి పాల్గొన్నారు. ఈ సమావేశంలో పథకాల అమలుతీరు, లబ్ధిదారులకు చేరువయ్యే విధానం, పెండింగ్ అంశాలు, మెరుగుదల చర్యలపై అధికారులతో సవివరంగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ పారదర్శకంగా, సమర్థవంతంగా చేరేలా అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ఘనంగా గ్రంధి కాంతారావు జన్మదిన వేడుకలు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): క్రేన్ గ్రూపు సంస్థల అధినేత జీవీఎస్ఎల్ కాంతారావు జన్మదిన వేడుకలు బుధవారం సంపత్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, నాయకులు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీఈసీ సభ్యుడు మందపాటి శేషగిరిరావు, వెలుగూరి అభయశ్రీ రత్నప్రసాద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు టీఎల్‌వీ వీరాంజనేయులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, పరసా కృష్ణారావు, వైఎస్ఆర్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఆలా కిరణ్, రమణ పలువురు కాంతారావుకు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు.



కాంతారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, టీఎల్‌వీ తదితరులు

కళలతో చైతన్యం.. వికాసం

● హరికథ విద్వాంసుడు వెంకటసింహాచల శాస్త్రి

గుంటూరు(విద్య), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కళలు మానసిక ఆనందం, చైతన్యాన్ని కలిగిస్తాయని సుప్రసిద్ధ హరికథా విద్వాంసులైన ముప్పవరపు వెంకట సింహాచల శాస్త్రి అన్నారు. బుధవారం మార్కెట్ సెంటర్ హిందూ కాలేజీ హైస్కూల్స్ కౌన్సిల్, చెరువు సూర్యనారాయణమూర్తి, సీతారామమ్మ స్మారక పురస్కారం స్వీకరించిన తర్వాత వెంకట సింహాచల శాస్త్రి మాట్లాడుతూ మన మహర్షులు చెప్పిన విషయాలు ఇప్పుడు శాస్త్రజ్ఞులు పరిశోధనలు జరిపి గుర్తించి చెబుతున్నారని, ప్రపంచదేశాలు మన సంస్కృతి సంప్రదాయాలను ఇప్పుడు గౌరవించటం శుభ పరిణామాలుగా చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన హిందూ కాలేజి హైస్కూల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ గబ్బిట శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రాచీన విద్యా విధానం విలువలతో కూడినదని చెప్పారు. సభలో చెరువు సత్యనారాయణమూర్తి, కమిటీ కార్యదర్శి కుటుంబరావు పాల్గొన్నారు.


ఈ- 15 రోడ్డు పక్కన మళ్లీ ప్రాణం పోసుకున్న 60 ఏళ్ల నాటి చింత చెట్లు

ప్రాణం పోశారు

- 60 ఏళ్ల చెట్లకు పునరుజ్జీవం పోసిన ఏడీసీఎల్
- రాజధానిలో రోడ్ల నిర్మాణంలో అడ్డంకిగా చెట్లు
- తొలగించి రోడ్డు విస్తరణ అనంతరం పునఃప్రతిష్ఠ

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చెట్లను నువ్వు రక్షించు అవి నిన్ను, నీ తర్వాతి తరాలను రక్షిస్తాయి అని చెబుతారు పెద్దలు. అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ (ఏడీసీఎల్) అధికారులు ఇదే చేసి చూపుతున్నారు. రాజధాని నిర్మాణంలో భాగంగా చేపట్టే అభివృద్ధి పను లు, రోడ్ల నిర్మాణంలో చాలా చోట్ల చెట్లు అడ్డు వస్తున్నాయి. సాధారణంగా అయితే వాటిని నరికేసి పక్కన పడేస్తారు. కాని ఏడీసీఎల్ అధికారులు అలా చేయలేదు. బాధ్యతగా ఆ చెట్లను అడ్డువచ్చిన ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చి అక్కడ మళ్లీ వాటికి ప్రాణం పోస్తున్నారు.

● 30 రోజులకు పునరుజ్జీవం

జేసీబీ సాయంతో చెట్ల మొదలు భాగాన్ని శుభ్రపరిచి కుళ్లిన వేర్లను, పొడవుగా పెరిగిన కొమ్మలను తొలగించారు. భారీ ట్రాలీ లారీలు ఏర్పాటు చేసి వాటిని అనంతవరంలో ఉన్న ఏడీసీ ట్రాన్స్ లొకేషన్‌కు తరలించారు. సుమారు 30 రోజులు వాటికి చికిత్స అందించి కొత్త వేర్లకు పునరుజ్జీవం పోశారు. అనంతరం వాటిని విస్తరించిన ఈ-15 రోడ్డు పక్కనే యథాస్థానంలో తిరిగి నాటారు. ఈ పురాతన భారీ వృక్షాలు తిరిగి అక్కడే జీవం పోసుకున్నాయి. ఇందులో 20 చెట్లను ఈ-12 రహదారి వెంట నాటారు. గత ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేయడాన్ని చూసిన ప్రజలు, ఇప్పుడు ఇలా వాటిని సంరక్షించే చర్యలను చూసి ఆశ్చర్యపోతున్నారు.

తాజాగా అమరావతిలో ఈ-15 రోడ్డుపై అడ్డుగా వచ్చిన చింతచెట్లను ఏడీసీ అధికారులు వేరే చోటకి తరలించారు. సాధారణంగా విదేశాల్లో ఇలాంటి అరుదైన ఘటనలు జరుగుతుంటాయి కానీ ఇప్పుడు అమరావతిలోనే ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. నిడమర్రు నుంచి మంగళగిరి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చింతచెట్లు ఉన్నాయి. దాదాపు అరవై ఏళ్లుగా రెండు ప్రాంతాల ప్రయాణికులకు నీడనిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆ చెట్లతో ఆ పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో అనుబంధం ఉంది. అయితే ఇప్పుడు ఈ రోడ్డునే ఈ-15 రోడ్డుగా విస్తరిస్తున్నారు. రోడ్డును విస్తరించే సమయంలో చెట్లు అడ్డు రావడంతో ఏడీసీ ఛైర్‌పర్సన్, ఎండీ డి.లక్ష్మీ పార్థసారథి వాటిని తరలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

● 60 ఏళ్ల నాటి చెట్లకు తిరిగి ప్రాణం

> రబీ సీజన్ ఆరంభంలోనే మొక్క జొన్న రైతుకు ఎదురుదెబ్బ తగిలింది. మొలకెత్తని మొక్క జొన్న విత్తనాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో విస్తారంగా సాగు చేసిన మొక్కజొన్న పంట రైతులకు తీవ్ర నిరాశ మిగిల్చింది. జిల్లాలోని పలు మండలాల్లో 30 నుంచి 35 శాతం వరకు విత్తనాలు మొలకెత్తక పోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మొలకలు రాని ప్రాంతాల్లో మళ్లీ విత్తనాలు నాటినా, అవి ముందుగా మొలకెత్తిన పంటతో కలవక దిగుబడిపై ప్రభావం చూపుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా జిల్లా రైతులకు రూపాయి మిగిలేది రెండో పంటలోనే. ఈ ఆశతోనే మొక్కజొన్న సాగు చేసిన రైతులకు చేదు అనుభవం ఎదురైంది.


దుగ్గిరాల మండలంలో సాగు చేసిన మొక్కజొన్న

మొలకెత్తని మొక్కజొన్న

- 30 నుంచి 35 శాతం విత్తనాల వైఫల్యం
- రబీ సాగులో రైతులకు భారీ నష్టం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 20,279 హెక్టార్లలోమొక్క జొన్న సాగు అయ్యింది. మండలాల వారీగా సాగు విస్తీర్ణం పరిశీలిస్తే గుంటూరు తూర్పు- 145, గుంటూరు పడమర- 50, పెదకాకాని- 255, ప్రత్తిపాడు- 519, వట్టిచెరుకూరు- 880, పెదనందిపాడు- 2045, మేడికొండూరు- 336, ఫిరంగిపురం- 605, తాడేపల్లి- 631, తుళ్లూరు- 539, తాడికొండ- 220, తెనాలి- 2667, దుగ్గిరాల- 2989, కొల్లిపర- 2084, పొన్నూరు- 3428, చేబ్రోలు- 1050, కాకుమాను- 2245, మంగళగిరి 631 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారు.

విత్తనాల ఖర్చు రైతుకు భారమే

రైతులు మొక్కజొన్న విత్తన ప్యాకెట్‌ను రూ.1,800 నుంచి రూ.2,300 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ప్యాకెట్‌లో 3.5 నుంచి 4 కిలోల విత్తనాలు మాత్రమే ఉంటాయి. ఎకరానికి 8 నుంచి 10 కిలోల విత్తనాలు అవసరం కావడంతో, రైతులు ఎకరాకు సగటున రూ.5 వేల వరకు విత్తనాలకే ఖర్చు చేస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో 30 నుంచి 35 శాతం విత్తనాలు మొలకెత్తకపోవడం అంటే ఎకరాకు రూ.1,500 నుంచి రూ.1,800 వరకు నష్టం వాటిల్లినట్లేనని రైతులు చెబుతున్నారు. ఈ క్రమంలో మొలకలు రాని చోట మళ్లీ విత్తనాలు నాటినప్పటికీ, అవి ముందుగా మొలకెత్తిన మొక్కలతో సమానంగా పెరగకపోవడంతో పంట ఏకరీతిగా లేకపోవడం, పూత దశలో తేడాలు, కోత సమయంలో అసమాన దిగుబడి వంటి సమస్యలు ఎదురవుతున్నాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.



చేతులు ఎత్తేస్తున్న దుకాణదారులు

విత్తనాలు విక్రయించే దుకాణదారులు.. "విత్తనాలు మొలకెత్తకపోతే మా బాధ్యత కాదు కంపెనీ బాధ్యత" అని చెబుతూ, అదే విషయాన్ని బిల్లుపై ముద్ర వేసి రైతుల చేతుల్లో పెడుతున్నారు. దీనివల్ల రైతులకు ఫిర్యాదు చేసే అవకాశం కూడా లేకుండా పోతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంఎన్‌సీ కంపెనీల ఆధిపత్యం

జిల్లాలో విక్రయిస్తున్న మొక్కజొన్న విత్తనాల్లో ఎక్కువ భాగం బహుళజాతి (ఎంఎన్‌సీ) కంపెనీలవే. స్థానిక, రాష్ట్రస్థాయి విత్తన కంపెనీలు చాలా తక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ధరలు ఎక్కువ.. బాధ్యత శూన్యం అన్న పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు.

సాంకేతిక కారణాలు

రైతులు కొనుగోలు చేసే మొక్కజొన్న విత్తనాల్లో 20 శాతం వరకు మొలకెత్తవు అన్న విషయం ప్యాకెట్ మీదే ముద్రిస్తారు. అంతకంటే ఎక్కువ మొలకెత్తక పోవడానికి సాంకేతిక కారణాలు ఉండవచ్చు అని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. విత్తనాల వయస్సు (సీడ్ వయ బిలిటీ తగ్గడం)తేమ శాతం ఎక్కువ/తక్కువ, విత్తనాలపై చేసిన రసాయన శుద్ధి లోపాలు, నిల్వ సమయంలో ఉష్ణోగ్రత నియంత్రణ లేకపోవడం, భూమిలో విత్తిన తర్వాత తక్షణ నీటిపారుదల లోపం వంటి వి కారణాలు కావచ్చని చెబుతున్నారు. అయితే ఒకే కంపెనీ విత్తనాల్లో విస్తృతంగా మొలక వైఫల్యం ఉంటే, అది నాణ్యత లోపానికి నిదర్శనమే అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో కొన్ని కంపెనీ లకు చెందిన విత్తనాలు మాత్రమే 30 నుంచి 35 శాతం వైఫల్యం చెందాయని అని రైతులు అంటున్నారు.

యూనివర్సిటీ నుంచి ఇస్తే

రైతులు రెండో పంటగా ఎక్కు వ సాగు చేస్తున్న మొక్కజొన్న విత్తనాల నూతన వంగడాలను (స్ట్రెయిట్ వెరైటీ) ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోనే ఆవిష్కరించి నేరుగా సరఫరా చేయాలన్నది డిమాండ్‌గా వినిపిస్తుంది. విత్తన కంపెనీలపై నాణ్యత తనిఖీలు కఠినం చేయాలని రైతులు కోరుతున్నారు. మొలకలు రాని విత్తనాలకు నష్ట పరిహారం చెల్లించే విధానం తీసుకురా వాలని అంటున్నారు. మొత్తానికి, గుంటూరు జిల్లాలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై యంత్రాంగం వెంటనే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా
కూటమి ప్రభుత్వం

● మంత్రి అనగాని సత్యప్రసాద్

చిలకలూరిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలకు ఏం కావాలో తెలుసుకుంటూ.. ఆ దిశగానే పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. చిలకలూరిపేటలో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎడ్ల పందేలను బుధవారం ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన తిలకించారు. ఆయా విభాగాల్లో గెలుపొందిన ఎడ్ల జతల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తున్నామని.. 2027 నాటికి భూముల రీసర్వే తప్పకుండా పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. రాచరికపు పోకడలతో పాటు తన ప్రచార పిచ్చివల్లే జగన్ భూ హద్దులు నిర్ణయించే సర్వే రాళ్లు, రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాలపై తన బొమ్మలేసుకున్నాడని విమర్శించారు. గత పాలకులు రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కు తీసుకెళితే.. తిరిగి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని సత్యప్రసాద్ వివరించారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఒంగోలు జాతి గిత్తల పెంపకం ఎంత కష్టమో వాటి పోటీల నిర్వహణ కూడా అంతే కష్టంతో కూడిందని అన్నారు. ఆరుగాలం శ్రమించే రైతుల కష్టాన్ని మరిపించేవి ఇలాంటి ఎడ్ల పందేలేనని, అలాంటి పోటీల నిర్వహణకు పూనుకున్న ప్రత్తిపాటి పుల్లారావును మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు చెప్పారు. మంత్రి సత్యప్రసాద్‌ను ప్రత్తిపాటి, ప్రత్తిపాటి ఫౌండేషన్ సభ్యులు, ఎడ్ల పందేల నిర్వాహకులు జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. నాల్గవ రోజున పందేలను చూడడానికి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, గిద్దలూరు, పర్చూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు ఎం.అశోక్‌రెడ్డి, ఏలూరి సాంబశివ రావు, కందుల నారాయణరెడ్డి, పశ్చిమగోదావరి మాజీ జెడ్పీ ఛైర్మన్ ఎం.బాపిరాజు గెలుపొందిన ఎడ్ల జతల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహక కమిటీ సభ్యులు యలం సాంబశివరావు, పేర్ని వీరనారాయణ, తేలప్రోలు వీరయ్య చౌదరి, తేళ్ళ సుబ్బారావు, ముత్తినేని వెంకటేశ్వర్లు, కందిమళ్ల అంజిబాబు, నెల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.


మంత్రి అనగానిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు, నిర్వాహకులు

అందాల గోవు..వింజనంపాడు ఆవు

ఎడ్ల పందేలలో భాగంగా నిర్వహించిన గోవుల అందాల పోటీల్లో సీనియర్ విభాగంలో బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం వింజనంపాడు రైతు తూబాటి బాలకృష్ణ ఆవు ప్రథమ స్థానంలో నిలిచింది. కావూరు గ్రామానికి చెందిన బేతంచర్ల చిన నరసయ్య, పర్చూరు మండలం దేవరపల్లి గ్రామం ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆవులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

పాలపళ్లు: పాలపళ్ల విభాగంలో పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం రైతు నర్రా సాయిరాఘవేంద్ర ఆవు ప్రథమ స్థానం, మార్టూరు మండలం కోలలపూడికి చెందిన సాదినేని ప్రసాద్ ఆవు ద్వితీయ, గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన జొన్నల శివారెడ్డి ఆవు తృతీయ స్థానాల్లో నిలిచాయి.


ఎడ్ల పందేలలో బండ లాగుతున్న ఒంగోలు జాతి గిత్తలు

న్యూ కేటగిరి: న్యూ కేటగిరి విభాగంలో నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత 4,518.10 అడుగులు దూరం బండలాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కాకుమాను మండలం కొండబాలవారిపాలేనికి చెందిన గూడవల్లి లక్ష్మీ దీక్షిత చౌదరి ఎడ్లజత, చుండూరు మండలం వేటపాలేనికి అత్తోట శిరీష చౌదరికి చెందిన ఎడ్ల జత 4,500 అడుగుల దూరం బండ లాగీ ద్వితీయ స్థానంలో నిలిచాయి. నాదెండ్ల మండలం ఇర్లపాడుకు చెందిన మంగు రమాదేవి ఎడ్ల జత తృతీయ స్థానంలో నిలిచింది. ప్రథమ బహుమతిరూ. 60 వేలు, ద్వితీయ బహుమతి రూ. 50 వేలు ప్రదానం చేశారు.

మిర్చి మెరిసే..

(5వ పేజీ తరువాయి)

గుంటూరు మిర్చికి డిమాండ్ పెరిగింది. ఈ డిమాండ్ చూసి విదేశాలకు ఎగుమతి అయ్యే తేజ రకం మిర్చిని కూడా స్టాకిస్టులు కొనుగోలు చేస్తున్నారు. ఎవరైతే రైతులు గత ఏడాది తక్కువ ధర ఉన్న సమయంలో మిర్చిని కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేసి పెట్టుకున్నారో వారంతా ఇప్పుడు రెట్టింపు ధరకు అమ్ముకుంటూ నష్టాలను అధిగమిస్తున్నారు. ఈ ఏడాది సాగు చేసిన కొత్త పంటలో తొలికాపు మిరపకాయలకు కూడా మంచి ధర ఇస్తున్నారని సంతోషం వ్యక్తపరుస్తున్నారు. ప్రస్తుతం కర్నూలు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాలకు చెందిన రైతులు మిర్చిని యార్డుకు తీసుకు వస్తున్నారు. కొద్ది రోజుల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి కూడా సరుకు యార్డుకు రాక ప్రారంభం కానున్నది. ప్రస్తుతం రోజుకు 70 వేలకు పైగా మిర్చి టిక్కీలు(ఒక్కో టిక్కీ 40 కేజీలకు పైగా) వస్తున్నా అమ్మకాలు జరుగుతున్నాయి. మరో వారం, పది రోజుల్లోనే యార్డుకు నిత్యం లక్ష టిక్కీలకు పైగా రాక మొదలౌతుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం దేవనూరు డీలక్స్, 341 రకం మిర్చి రకాలకు క్వింటాల్ ధర రూ.25 వేల వరకు లభిస్తున్నది. తేజకు ఈ సీజన్‌లో తొలిసారిగా రూ.20 వేల ధర లభించింది.

దిగులు పోయింది



గత ఏడాది మిర్చి సాగు చేసి నష్టం పోయామని మొన్నటి దాకా అనుకున్నాం. ఇప్పుడు ధర చూస్తుంటే ఆ దిగులు పోయింది. పెట్టిన పెట్టుబడికి దండగ లేకుండా మంచి ధర వచ్చింది. బ్యాడిగి రకం క్వింటాల్‌కు రూ.18 నుంచి రూ.20 వేలు వరకు పోతుంది.

- ఏదిపాటి అంకయ్య, దొనకొండ, ప్రకాశం జిల్లా

కొత్త వాటికీ మంచి ధర



నెంబరు 5 రకం క్వింటాల్ రూ.22 వేలు పలుకుతుంది. కొత్త కాయలకు కూడా మంచి రేటు వచ్చింది. తొలి కాయలు మంచి రేటు పడితే రైతుకు నష్టం వచ్చే పరిస్థితి ఉండదు. 341 రకం కూడా క్వింటాల్ రూ.25 వేలుకు కొన్నారు.

-అంబారపు చంద్ర, నార్జంపల్లి, కడప జిల్లా

రేటు వచ్చిందని వచ్చాను..



మిర్చి రైతుల బాధలు దేవుడు విన్నాడు. మంచి రేట్లు వచ్చాయి. రేటు వచ్చిందని శీతల గిడ్డంగుల్లో పెట్టిన కాయలు అమ్ముదామని వచ్చాను. ఈ మాత్రం ధరలు ఉంటే మిర్చి రైతులు ఒడ్డు ఎక్కుతారు. గత ఏడాది మంచి కాయలు కూడా రూ.10 వేలకు మించి పడలేదు.

-ఏరువ పిచ్చిరెడ్డి, ముద్దుల కట్ట, ప్రకాశం జిల్లా

నేడు, రేపు ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

● విద్యుత్ భవన్‌లో ఏర్పాట్లు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థల 2026-27 వార్షిక ఆదాయ, అవసరాలు, రిటైల్ ధరలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్‌సీ) గురు, శుక్రవారంతో పాటు 27వ తేదీల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈ చల్లా రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించి గుంటూరు సర్కిల్ కార్యాలయం సంగడిగుంట విద్యుత్ భవన్, తెనాలి చెంచుపేట, నల్లచెరువులోని ఈఈ కార్యాలయాల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని, అభ్యంతరాలు తెలియజేయవచ్చన్నారు.

ఇక రోజులే..

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాలిటీలతో పాటు 439 గ్రామ పంచాయతీలున్నాయి. గత ప్రభుత్వంలో 2021లో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి.

ఈ ఏడాది ఎన్నికలు లేనట్లే..

గత అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రకారం మునిసిపాలిటీ, పంచాయతీల వారీగా ఓటర్లను గుర్తించాలి. అలాగే వార్డుల వారీగా జాబితాలను రూపొందించాలి. అనంతరం పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్లు జిల్లాస్థాయిలో నిర్ధారించాల్సి ఉంది. గత ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన పంచా యతీల రిజర్వేషన్లు ఖరారు చేశారు. కొత్త జిల్లాగా పల్నాడు ఏర్పడటంతో పంచాయతీల రిజర్వేషన్‌లు గతంలో ఉన్న రొటేషన్ పద్ధతిలో కాకుండా.. కొత్తగా రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉందని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియను ఇప్పుడు ప్రారంభించినా కనీసం మూడు నెలలైనా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదని వారు తెలిపారు. అలాగే జనాభా గణన వల్ల ఎన్నికలు వాయిదా వేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఎన్నికల నిర్వహణ వాయిదాపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ఎన్నికల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.


గణతంత్ర వేడుకలకు సిద్ధం చేస్తున్న రోడ్డు

రిపబ్లిక్ డేకు
చక చకా ఏర్పాట్లు

తుళ్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న రాజధానిలో రిపబ్లిక్ డే వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. రాజధాని అమరావతిలో తొలిసారి జరుగుతున్న వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. రెండు రోజుల ముందే ఏర్పాట్లు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టారు. ఇప్పటికే ముఖ్య అతిథులు, అతిథులు, ప్రజలు కూర్చోవటానికి గ్యాలరీలను ఏర్పాటు చేశారు. పరేడ్ నిర్వహించడానికి, శకటాలు ప్రదర్శనకు రోడ్లు పూర్తవుతున్నాయి. మొత్తం పది వేల మంది వేడుకలు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రీ పరేడ్‌ను నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. బాంబ్ స్క్వాడ్‌లు నిరంతరం తినిఖీలు చేస్తున్నాయి. 21 ప్రభుత్వ శాఖల అభివృద్ధిని తెలియజేసే శకటాలను తీర్చిదిద్దుతున్నారు. రాయపూడి రెవెన్యూ పరిధిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల సముదాయాల నుంచి హైకోర్టు వెళ్లే మార్గంలో మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీ బంగ్లాల మధ్య 22 ఎకరాల స్థలంలో ఈ వేడుకలు జరగనున్నాయి.


వేడుకలకు సిద్ధం చేస్తున్న శకటాలు



మోదీ తినమన్న పండు ఇదే

ఇటీవల లద్దాఖ్‌లో జరిగిన ఓ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ సీబక్‌థోర్న్ పండు గురించి ప్రస్తావించారు. ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలతో నిండిన ఈ పండును యువత రోజూ ఆహారంలో చేర్చుకోవాలని ఆయన సూచించారు. అంతేకాదు దానికి 'సూపర్ ఫుడ్' అంటూ కితాబిచ్చారు. దీంతో అందరూ ఈ పండు గురించి నెట్టింట్లో వెతకడం మొదలుపెట్టారు. అంతలా మోదీ మెచ్చిన ఈ పండు ప్రత్యేకతలను తెలుసుకుందాం రండి...

ఎలా ఉంటుందంటే...

- ఇది బెర్రీ జాతికి చెందిన పండు. నారింజ రంగులో ఉంటుంది. పుల్లగా ఉంటూ కొద్దిపాటి ఉప్పదనపు రుచి దీని ప్రత్యేకత. లద్దాఖ్, హిమాలయ ప్రాంతాల్లో ఎక్కువగా లభిస్తుంది. స్థానికంగా దీన్ని లేహ్ బెర్రీ, హిమాలయన్ బెర్రీ, చర్మా, అమెస్, ధూర్చుక్ అని పిలుస్తుంటారు. దీని మొక్క గుబురుగా ముళ్ల పొదలా పెరుగుతుంది. -40 నుంచి +40 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలను తట్టుకుని మనగలుగుతుంది. ఎనిమిదో శతాబ్దానికి చెందిన ప్రాచీన టిబెటన్ సాహిత్యంలో ఈ పండు ప్రస్తావన ఉంది. పూర్వ కాలంలో ఈ పండుతోపాటు మొక్క భాగాలను కూడా సంప్రదాయ వైద్యంలో వాడినట్లు తెలుస్తోంది.

పోషకాల గని...



- సీబక్‌థోర్న్ పండులో సి విటమిన్.. నారింజలో కంటే పన్నెండు రెట్లు అధికంగా ఉంటుంది. అంతేకాదు ఎ, బి, ఇ, కె విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, పాలీ ఫెనాల్స్, పలు మినరల్స్, 200కి పైగా బయోయాక్టివ్ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. జీవక్రియకు దోహదం చేసే ఫ్లేవనాయిడ్లు, టెర్పినాయిడ్లు, అమైనో ఆమ్లాలు కూడా అధికంగానే ఉంటాయి.

ఆరోగ్య ప్రయోజనాలు

- సీబక్‌థోర్న్ పండును తీసుకోవడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలైనా వెంటనే తొలగిపోతాయని పరిశోధనలు చెబుతున్నాయి. రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం, శ్వాసకోశ సమస్యలను నివారించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది ఈ పండు. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అల్సర్లు, మూత్రపిండాల్లో రాళ్లు, ట్యూమర్లను అడ్డుకుంటుంది. ఆక్సీకరణ ఒత్తిడి, గుండె జబ్బుల నుంచి రక్షిస్తుంది. నాడీ సమస్యలను తగ్గించి జ్ఞాపకశక్తిని పెంచుతుంది. చర్మం పొడిబారకుండా కాపాడుతుంది. ముఖంపై మొటిమలు, తలలో చుండ్రు, ఇతర చర్మ వ్యాధులను మాయం చేస్తుంది.

అందుబాటులో ఇలా...

- సీబక్‌థోర్న్ పండుతో తయారుచేసే హెర్బల్ పానీయం, జామ్, జ్యూస్, సలాడ్, స్మూతీలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంటున్నాయి. డ్రై ఫ్రూట్ రూపంలోనూ దొరుకుతోంది. లద్దాఖ్‌లో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్).. ఈ పండ్ల సాగుని, వాటి ఉత్పత్తుల తయారీని ప్రోత్సహిస్తోంది.



కౌన్సెలింగ్

ఈ సమస్య సహజమేనా?

Q A

డాక్టర్! నా వయసు 35. నా భార్య వయసు 30. మాది అన్యోన్య దాంపత్యం. అయితే మిగతా సమయాలతో పోలిస్తే, ఉదయం వేళ శారీరకంగా కలిసిన వెంటనే నాకు చిత్రమైన అసౌకర్యం కలుగుతోంది. ఎడమ వైపు శరీరావయవాల్లో మాత్రమే నొప్పి మొదలవుతోంది. ఇందుకు కారణం ఏమై ఉంటుంది? ఇది సహజ సమస్యేనా?

– ఓ సోదరుడు, హైదరాబాద్



శారీరక కలయిక కారణంగా శరీరంలో ఒక వైపు నొప్పి తలెత్తదు. మిగతా వేళల్లో మామూలుగానే ఉండి, కేవలం ఉదయం వేళ మాత్రమే ఈ ఇబ్బంది తలెత్తడం జరగదు. ఈ స్థితి మానసికమైనది కావచ్చు. లేదా ఆ సమయంలో మీరు అనుసరించిన భంగిమ వల్ల శరీరం అసౌకర్యానికి గురవుతూ నొప్పి కలిగించి ఉండవచ్చు. కొన్నిసార్లు వాడుతున్న మంచం, పరుపులు కూడా అసౌకర్యాన్ని కలిగిస్తాయి. మీ అనుమానం తీరాలంటే ఆ సమయంలో భార్యకు కూడా శారీరక అసౌకర్యం కలుగుతుందేమో ఆరా తీయండి. ఇద్దరికీ ఇబ్బంది కలుగుతుందంటే అందుకు కారణం కచ్చితంగా మీరు అనుసరిస్తున్న భంగిమే అయి ఉంటుంది. అనుమానం తీరడం కోసం భంగిమను మార్చి చూడండి. అలాగే మంచం, పరుపు సౌకర్యంగా ఉండేలా చూసుకోండి. అయినప్పటికీ సమస్య సర్దుకోకపోతే సెక్సాలజిస్టుని సంప్రతించండి.

డాక్టర్ షర్మిలా మజుందార్,
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్,
హైదరాబాద్

శ్రద్ధా అగర్వాల్‌కు చదువంటే ప్రాణం. కానీ వినికిడి శక్తి లేకపోవడంవల్ల విద్యార్థినిగా ప్రతి దశ ఒక యుద్ధంలాగే సాగింది. ఆ కష్టం ఇంకెవరూ పడకూడదనే నిశ్చయంతో బధిర విద్యార్థుల కోసం ఒక కొత్త వేదికను ఆమె ఆవిష్కరించారు. సంజ్ఞలు, ఆంగ్ల వివరణలు సమాంతరంగా కనిపిస్తూ... వారి అవగాహన మెరుగుపరిచేలా తన 'సైన్‌సేతు'ను శ్రద్ధ తీర్చిదిద్దారు. "దీన్ని అవసరమైనవారందరికీ చేర్చాలన్నదే నా లక్ష్యం" అంటున్నారు ఇరవై మూడేళ్ళ శ్రద్ధ.

వారికోసం 'శ్రద్ధ'గా!



"నేను పుట్టింది, పెరిగింది తమిళనాడులోని చెన్నైలో. పుట్టుకతోనే నాకు వినికిడి లోపం ఉంది. దాని వల్ల బాల్యంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. నాకు చదువంటే ప్రాణం. బాల విద్యాలయలో ప్రాథమిక విద్యాభ్యాసం నాకు మంచి పునాది వేసింది. కానీ సాధారణ పాఠశాలలో చేరాక... ఆ వాతావరణం నాకు దిగ్భ్రాంతిని, వేదనను కలిగించింది. తరగతిలో ఏకైక బధిర విద్యార్థిని నేనే. నా తోటి విద్యార్థుల్లా పాఠాలను త్వరగా అర్థం చేసుకోవడం ఎంతో కష్టంగా ఉండేది. బోర్డు మీద ఉన్నవి నోట్‌బుక్‌లో వేగంగానే రాసుకొనేదాన్ని. కానీ టీచర్ల పెదవుల కదలికని బట్టి పాఠాలు అర్థం చేసుకోవడం, వారు చెబుతున్నవి రాసుకోవడం నాకు అతి పెద్ద సవాలు. మళ్ళీ చెప్పాలని టీచర్లను పదే పదే అడగాల్సి వచ్చేది. వేరే పిల్లల నోట్సులు అడగాల్సి వచ్చేది. కొన్నిసార్లు ఇచ్చేవారు, మరికొన్నిసార్లు విసుక్కొనేవారు. నాలాంటి ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు అనువైన బోధన పాఠశాలల్లో నాకు కనిపించలేదు. అయినా పట్టుదలతో కృషి చేశాను. ఉన్నత విద్య కోసం బ్రిటన్‌లోని వార్విక్ యూనివర్సిటీలో చేరాను. అక్కడ నాలాంటివారికి మెరుగైన సదుపాయాలు ఉంటాయనుకున్నాను. కానీ అక్కడా నోట్సుల విషయంలో అదే ఇబ్బంది. ఈ పరిస్థితులు... బధిరులను కలుపుకొని పోయే విద్యావ్యవస్థ ఆవశ్యకతను నాకు ప్రతి దశలోనూ గుర్తు చేస్తూనే ఉన్నాయి.

ఆ మథనం నుంచి...

మన దేశానికి తిరిగి వచ్చిన తరువాత... వినికిడి సమస్యలు ఉన్న ఎంతో మందిని కలుసుకున్నాను. తమకు ఉన్న లోపం కారణంగా అడుగడుగునా సవాళ్ళు ఎదుర్కొంటున్న వారి కథలు నన్ను కలవరపెట్టాయి. ఇది వ్యక్తిగతమైన సమస్య కాదనీ, వైకల్యాలు ఉన్న వారిని తమతో కలుపుకోవడానికి సిద్ధపడని వ్యవస్థలో ఉన్న సమస్య అని గుర్తించాను.



'దీన్ని అధిగమించడం కోసం ఏం చేయాలి?' అని నాలో జరిగిన మథనం నుంచి పుట్టినదే 'సైన్‌సేతు'. 'సైన్' అంటే సంజ్ఞ, 'సేతు' అంటే వారధి. ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (ఐఎస్ఎల్), ఇంగ్లీష్... ఈ రెండూ కలిసి ఉండే ఒక ప్లాట్‌ఫామ్‌గా దాన్ని రూపొందించాను. మన విద్యావ్యవస్థ ఎక్కువగా పాఠ్యభాగాలు, మౌఖిక బోధన, బట్టీ పట్టడం మీద ఆధారపడి ఉంటుంది. వినికిడి శక్తి ఉన్న పిల్లలకు సహజంగానే భాషాపరమైన పునాది ఏర్పడుతుంది. తమకు అనువైన బోధన పద్ధతులు లేకపోవడంతో చాలామంది బధిర విద్యార్థులు పదో తరగతివరకైనా చదవలేకపోతున్నారు. స్వతహాగా కొన్ని వాక్యాలు రాయలేకపోతున్నారు. తమకు తెలిసిన (సంజ్ఞల) భాషలో వారు నేర్చుకోకపోవడమే దీనికి కారణం.

మార్గదర్శకత్వం

వివిధ అంశాలను వివరించడం కోసం భారతీయ సంకేత భాషను ప్రాథమిక మాధ్యమంగా ఉపయోగించడం ద్వారా 'సైన్‌సేతు' మార్పు తీసుకువస్తుంది. సంజ్ఞలతో కూడిన వీడియోలు, ఫొటోలు, సరళమైన అర్థాల ద్వారా ఆంగ్ల పదాలను బధిరులైన పిల్లలు నేర్చుకుంటారు. తద్వారా వారిలో అవగాహన బలవంతంగా రుద్దినట్టు కాకుండా సహజంగా ఏర్పడుతుంది. కథలు, ఆటల రూపంలో పాఠాలుంటాయి. పెదవుల కదలికను తేలికగా గుర్తించగలిగే సంభాషణలు, దృశ్యాలు, సంజ్ఞలతో వీటికి రూపకల్పన చేశాం.

ఉదాహరణకు... ఒక పిల్లాడు కథల పుస్తకాన్ని తెరుస్తాడు, సంజ్ఞా భాషలో ఒక వ్యక్తి ఆ కథను వివరిస్తూ ఉంటారు. దానికి సమానమైన అర్థంలో ఆంగ్ల వాక్యాలు మరోవైపు కనిపిస్తూ ఉంటాయి. ఒక పదం సరిగ్గా తెలియకపోతే, ఆ పదం మీద క్లిక్ చేయవచ్చు. తక్షణమే సంజ్ఞల్లో దాని వివరణ, ఒక బొమ్మ కనిపిస్తాయి. ఇక... వాక్య నిర్మాణం, పద సంపద, వ్యాకరణం గురించి అవగాహన కల్పించేలా దృశ్యపరమైన, వినోదాత్మకమైన ఆటలు, పాటలు ఉంటాయి. ఈ అంశాలు బాగా అర్థమవుతున్నాయా? ఇంకా ఏవైనా మార్పులు చేయాలా?... లాంటి వివరాలతో పిల్లలు ఫీడ్‌బ్యాక్ కూడా ఇవ్వవచ్చు.

తల్లిదండ్రులు, టీచర్లకు...

బధిరులైన పిల్లలకు బోధనలో సాయపడే విధంగా తల్లిదండ్రులు, టీచర్లకు సంజ్ఞాభాషలో మార్గదర్శకత్వం కూడా అందిస్తున్నాం. ఇప్పటికే కొన్ని పాఠశాలలు, సంస్థలు, తల్లితండ్రుల సంఘాలు మా 'సైన్‌సేతు' సేవలను వినియోగిస్తున్నాయి. ఫలితాలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. పలు సంస్థల నుంచి పురస్కారాలు కూడా లభించాయి. 'సైన్‌సేతు'ను మరింత మెరుగుపరిచి, బధిరులైన వారందరికీ అందుబాటులోకి తేవాలనేది నా లక్ష్యం. ఆ దిశగా కృషి చేస్తున్నాను."

ఉగ్రవాదులతో పోరులో భర్త అమరుడైతే ఆ కన్నీటిని ధైర్యంగా మార్చుకుని ఆయన బాటలోనే నడిచిన దేశపు మొట్ట మొదటి వీరనారి ఆమె. సాయుధ దళాల వెటరన్ డే సందర్భంగా లెఫ్టినెంట్ కల్నల్ రవీందర్ జీత్ రంధవా (రిటైర్డ్) అజేయ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ సైన్యం ఆమెకు సెల్యూట్ చేసింది. 'మనకోసం మనం నిలబడితే ఏదైనా సాధ్యం' అంటూ యువతలో స్ఫూర్తి నింపే రంధవా స్ఫూర్తిగాథ ఇది.

స్ఫూర్తి



వీరనారి సైన్యమై కదిలిన వేళ

చండీగఢ్‌లో ఇటీవల జరిగిన 10వ సాయుధ దళాల వెటరన్స్ డే వేడుకలు ఎందరో వీరుల త్యాగాలను స్మరించుకున్నాయి. కానీ, అక్కడ అందరి దృష్టిని ఆకర్షించిన పేరు.. లెఫ్టినెంట్ కల్నల్ రవీందర్ జీత్ రంధవా (రిటైర్డ్). భారత సైన్యం చరిత్రలో ఒక సామాన్య ఇల్లాలు అధికారిణిగా ఎదిగిన అసాధారణ ప్రయాణం ఆమెది.



విధి ఆడిన వింతనాటకం

1997 జూన్ 17.. అనంతనాగ్‌లో ఉగ్రవాదులతో జరిగిన పోరాటంలో 2 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన మేజర్ సుఖ్వీందర్ జీత్ సింగ్ రంధవా (కీర్తిచక్ర-మరణానంతరం) వీరమరణం పొందారు. అమృత్‌సర్‌కు చెందిన రవీందర్ అప్పుడు ఒక పసిపాపకు తల్లి. భర్త మరణవార్త విన్నప్పుడు ఆమె సర్వస్వం కోల్పోయినట్టు భావించారు. కానీ, తన బిడ్డను సైనిక వాతావరణంలోనే పెంచాలన్న తన భర్త ఆఖరి కోరికను నెరవేర్చాలని అప్పుడే నిర్ణయించుకున్నారు.

సంకెళ్లను తెంచుకుని

ఒక సాధారణ గృహిణి సైన్యంలో చేరడం అంత సులభం కాదు. వయసు, వైవాహిక స్థితి వంటి ఎన్నో అడ్డంకులు. కానీ రవీందర్ పట్టుదల ముందు నిబంధనలు కూడా తల వంచక తప్పలేదు. అప్పటి ఆర్మీచీఫ్ జనరల్ వేద్ ప్రకాశ్ మలిక్ సహకారంతో ప్రత్యేక అనుమతి పొందిన ఆమె 1997 డిసెంబర్‌లో సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) పాసయ్యారు. 1998 మార్చి 21న తన పుట్టిన రోజు నాడే ఆమె ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (చెన్నై)లో అడుగుపెట్టారు. సెప్టెంబర్ 5న యూనిఫాం ధరించి దేశంలోనే తొలి 'వీరనారి' అధికారిణిగా చరిత్ర పుటల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు.

పాతికేళ్ల ప్రయాణం

ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్‌లో రెండున్నర దశాబ్దాలపాటు విశేష సేవలు అందించిన రవీందర్ ఒకవైపు విధి నిర్వహణ చేస్తూనే మరోవైపు సింగిల్ మదర్‌గా తన కుమార్తెను ప్రయోజకురాలిని చేశారు. 2023లో పదవీ విరమణ చేసినప్పటికీ ఆమె ప్రయాణం నేటి యువతకు ఒక గొప్ప పాఠం. "మన కోసం మనం నిలబడనంత వరకు ఎవరూ మనల్ని కాపాడలేరు. మిమ్మల్ని మీరు నమ్మితే ఈ ప్రపంచంలో ఏ సమస్యా పరిష్కారం కాకుండా పోదు" అని చెప్పే కల్నల్ రంధవా జీవితం ఎంతోమందికి స్ఫూర్తి.

కుక్కర్ లీకేజీ ఆగేదెలా?

కుక్కర్‌లో వంట చేసేటప్పుడు ఒక్కోసారి దాని మూత నుంచి నీటి చుక్కలు స్టవ్ మీద పడుతుంటాయి. అంతేకాదు కుక్కర్‌లోని ఆహార పదార్థాలు విజిల్ భాగం నుంచి బయటికి పొంగుతుంటాయి. ఇలాంటి లీకేజీ సమస్యలను నివారించేందుకు చిన్న చిట్కాలు...



- కుక్కర్‌తోపాటు రబ్బర్ గ్యాస్కెట్, విజిల్, స్టీమ్ వాల్వ్, సేఫ్టీ వాల్వ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. వీటిలో ఆహార పదార్థాల అవశేషాలు చిక్కుకుని ఉంటే ఆవిరి నిలిచి నీరుగా మారి బయటికి లీకవుతుంది.
- రబ్బర్ గ్యాస్కెట్ పాతబడినా, పగిలినా, వదులుగా మారినా, దాన్ని మూతలో సరిగా అమర్చకపోయినా నీరు బయటికి లీక్ అవుతుంది. వంట పూర్తయిన తరువాత గ్యాస్కెట్‌ను శుభ్రం చేసి కొద్దిసేపు డీప్ ఫ్రిడ్జ్‌లో ఉంచాలి. ఏడాదికి ఒకసారి గ్యాస్కెట్‌ను మార్చడం మంచిది. అప్పుడప్పుడు దానికి కొద్దిగా వంటనూనె రాస్తే ఎక్కువకాలం మన్నికగా ఉంటుంది.
- కుక్కర్‌కు మూత సరిగా ఫిట్ అయ్యేలా లాక్ చేయాలి.
- కుక్కర్‌లో నిండుగా ఆహార పదార్థాలను నింపకూడదు. కనీసం పావు వంతు ఖాళీ ఉండేలా చూసుకోవాలి. మరీ ఎక్కువగా కాకుండా తగినన్ని నీళ్లు మాత్రమే కుక్కర్‌లో పోయాలి.
- కుక్కర్‌లో వంట చేసేటప్పుడు స్టవ్‌ను మీడియం ఫ్లేమ్‌లో పెట్టుకోవాలి. అన్నం, పప్పు లాంటివి వండేటప్పుడు వాటిలో ఒక చుక్క నూనె వేస్తే అవి విజిల్ పైకి పొంగవు.

బరువు తగ్గేందుకు...

ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, మంచి నిద్రలతో శరీర బరువును నియంత్రించుకోవచ్చు. ఎలాగంటే...



- ఉదయం లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల నిమ్మరసం, చిటికెడు ఉప్పు వేసుకుని తాగాలి. దీనివల్ల శరీరంలో పేరుకున్న అదనపు కొవ్వులు కరిగిపోతాయి. అల్పాహారం మానకూడదు. కార్బోహైడ్రేట్లు తక్కువగా ప్రొటీన్లు, పీచులు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. రోజూ ఆహారంలో ఓట్స్, క్వినోవా, ఉడికించిన కూరగాయలు, ఆకు కూరలు, పెరుగు, పనీర్, గుడ్లు, మొలకలు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్, తాజా పండ్లు ఉండేలా చూసుకోవాలి. నూనె పదార్థాలు, స్వీట్లు, జంక్ ఫుడ్‌ను తినకూడదు. నీరు ఎక్కువగా తాగాలి. రాత్రి భోజనాన్ని త్వరగా ముగించాలి. పడుకునేముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగితే ఉదయానికల్లా శరీరంలోని వ్యర్థాలన్నీ బయటికి వెళ్లిపోతాయి.
- రోజూ కనీసం అరగంటసేపు వ్యాయామం చేయాలి. వాకింగ్, జాగింగ్, స్కిప్పింగ్, ఏరోబిక్ వ్యాయామాలు మంచి ఫలితాన్నిస్తాయి. వారానికి రెండుసార్లు స్క్వాట్స్ లాంటి కఠినమైన వ్యాయామాలు చేయాలి. మెట్లు ఎక్కడం దిగడం వల్ల ఎక్కువగా శక్తి వినియోగమవుతుంది.
- రోజుకు కనీసం ఎనిమిది గంటలు హాయిగా నిద్రపోవాలి. దీనివల్ల హార్మోన్లు సమతుల్యంగా పనిచేస్తాయి. జీవక్రియలు వేగవంతమై శరీర బరువు అదుపులోకి వస్తుంది.

మెదడు చురుకుగా ఇలా

ఆలోచనా సామర్థ్యం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగాలంటే మెదడు చురుకుగా పనిచేయాలి. అందుకోసం ఈ చిట్కాలు పాటిస్తే సరి...

- రోజూ ఉదయాన్నే యోగ, ధ్యానం, తేలికపాటి వ్యాయామం, వాకింగ్, జాగింగ్‌లలో ఒకదాన్ని అలవాటు చేసుకోవాలి. వీటి వల్ల రక్తప్రసరణ పెరిగి మెదడు చురుకుగా మారుతుంది.
- శరీరంలో నీటిశాతం తగ్గితే డీహైడ్రేషన్ ఏర్పడి మెదడు పనితీరు మందగిస్తుంది. దీంతో మతిమరుపు, ఏ పనీ చేయాలనిపించకపోవడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. అలా కాకుండా రోజుకు కనీసం నాలుగు లీటర్ల నీటిని తాగితే ఉత్సాహంగా అనిపిస్తుంది. మెదడు ఆరోగ్యంగా పని చేస్తుంది. ఏకాగ్రత పెరుగుతుంది.



- తరచూ ప్రాణాయామం చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మనసు ప్రశాంతంగా మారుతుంది. దీంతో మెదడు ఆలోచన సామర్థ్యం మెరుగుపడుతుంది.
- తాజా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, గింజలు, ధాన్యాలు, ఓట్స్‌ను ఆహారంలో చేర్చుకుంటే మెదడుకు చురుకుదనం పెరుగుతుంది. బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఎండు ద్రాక్ష, జీడిపప్పు, ఖర్జూరాలు తింటుంటే మెదడులోని కణాల వ్యవస్థ బలోపేతమవుతుంది. కాఫీ, టీలను ఎక్కువగా తాగితే మాత్రం వాటిలోని కెఫిన్.. మెదడును బలహీనపరచి జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తుంది. వీటికి బదులు గ్రీన్ టీ, హెర్బల్ పానీయాలు తాగడం మంచిది.
- మొబైల్, టీవీలతో ఎక్కువ సమయం గడపడం వల్ల మెదడు అలసిపోతుంది. కాబట్టి వీలైనంత వరకు స్క్రీన్ టైమ్‌ను నియంత్రించుకోవడం మంచిది.
- పజిల్స్, బ్రెయిన్ గేమ్స్, సుడోకో, చెస్, క్రాస్ వర్డ్ లాంటివి మెదడుకు వ్యాయామాన్ని, శక్తిని అందిస్తాయి.
- రోజూ కొత్త అంశాలు నేర్చుకునే ప్రయత్నం చేస్తూ ఉండాలి. నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం, నిరంతర సాధన అనేవి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి

న్యూస్ మేకర్

కర్తవ్య పథంలో

దేశం పట్ల ప్రేమ... దాన్ని రక్షించుకొనే సైనికురాలిని కావాలన్న దృఢ సంకల్పం... ఆమెను సీఆర్‌పీఎఫ్ వైపు నడిపించాయి. జమ్ముకశ్మీర్ రజౌరీ జిల్లా నుంచి అత్యున్నత అంతర్గత భద్రతా దళంలో చేరిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చాయి. సిమ్రన్ బాల... అసిస్టెంట్ కమాండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమె కెరీర్‌లో ఇప్పుడు మరో మైలు రాయి. కర్తవ్య పథ్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుషుల బృందానికి నాయకత్వం వహించే అరుదైన గౌరవం 26 ఏళ్ల సిమ్రన్‌కు దక్కింది.

జనవరి 26... గణతంత్ర దినోత్సవంనాడు ఢిల్లీలోని కర్తవ్యపథ్... మరో చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. అక్కడ నిర్వహించే మార్చ్‌పాస్ట్‌లో పూర్తిగా పురుషులతో కూడిన సీఆర్‌పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) దళానికి సిమ్రన్ బాల నాయకత్వం వహించనున్నారు. గతంలో సీఆర్‌పీఎఫ్ మహిళా అధికారులు పరేడ్‌లో తమ బృందాలను ముందుండి నడిపించిన సందర్భాలు ఉన్నాయి. కానీ 140 మందికి మించిన, పూర్తిగా పురుషులతో కూడిన భారీ బృందానికి ఒక మహిళ నాయకత్వం వహించడం ఇదే తొలి సారి కానుంది.

సిమ్రన్ స్వస్థలం జమ్ముకశ్మీర్‌లోని రజౌరీ జిల్లా. 'ది ల్యాండ్ ఆఫ్ కింగ్స్'గా పేరున్న ఈ జిల్లా... మొఘలుల కాలంనాటి కట్టడాలు, కేసరీహిల్స్ పర్యాటక ప్రాంతాలకు నిలయం. సాంస్కృతిక వైవిధ్యం దీని మరో ప్రత్యేకత. ఇలాంటి వాతావరణంలో పెరిగిన సిమ్రన్‌కు చిన్నప్పటి నుంచి దేశం పట్ల అమితమైన ప్రేమ. పుట్టి పెరిగిన ప్రాంతం... భిన్నత్వంలో ఏకత్వం చాటుకున్న దేశం... ఇవే ఆమెకు స్ఫూర్తి. అందుకే ఒక సిపాయిగా దేశానికి సేవలు అందించాలనుకున్నారు. జమ్ములోని గాంధీనగర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో పొలిటికల్ సైన్స్ డిగ్రీ పట్టా పొందారు. అనంతరం యూపీఎస్‌సీ నిర్వహించిన 'సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్స్' పరీక్ష రాసి అర్హత సంపాదించారు.



శిక్షణలో మేటి...

గురుగ్రామ్‌లోని సీఆర్‌పీఎఫ్ అకాడమీలో సిమ్రన్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణ సమయంలో పబ్లిక్ స్పీకింగ్ సబ్జెక్ట్‌లో అసమాన ప్రతిభ కనబరిచారు. 'బెస్ట్ ఆఫీసర్ ఇన్ ట్రైనింగ్' అవార్డును అందుకున్నారు. విశేషమేమిటంటే... రజౌరీ జిల్లా నుంచి దేశంలోనే అతిపెద్ద పారామిలిటరీ దళంలో ఆఫీసర్ ర్యాంకులో చేరిన మొట్టమొదటి మహిళగా సిమ్రన్ చరిత్ర సృష్టించారు.

ఆరంభంలోనే సవాళ్లు...

మూడు లక్షలకు పైగా సిబ్బంది గల సీఆర్‌పీఎఫ్ అత్యున్నత అంతర్గత భద్రతా దళం. నక్సల్, ఉగ్రవాద, తిరుగుబాటు నిరోధక కార్యకలాపాలు నిర్వహించడం సీఆర్‌పీఎఫ్ ప్రధాన విధులు. అడుగడుగునా సవాళ్లతో కూడుకున్న ఈ దళంలో భాగస్వామ్యం కావడం గర్వంగా భావిస్తారు సిమ్రన్. గత ఏడాది ఏప్రిల్‌లో ఆమె ఇందులో చేరారు. తొలి పోస్టింగ్... ఛత్తీస్‌గఢ్ 'బస్తారియా' బెటాలియన్‌లో. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ కోసం ఏర్పాటైన ప్రత్యేక దళం. ఇందులో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ... అధికారుల ప్రశంసలు అందుకున్నారు సిమ్రన్. ఆమె సేవలు గుర్తించి ఇప్పుడు గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ బృందానికి నాయకత్వం వహించే అరుదైన అవకాశం కల్పించారు. దీంతోపాటు 'సశస్త్ర సీమా బల్' (ఎస్ఎస్‌బీ), సీఆర్‌పీఎఫ్ నుంచి మహిళా 'డేర్ డెవిల్స్' బృందాలు బుల్లెట్ బైక్‌లను నడుపుతూ కవాతులో పాల్గొంటాయి. 2020 రిపబ్లిక్ డేలో కూడా ఈ మహిళా బృందాలు ఇదేతరహా ఫీట్‌ను ప్రదర్శించి అబ్బుర పరిచాయి.

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,210 కోట్లు

క్యూ3లో 14 శాతం క్షీణత

» దెబ్బతీసిన అమెరికా మార్కెట్

» ఆదాయం రూ.8,727 కోట్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం క్షీణించి రూ.1,210 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,413 కోట్లుగా ఉంది. అమెరికా మార్కెట్లో క్యాన్సర్ ఔషధం లెనలిడొమైడ్ విక్రయాలు గణనీయంగా తగ్గటం కంపెనీ పనితీరుపై ప్రభావం చూపించింది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ మాత్రం 4.4 శాతం వృద్ధితో రూ.8,357 కోట్ల నుంచి రూ.8,727 కోట్లకు పెరిగింది. డిసెంబరు త్రైమాసికంలో అమెరికాలో లెనలిడొమైడ్ విక్రయాలు తగ్గినప్పటికీ బ్రాండెడ్ వ్యాపారం మెరుగ్గా ఉండటంతో పాటు విదేశీ మారకం (ఫారెక్స్) సానుకూలంగా ఉండటం కలిసి వచ్చిందని డాక్టర్ రెడ్డీస్ కో-ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ తెలిపారు. కాగా వ్యాపార వృద్ధి కోసం వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో పాటు అవకాశాలు, ఆవిష్కరణల ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన ఫలితాలను రాబట్టుకోవాలని లక్ష్యం పెట్టుకున్నట్లు వెల్లడించారు.

అమెరికా ఆదాయాల్లో 12% తగ్గుదల

డిసెంబరు త్రైమాసికంలో అమెరికా మార్కెట్లో కంపెనీ విక్రయాలు 12 శాతం క్షీణతతో రూ.2,964 కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో విక్రయాలు రూ.3,383 కోట్లుగా ఉన్నాయి. క్యాన్సర్ ఔషధ విక్రయాలు తక్కువగా ఉండటంతో పాటు ఇతర కీలక ఔషధాల ధరలు తగ్గటం ఇందుకు ప్రధాన కారణంగా ఉంది. ఈ కాలంలో యూరప్ మార్కెట్ ఆదాయాలు మాత్రం 20 శాతం వృద్ధితో రూ.1,447.60 కోట్లుగా ఉన్నాయి. మరోవైపు భారత మార్కెట్ రెవెన్యూ కూడా 19 శాతం వృద్ధి చెంది రూ.1,603 కోట్లుగా ఉన్నట్లు డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది.

ఈ ఏడాదే మార్కెట్లోకి సెమాగ్లుటైడ్

ఈ ఏడాదే అంతర్జాతీయ మార్కెట్లోకి డయాబెటిస్, వెయిట్ లాస్ ఔషధం సెమాగ్లుటైడ్‌ను విడుదల చేయాలని డాక్టర్ రెడ్డీస్ భావిస్తోంది. కెనడా సహా మొత్తం 87 దేశాల్లో ఈ ఔషధాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ యోచిస్తోంది. భారత్‌లో ఈ ఏడాది మార్చి 21తో ఈ మాలిక్యూల్‌కు పేటెంట్ గడువు ముగియనుంది. ఇప్పటికే భారత్‌లో సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్ల తయారీ, మార్కెటింగ్‌కు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి కంపెనీ అనుమతులు అందుకుంది. ప్రస్తుతం కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ భాగస్వామ్యాలు, విశాఖపట్నంలోని ప్లాంట్ ద్వారా ఏటా 1.2 కోట్ల సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్స్‌ను ఉత్పత్తి చేయాలని చూస్తున్నట్లు కంపెనీ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ చెప్పారు. అవసరమైతే ఉత్పత్తిని 5 కోట్ల ఇంజెక్షన్స్‌కు పెంచుకునే అవకాశం ఉందన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,57,260 ▲	1,44,150 ▲	3,40,000 ▲
విజయవాడ	1,58,700 ▲	1,47,700 ▲	3,27,900 ▲
విశాఖపట్నం	1,58,425 ▲	1,43,550 ▲	3,45,000 ▲
రాజమండ్రి	1,57,250 ▲	1,44,150 ▲	3,15,000 ▲
ప్రొద్దుటూరు	1,57,600 ▲	1,44,990 ▲	3,25,000 ▲
ముంబై	1,54,227 ▲	1,41,227 ▲	3,19,097 ▲

పతనబాటలోనే మార్కెట్లు

సెన్సెక్స్ 82,000 దిగువకు


ముంబై: ఈక్విటీ మార్కెట్లో వరుసగా మూడో రోజు కూడా కల్లోలం కొనసాగింది. తీవ్ర ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో మార్కెట్ సూచీలు ప్రారంభంలో భారీగా నష్టపోయినప్పటికీ చివరలో లభించిన కొనుగోళ్ల మద్దతుతో ఆ నష్టాలను కొంతమేరకు కుదించుకోగలిగాయి. షరా మామూలుగానే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్లను కొనుగోళ్లకు దూరంగా ఉంచాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మరో చారిత్రక కనిష్ఠ స్థాయికి దిగజారడం కూడా సెంటిమెంట్‌ను దెబ్బ తీసిందని విశ్లేషకులంటున్నారు. ఈ నేపథ్యంలో సెన్సెక్స్ 82,000 పాయింట్ల దిగువకు చేరింది. ఒక దశలో 1,056.02 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి ఆ నష్టాన్ని 270.84 పాయింట్లకు పరిమితం చేసుకుని 81,909.63 వద్ద ముగిసింది. నిఫ్టీ 75 పాయింట్లు నష్టపోయి 25,157.50 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 2,831 షేర్లు నష్టాలతో ముగియగా 1,437 షేర్లు లాభపడ్డాయి. 137 మాత్రం లాభనష్టాలకు తావు లేకుండా నిలకడగా ఉన్నాయి.

సాగర్ సిమెంట్స్‌తో సో అండ్ రీప్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాగర్ సిమెంట్స్.. తెలంగాణలోని తన మట్టంపల్లి ప్లాంట్ వద్ద బయోచార్, గ్యాసిఫికేషన్ యూనిట్లు ఏర్పాటు చేయనుంది. ఇందు కోసం సో అండ్ రీప్ చరా అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా సో అండ్ రీప్ చరా కంపెనీ ఈ యూనిట్లు ఏర్పాటు చేస్తుంది. ఈ బయోచార్, గ్యాసిఫికేషన్ కోసం పత్తి కాడల వంటి వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగిస్తారు. దీనివల్ల సిమెంట్ ప్లాంటులో వాతావరణ కాలుష్యానికి దారితీసే శిలాజ ఇంధన వినియోగం తగ్గుతుందని రెండు కంపెనీలు తెలిపాయి. వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే బొగ్గు పొడిని రైతులకు ఎరువుగా సరఫరా చేయనున్నారు.

రూపాయి @ 91.65

డాలర్ మారకంలో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పతనం.. రానున్న రోజుల్లో మరింత క్షీణించే చాన్స్



ముంబై: మన ఆర్థిక పునాదులు యమ స్ట్రాంగ్ అని ప్రభుత్వం చెబుతునా.. ఆ ప్రభావం రూపాయి మారకం రేటుపై కనిపించడం లేదు. డాలర్‌తో రూపాయి మారకం రేటు రోజురోజుకీ దిగజారిపోతోంది. బుధవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం రేటు మరో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పడిపోయింది. డాలర్ మారకంలో ఒక్కరోజే 68 పైసలు నష్టపోయి రూ.91.65 వద్ద ముగిసింది. గత ఏడాది నవంబరు 21 తర్వాత డాలర్‌తో రూపాయి విలువ ఒకేరోజు ఈ స్థాయిలో క్షీణించడం ఇదే మొదటిసారి. ఆ రోజు డాలర్‌తో రూపాయి మారకం రేటు 98 పైసలు నష్టపోయింది. బుధవారం ఇంట్రాడేలో ఒక దశలో రూపాయి మారకం రేటు 91.74 వరకు నష్టపోయింది. పెట్టుబడుల ప్రవాహంలో నెలకొన్న ఆటుపోట్లతో భారత్‌తో సహా అనేక వర్ధమాన దేశాల కరెన్సీలు ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నట్టు కోటక్ మహీంద్రా ఏఎంసీ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ విభాగం ప్రధాన అధికారి అభిషేక్ బైసెన్ చెప్పారు. ఈ నెలలో ఇప్పటి వరకు డాలర్‌తో రూపాయి మారకం రేటు 1.5 శాతం మేర క్షీణించింది. ప్రస్తుత ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు మరింత పతనమయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

పతనానికి కారణాలు

గ్రీన్‌లాండ్‌పై అమెరికా-ఈయూ దేశాల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం, దేశీయ స్టాక్ మార్కెట్లో కొనసాగుతున్న బేర్ ఆపరేటర్ల పట్టు, ఎఫ్‌పీఐల అమ్మకాలు ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటును కుంగదీస్తున్నాయి. రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) జోక్యం చేసుకోకపోవడం కూడా రూపాయి పతనానికి కారణంగా ఉంది. అయితే ఏదో ఒక ప్రధాన సానుకూల పరిణామం చోటు చేసుకోకపోతే డాలర్ మారకంలో రూపాయి త్వరలోనే 92 మార్కును అధిగమించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

లాభమెంత.. నష్టమెంత..

రూపాయి పతనంతో బంగారం, వెండి, ముడి చమురు వంటి వస్తువుల దిగుమతులు మరింత భారం కానున్నాయి. విదేశాల్లో తమ పిల్లలను చదివించే తల్లిదండ్రులపైనా మరింత భారం పడనుంది. సీమ సరుకులు ఇష్టపడే వినియోగదారులపైనా అదనపు భారం తప్పదు. అయితే డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, డీలాపడిన మన ఎగుమతులకు కొద్దో గొప్పో కలిసి రానుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఈ పరిణామం మన ఎగుమతులకు గుడ్డిలో మెల్లలా తోడ్పడనుంది.

జీఎస్‌టీ అప్పీళ్లకు జీస్టాట్

విజయవాడలో కార్యాలయం ప్రారంభం

విజయవాడ (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వివాదాల పరిష్కారానికి విజయవాడలో ప్రత్యేకంగా ఒక ట్రిబ్యునల్ ఏర్పాటైంది. విజయవాడ బృందావన్ కాలనీలో ఏర్పాటు చేసిన జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ బెంచ్ (జీఎస్‌టీఏటీ-జీస్టాట్) కార్యాలయం బుధవారం ప్రారంభమైంది. జీస్టాట్ జ్యుడీషియల్ సభ్యుడు వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భాస్కర రెడ్డి మాట్లాడుతూ జీస్టాట్ బెంచ్ తాత్కాలికంగా విజయవాడ నుంచి పనిచేస్తుందన్నారు. వస్తు సేవల పన్ను వివాదాల పరిష్కారానికి సంబంధించి భారత్‌లో అత్యున్నత అప్పిలేట్ సంస్థ జీస్టాట్.. జీఎస్‌టీ అధికారులు జారీ చేసిన ఆదేశాలపై అప్పీల్ చేసుకోవడానికి పన్ను చెల్లింపుదారులకు ఇదొక వేదికగా నిలుస్తుందన్నారు. అప్పీళ్ల దాఖలు, పత్రాల సమర్పణ, కేసుల ట్రాకింగ్ జీస్టాట్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అంతకు ముందు హైదరాబాద్‌లో ఉన్న బెంచ్ రెండు తెలుగు రాష్ట్రాలకు సేవలందించిందని తెలిపారు. ఇప్పుడు ఏపీలో ఏర్పాటు కావడం శుభపరిణామన్నారు ఈ కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్‌టీ కమిషనర్ సుజిత్ మల్లిక్, జీఎస్‌టీ అడిషినల్ కమిషనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముంబై, బెంగళూరు, చెన్నైకి మై హోమ్ గ్రూప్ విస్తరణ

హైదరాబాద్: మైహోమ్ గ్రూప్ తన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలకూ విస్తరించింది. ఈ నగరాల్లో 4.66 కోట్ల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) విస్తీర్ణం ఉన్న ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రూ.4,100 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ ప్రాజెక్టుల అభివృద్ధి ద్వారా రూ.37,500 కోట్ల ఆదాయం లభిస్తుందని కంపెనీ భావిస్తోంది. జాతీయ స్థాయిలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థగా ఎదగాలనే లక్ష్యంతో కొత్తగా ఈ నగరాలకు విస్తరిస్తోంది. మైహోమ్ గ్రూప్ ఇప్పటికే హైదరాబాద్ రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, విద్యుత్, విద్య, సిమెంట్ రంగాల్లో తన సత్తా చాటింది. గత నాలుగు దశాబ్దాల్లో హైదరాబాద్, దాని చుట్టుపక్కల 8 కోట్ల ఎస్ఎఫ్‌టీకి సమానమైన నిర్మాణాలు పూర్తి చేసింది. మరో 4 కోట్ల ఎస్ఎఫ్‌టీకి సమానమైన భవనాలు నిర్మాణంలో ఉన్నాయి.

పసిడి అదే దూకుడు

10 గ్రాముల ధర రూ.1.60 లక్షలకు చేరువలో

ఒక్కరోజే రూ.6,500 పెరుగుదల

అదే బాటలో వెండి.. రూ.3.34 లక్షలకు కేజీ సిల్వర్



న్యూఢిల్లీ: డాలర్ మారకంలో రూపాయి ఢమాల్‌మంటుంటే బంగారం, వెండి ధరలు మాత్రం జిగేల్‌మంటున్నాయి. ఈ రెండు విలువైన లోహాల ధరలు బుధవారం మరో జీవితకాల గరిష్ఠ స్థాయిలను నమోదు చేశాయి. ఢిల్లీ స్పాట్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారట్స్) పసిడి ధర రూ.6,500 (4.24 శాతం) పెరిగి రూ.1,59,700 స్థాయికి చేరింది. కిలో వెండి ధర కూడా రూ.11,300 పెరిగి రూ.3,34,300కు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది.

అంతర్జాతీయ మార్కెట్లోనూ: అంతర్జాతీయ స్పాట్ మార్కెట్లోనూ పసిడి, వెండి ధరల ర్యాలీ కొనసాగుతోంది. బుధవారం ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం 4,888.46 డాలర్లకు (సుమారు రూ.4.48 లక్షలు) చేరి రికార్డు సృష్టించింది. ఔన్స్ వెండి ధర 95.89 డాలర్ల రికార్డు స్థాయికి చేరింది. తాజా అంతర్జాతీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో ఔన్స్ పసిడి ధర త్వరలోనే 5,000 డాలర్లకు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

కారణాలు: సురక్షిత పెట్టుబడుల పేరుతో కొనసాగుతున్న భారీ కొనుగోళ్లు, ఈటీఎఫ్‌ల కొనుగోళ్లు ఈ రెండు లోహాల ర్యాలీకి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సంస్థ కమోడిటీస్ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ చెప్పారు. రూపాయి పతనం, పెట్టుబడుల డిమాండ్‌తో ప్రస్తుత దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్ ధరలతో పోలిస్తే కొద్దిగా ప్రీమియంతో ట్రేడవుతున్నట్టు తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	500
వరంగల్	472	గోదావరి	475
చిత్తూరు	523	విశాఖపట్నం	475
		దజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	విజయవాడ	157
వరంగల్	156	గుంటూరు	164
కరీంనగర్	156	ఒంగోలు	164
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	150
కర్నూలు	156	నెల్లూరు	155
విశాఖపట్నం	145	అనంతపురం	155
గోదావరి	157		

వేదికలు మార్చేది లేదు.. భారత్‌లోనే ఆడాలి

24 గంటల్లోగా తేల్చండి.. లేదంటే స్కాట్లాండ్‌ను దింపుతాం

బంగ్లాదేశ్‌కు ఐసీసీ అల్టిమేటం » బీసీబీకి పాక్ మాత్రమే మద్దతు

దుబాయ్: భారత్‌లోనే టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లు ఆడాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి ఐసీసీ మరోసారి స్పష్టంజేసింది. బంగ్లాదేశ్ జట్టు ఆడే మ్యాచ్‌లను వేరే చోటుకు తరలించే ప్రసక్తేలేదని బీసీబీకి తేల్చి చెప్పింది. ఈ మేరకు బుధవారం రాత్రి జరిగిన ఐసీసీ బోర్డు సమావేశ నిర్ణయాన్ని బంగ్లాదేశ్‌కు తెలియజేసింది. తన నిర్ణయాన్ని మార్చుకొనేందుకు బీసీబీకి 24 గంటలు..అంటే గురువారం రాత్రి వరకు సమయమిచ్చింది. లేదంటే బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడిస్తామని అల్టిమేటమ్ జారీ చేసింది. ఇక..బంగ్లాదేశ్‌పై నిర్ణయంపై ఐసీసీ బోర్డు ఓటింగ్ నిర్వహించింది. బోర్డులోని మొత్తం 16 మందిలో 14 మంది సభ్యులు బంగ్లాదేశ్ నిర్ణయాన్ని వ్యతిరేకించినట్టు తెలిసింది. బంగ్లాదేశ్‌తోపాటు పాకిస్థాన్ మాత్రమే మద్దతుగా ఓటు వేసింది. కాగా.. భారత్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్ నిరాకరిస్తున్నందున ఆ జట్టు ఆడే మ్యాచ్‌లను తమ దేశంలో నిర్వహిస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అంతకుముందు ప్రకటించింది. 'బంగ్లాదేశ్ డిమాండ్ న్యాయమైనదే. ఒకవేళ బంగ్లాదేశ్ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలిస్తే వాటికి ఆతిథ్యమిచ్చేందుకు మేము సిద్ధం' అని పీసీబీ వర్గాలు వెల్లడించాయి. టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్‌లో బంగ్లాదేశ్ నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో మూడు కోల్‌కతాలో, ఒకటి ముంబైలో జరగాల్సి ఉంది.

స్టార్ల జోరు

ఆస్ట్రేలియన్ ఓపెన్

» మూడో రౌండ్‌కు అల్కారజ్, సబలెంక

» గాఫ్, ఆండ్రీవా, పొలినీ ముందుకు



పొలినీ

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్‌లో స్టార్ల జోరు కొనసాగుతోంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో టాప్ ర్యాంకర్లు సబలెంక, అల్కారజ్, మూడో సీడ్లు కొకొ గాఫ్, జ్వెరెవ్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేశారు. బుధవారం జరిగిన రెండో రౌండ్లో అల్కారజ్ 7-6(4), 6-3, 6-2తో యానిక్ హన్మాన్‌పై, గతేడాది రన్నరప్ జ్వెరెవ్ 6-3, 4-6, 6-3, 6-4తో ముల్లర్‌పై, 6వ సీడ్ అలెక్స్ డిమినార్ 6-7(7), 6-2, 6-2, 6-1తో హమాద్‌పై, 10వ సీడ్ బబ్లిక్ 7-5, 6-4, 7-5తో ఫుస్కోవిక్స్‌పై, 11వ సీడ్ మెద్వెదెవ్ 6-7(9), 6-3, 6-4, 6-2తో క్వెంటిన్‌పై గెలిచి మూడోరౌండ్లో ప్రవేశించారు. మహిళల సింగిల్స్‌లో రెండుసార్లు చాంపియన్ సబలెంక 6-3, 6-1తో జోగ్జువాన్‌పై, అమెరికా యువతార గాఫ్ 6-2, 6-2తో డానిలోవిచ్‌పై, 7వ సీడ్ జాస్మిన్ పొలినీ 6-2, 6-3తో మగ్దలీనాపై, 8వ సీడ్ మిర్రా ఆండ్రీవా 6-0, 6-4తో సక్కారిపై, 12వ సీడ్ స్విటోలినా 7-5, 6-1తో క్లిమోవికోవాపై అలవోకగా నెగ్గి మూడో రౌండ్ బెర్త్ ఖరారు చేసుకున్నారు. ఇక, అనస్తేసియా పొటపోవా 7-6(3), 6-2తో రదుకానును చిత్తు చేసి మూడో రౌండ్లో సబలెంకతో అమీతుమీకి సిద్ధమైంది. ఇక.. భారత ఆటగాడు యుకీ భాంబ్రీ డబుల్స్‌లో శుభారంభం చేశాడు. పురుషుల డబుల్స్‌లో ఆరంభ రౌండ్లో 10వ సీడ్ యుకీ/ఆండ్రీ గోరాన్సన్ (స్వీడన్) జోడీ 6-3, 6-4తో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ, స్వీడన్ జంట జేమ్స్ డక్‌వర్త్/క్రజ్ హెవిట్‌పై గెలిచింది.



'రికార్డు'స్థాయిలో హాజరు

మెల్‌బోర్న్ పార్క్‌లో స్టార్ల ఆటను వీక్షించేందుకు అభిమానులు పోటెత్తుతున్నారు. నాలుగో రోజు రికార్డుస్థాయిలో ప్రేక్షకులు స్టేడియాలకు హాజరయ్యారు. సబలెంక, అల్కారజ్, గాఫ్‌లాంటి స్టార్ల మ్యాచ్‌లు ఉండడంతో బుధవారం ఏకంగా 1,03,720 మంది ప్రత్యక్షంగా హాజరై పోటీల (డే, నైట్ సెషన్)ను వీక్షించారు. ఒకరోజు ఇంతమంది అభిమానులు స్టేడియానికి రావడం ఆస్ట్రేలియన్ ఓపెన్ చరిత్రలో ఇదే తొలిసారి. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ నాలుగు రోజుల్లోనే 4,04,000కు పైగా ప్రేక్షకులు మ్యాచ్‌లను ప్రత్యక్షంగా తిలకించారని టోర్నీ నిర్వాహకులు వెల్లడించారు.

అదిరే ఆరంభం

అభిషేక్ సునామీ ఇన్నింగ్స్

చెలరేగిన రింకూ సింగ్

తొలి టీ20లో కివీస్ చిత్తు

48 రన్స్‌తో భారత్ విజయం



అభిషేక్ శర్మ (35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 84)



రింకూ సింగ్ (44 నాటౌట్)

నాగ్‌పూర్: పొట్టి ఫార్మాట్‌లో తనకు తిరుగులేదని టీమిండియా నిరూపించింది. టీ20 వరల్డ్ కప్‌నకు సన్నాహకమైన న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఘనమైన బోణీ చేసింది. బుధవారం జరిగిన మొదటి టీ20లో 48 పరుగులతో విజయం సాధించింది. మొదట భారత్ 20 ఓవర్లలో 238/7 స్కోరు చేసింది. అభిషేక్ శర్మ (35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సలతో 84) సునామీ ఇన్నింగ్స్ ఆడగా, రింకూ సింగ్ (20 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 44 నాటౌట్) తనదైన శైలిలో చెలరేగాడు. సూర్యకుమార్ (22 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 32), హార్దిక్ (16 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 25) సత్తా చాటారు. డఫి, జేమిసన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో న్యూజిలాండ్ 20 ఓవర్లలో 190/7 స్కోరుకే పరిమితమై ఓడింది. గ్లెన్ ఫిలిప్స్ (40 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సలతో 78), చాప్‌మన్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలతో 39) రాణించారు. శివమ్ దూబే, వరుణ్ చెరో రెండు వికెట్లు తీశారు. అభిషేక్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఫిలిప్స్ మెరుపులు: భారీ ఛేదనలో హిట్టర్లు కాన్వే (0), రచిన్ (1) విఫలమయ్యారు. కానీ రాబిన్సన్, ఫిలిప్స్ ధాటిగా ఆడడంతో పవర్ ప్లేలో కివీస్ 50/2తో నిలిచింది. తన మొదటి ఓవర్లోనే రాబిన్సన్ (21)ను అవుట్ చేసిన వరుణ్ ప్రత్యర్థికి షాకిచ్చాడు. ఈ దశలో చాప్‌మన్ జతగా ఫిలిప్స్ భారత్ బౌలర్లను వణికించి జట్టును రేస్‌లో నిలిపాడు. ఫిలిప్స్‌ను పెవిలియన్ చేర్చిన అక్షర్ భారత్‌కు ఊరటనిచ్చాడు. చాప్‌మన్‌ను వరుణ్ బలిగొన్నాడు. తర్వాత మిచెల్ (28), కెప్టెన్ శాంట్నర్ (20 నాటౌట్) భాగస్వామ్యం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది.

అభిషేక్.. ఆకాశమే హద్దుగా..: టీ20 ప్రపంచ కప్‌నకు ముందు కీలకమైన సిరీస్‌లో తమకు అందివచ్చిన తొలి అవకాశాన్ని సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ సద్వినియోగం చేసుకోలేక పోయారు. అయితే అభిషేక్ ఎడాపెడా షాట్లతో బౌలర్లను బెంబేలెత్తించగా, ఆపై రింకూ తనదైన శైలిలో విజృంభించడంతో భారత్ భారీస్కోరు చేసింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్ చివరి బంతికి సిక్స్‌తో అభిషేక్ సునామీ ఇన్నింగ్స్‌కు తెరతీయగా జేమిసన్ వేసిన రెండో ఓవర్లో 4,4తో సంజూ బ్యాట్ ఝుళిపించాడు. కానీ ఇదే ఓవర్లో సంజూ (10)ను జేమిసన్ క్యాచవుట్ చేయగా, తదుపరి ఓవర్లో కిషన్ (8)ను డఫీ పెవిలియన్ చేర్చాడు. దాంతో 27/2తో భారత్ కష్టాల్లో పడింది. చాలాకాలంగా ఫామ్ లేమితో బాధపడుతున్న కెప్టెన్ సూర్య వచ్చీరావడంతో బౌండరీ కొట్టడంతోపాటు ఆపై క్లార్క్ ఓవర్లో మరో ఫోర్ కొట్టి ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. జేమిసన్ ఓవర్లో 2 సిక్సర్లు దంచిన అభిషేక్.. క్లార్క్ ఓవర్లో మరో 2 సిక్సర్లతో చెలరేగాడు. దాంతో పవర్‌ప్లేలో భారత్ 68/2తో నిలిచింది. ఫిలిప్స్ వేసిన ఏడో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో విరుచుకుపడిన అభిషేక్ ఆపై హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేశాడు. శాంట్నర్ ఓవర్లో అభిషేక్ చూడముచ్చటైన సిక్సర్‌తో 9వ ఓవర్లోనే టీమిండియా స్కోరు సెంచరీ దాటింది. సోధీ ఓవర్లో 4,4 సాధించిన సూర్య అదే జోరును కొనసాగించలేకపోయాడు. శాంట్నర్ ఓవర్‌లో భారీ షాట్ సంధించబోయి రాబిన్సన్‌కు దొరికిపోయాడు. ఫలితంగా 99 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సోధీ బౌలింగ్‌లో 4,6,6తో దుమ్మురేపిన అభిషేక్ మరో భారీషాట్ కొట్టే యత్నంలో నిష్క్రమించాడు. శివమ్ దూబే (9) నిరాశపర్చగా..ఉన్న కొద్దిసేపూ ధనాధన్ షాట్లతో అలరించిన హార్దిక్ పాండ్యా 16వ ఓవర్లో అవుటయ్యాడు. క్లార్క్ వేసిన 18వ ఓవర్లో రింకూ 6,4తో భారత్ స్కోరు 200 దాటగా..ఇదే ఓవర్లో అక్షర్ (5) నిష్క్రమించాడు. ఆఖరి ఓవర్లో రింకూ సింగ్ 6,6,4,4తో మురిపించడంతో 21 పరుగులు లభించాయి.

స్కోరుబోర్డు


భారత్: శాంసన్ (సి) రచిన్ (బి) జేమిసన్ 10, అభిషేక్ (సి) జేమిసన్ (బి) సోధీ 84, ఇషాన్ (సి) చాప్‌మన్ (బి) డఫీ 8, సూర్యకుమార్ (సి) రాబిన్సన్ (బి) శాంట్నర్ 32, హార్దిక్ (సి) చాప్‌మన్ (బి) డఫీ 25, శివమ్ దూబే (సి అండ్ బి) జేమిసన్ 9, రింకూ సింగ్ (నాటౌట్) 44, అక్షర్ (సి) మిచెల్ (బి) క్లార్క్ 5, అర్షదీప్ (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం 20 ఓవర్లలో 238/7; వికెట్లపతనం** : 1-18, 2-27, 3-126, 4-149, 5-166, 6-185, 7-209; **బౌలింగ్** : డఫీ 4-0-27-2, జేమిసన్ 4-0-54-2, క్రిస్టియన్ క్లార్క్ 4-0-40-1, సోధీ 3-0-38-1, గ్లెన్ ఫిలిప్స్ 1-0-20-0, శాంట్నర్ 3-0-37-1, మిచెల్ 1-0-21-0.

న్యూజిలాండ్: కాన్వే (సి) శాంసన్ (బి) అర్షదీప్ 0, రాబిన్సన్ (సి) దూబే (బి) వరుణ్ 21, రచిన్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 1, ఫిలిప్స్ (సి) దూబే (బి) అక్షర్ 78, చాప్‌మన్ (సి) అభిషేక్ (బి) వరుణ్ 39, మిచెల్ (సి-సబ్) బిష్ణోయ్ (బి) దూబే 28, శాంట్నర్ (నాటౌట్) 20, క్లార్క్ (సి) రింకూ (బి) దూబే 0, జేమిసన్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు:2; మొత్తం 20 ఓవర్లలో 190/7; వికెట్ల పతనం** : 1-0, 2-1, 3-52, 4-131, 5-143, 6-189, 7-189; **బౌలింగ్** : అర్షదీప్ 4-0-31-1, హార్దిక్ 2-0-20-1, బుమ్రా 3-0-29-0 అక్షర్ 3.3-0-42-1, వరుణ్ 4-0-37-2, శివమ్ దూబే 3-0-28-2, అభిషేక్ 0.3-0-3-0.

విరాట్ చేజారిన 'టాప్'

మిచెల్‌కు అగ్రస్థానం

వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో రెండు సెంచరీలతో సత్తా చాటిన న్యూజిలాండ్ స్టార్ డారిల్ మిచెల్ ర్యాంకింగ్స్‌లో టాప్‌లోకొచ్చాడు. బుధవారం ప్రకటించిన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో ఓ స్థానం ఎగబాకిన మిచెల్.. 845 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. కోహ్లీ (795) ఓ స్థానం కోల్పోయి రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. రోహిత్ శర్మ మూడో స్థానం చేజార్చుకొని నాలుగులో నిలిచాడు. అఫ్ఘాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ మూడో ర్యాంక్‌కు ఎగబాకగా.. గిల్ ఐదో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. కేఎల్ రాహుల్ ఓ స్థానం మెరుగై పదో ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్లలో అఫ్ఘాన్ స్టార్ రషీద్ ఖాన్ టాప్ ర్యాంక్‌ను పదిలం చేసుకోగా.. కుల్దీప్ యాదవ్ ఏడో ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్-10లో కొనసాగుతున్నాడు.

స్పోర్ట్స్

డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ X యూపీ (రా. 7.30)

ఐదో రౌండ్లో గుకేశ్ గెలుపు

వింక్ ఆన్ జీ (ది నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ చెస్‌లో బుధవారం జరిగిన ఐదో రౌండ్లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. గుకేశ్ గెలవగా.. ప్రజ్ఞానంద డ్రాతో సరిపెట్టుకున్నాడు. అర్జున్, అరవింద్ చిదంబరంలకు ఓటములు ఎదురయ్యాయి. వాన్ గుయెన్‌ను గుకేశ్ ఓడించగా.. అనీష్‌తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రాగా ముగించాడు. ఫెడోసివ్ చేతిలో అర్జున్, విన్సెంట్ చేతిలో అరవింద్ ఓడారు. ఐదో రౌండ్ తర్వాత నీమన్, నోదిర్బెక్ చెరో 3.5 పాయింట్లతో టాప్‌లో ఉండగా.. గుకేశ్ 3 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అర్జున్ 2.5, ప్రజ్ఞానంద, అరవింద్ చెరో 1.5 పాయింట్లతో ఉన్నారు.

ఇదో వింత అనుభవం: రోహిత్



ముంబై: కెరీర్‌లో తొలిసారి టీ20 వరల్డ్ కప్ ఆడలేకపోవడంపై టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఉద్వేగంగా స్పందించాడు. 'ఈసారి స్వదేశంలో జరగనున్న ప్రపంచ కప్ గురించి మేం ఇంట్లో మాట్లాడుకుంటున్నాం. ఈ మెగా టోర్నీని ప్రేక్షకుడిగా చూడాల్సిరావడం నాకో వింత అనుభూతి. ఇప్పటి వరకు ప్రతి వరల్డ్ కప్‌లోనూ భాగస్వామినయ్యా' అని ఓ క్రీడా చానెల్ కార్యక్రమంలో రోహిత్ అన్నాడు. కాగా రాబోయే ఈ వరల్డ్ కప్‌నకు రోహిత్ ఐసీసీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితుడైన సంగతి తెలిసిందే.

సింధు, శ్రీకాంత్ బోణీ

ఇండోనేసియా మాస్టర్స్

జకార్తా: తెలుగు షట్లర్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో సింధు 22-20, 21-18తో మనామి సూయిజు (జపాన్)పై, శ్రీకాంత్ 21-15, 21- 23, 24-22తో కోకి వతనాబే (జపాన్)పై, లక్ష్య 21-13, 16-21, 21-14తో వాంగ్ జు వీ (తైపీ)పై, అన్మోల్ 21-16, 21-17తో పై యు పో (తైపీ)పై గెలిచారు.

ఏడాదిన్నర తర్వాత బయటికొస్తా..!

» అప్పుడే పాదయాత్ర చేస్తా: జగన్

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రపై మరోసారి నాలుక మడతేశారు. ఈ ఏడాది జనవరి నుంచి జిల్లాల్లో పర్యటిస్తానని.. పాదయాత్ర చేపడతానని గతంలో పార్టీ కార్యనిర్వాహక సమావేశంలో ఆయన ప్రకటించారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఆయన బస్సుయాత్ర చేపడతారని వైసీపీ సోషల్ మీడియా విస్తృత ప్రచారం కూడా చేసింది. అయితే వీటన్నిటికీ జగన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. ఏడాదిన్నర తర్వాత తాను బయటకు వస్తానని.. అప్పుడే పాదయాత్ర ఉంటుందని ఏలూరు వైసీపీ నేతల సమావేశంలో ఆయన వెల్లడించారు. 'మాస్తుండగానే రెండేళ్లు గడుస్తున్నాయి. వచ్చే నెల చివరిలో లేదా మార్చి మొదట్లో ఈ ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశపెడుతుంది. అంటే ఈ ప్రభుత్వానికి ఇంకా మిగిలింది మూడేళ్లే మాత్రమే. అందులో ఏడాదిన్నర తర్వాత నా పాదయాత్ర మొదలు పెడతాను. దాదాపు ఏడాదిన్నర పాటు ప్రజల్లోనే, ప్రజలతోనే ఉంటాను' అని తెలిపారు. గతంలో ప్రతి నియోజకవర్గంలో వారి సమావేశాలు నిర్వహించానని.. ఇప్పుడు మళ్లీ వాటిని ఏలూరుతోనే ప్రారంభించానన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లోనూ విఫలమైందని ఆరోపించారు. ప్రజలు ఇప్పుడు తనను కోరుకుంటున్నారని ప్రకటించుకున్నారు. 2024లో ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచే జనంలోకి వెళ్తానని.. పాదయాత్ర చేస్తానంటూ క్యాడర్‌కు ఆయన చెబుతూ వచ్చారు. కానీ రెండేళ్లు గడుస్తున్నా పాదయాత్ర ఎప్పుడో స్పష్టత ఇవ్వలేదు. ఈ సంక్రాంతి తర్వాత జిల్లా పర్యటనలకు వెళ్తానని కూడా విస్తృత స్థాయి సమావేశంలో ప్రకటించారు. ఈ నెల 26 నుంచి తమ నేత బస్సు యాత్ర చేయబోతున్నారని వైసీపీ సోషల్ మీడియాలో ఊదరగొట్టారు. ఏమైందో ఏమో.. ఆయన ఏడాదిన్నర తర్వాత బయటకు వచ్చి పాదయాత్ర చేస్తానని ఇప్పుడు చెప్పారు. ఇదెంతవరకు కార్యరూపం దాలుస్తుందో చూడాలని వైసీపీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు.

మళ్లీ పాదయాత్ర చేస్తే రాష్ట్రం ఏమైపోతుందో?

» అధికారంలోకొస్తే సీఎం సీటునూ ప్రైవేటైజ్ చేస్తారేమో?: కొలుసు

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ ఒకసారి పాదయాత్ర చేస్తేనే రాష్ట్రానికి ఎంత నష్టం జరిగిందో అంచనా వేయలేకపోయాం. మరోసారి పాదయాత్ర చేస్తే ఈ రాష్ట్రం ఏమైపోతుందో?' అని మంత్రి కొలుసు పార్థసారథి వ్యాఖ్యానించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరైనా పాదయాత్రలు చేయచ్చు. పాదయాత్రతో ప్రజలను ఒకసారి మోసం చేయొచ్చు. మళ్లీమళ్లీ మోసం చేయలేరు. ప్రైవేటీకరణకు, పీపీపీకి తేడా తెలియని జగన్.. అధికారంలోకి వస్తే సీఎం సీటునూ ప్రైవేటైజ్ చేస్తారేమో? పల్నాడులోని పిన్నెల్లి గ్రామంలో వైసీపీ కార్యకర్త సాల్మన్‌కు, పేతురు అనే వ్యక్తికి మధ్య జరిగిన గొడవతో సాల్మన్ చనిపోతే... దానికి రాజకీయ రంగు పూసి, ప్రభుత్వంపై జగన్ బురదజల్లుతున్నారు. వైసీపీ పాలనలో పల్నాడులోనే 8 హత్యలు, 73 దాడులు జరిగాయి. జగన్ కారు కింద వాళ్ల కార్యకర్తే పడి చనిపోతే కనీసం పట్టించుకోలేదు' అని మంత్రి పార్థసారథి మండిపడ్డారు.

జగన్ పాలనలో 10 వేల కోట్ల నిధులు పక్కదారి

» 40 వేల కోట్ల విలువైన పథకాలు నిలిచిపోయాయి: లంకా దినకర్

న్యూఢిల్లీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రంలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకుండా నిధులను పక్కదోవ పట్టించారని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ ఆరోపించారు. బుధవారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జగన్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వక పోవడం వలన దాదాపు రూ.40 వేల కోట్లు విలువైన పథకాలు అమలు కాలేదు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన దాదాపు రూ.10 వేల కోట్లను పక్కదోవ పట్టించారు. వైసీపీ పాలనలో ఏపీలో పెట్టుబడుల ఉపసంహరణలు జరిగాయి. నకిలీ మద్యం వ్యాపారంలో పెట్టుబడులు మాత్రం పెరిగాయి. ఏపీకి కేంద్రం 30 లక్షల గృహాలను కేటాయిస్తే కనీసం 5 లక్షల గృహాలను కూడా జగన్ పూర్తి చేయలేదు. ప్రస్తుతం ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ చొరవతో దేశంలోనే అత్యధికంగా మహిళా లక్షాధికారులుగా 17.50 లక్షలకు పైగా స్త్రీలు ఎదిగారు. మరో 30 లక్షల మంది త్వరలో లక్షాధికారులుగా మారుతున్నారు' అని దినకర్ తెలిపారు.

ప్రజల సహకారంతోనే ఎన్టీఆర్ విగ్రహం

» స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తున్నారు: మంత్రి సవిత

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఎన్టీఆర్ చరిత్ర నిలిచే ఉంటుంది. అలాంటి ఎన్టీఆర్ విగ్రహాన్ని నిర్మించడానికి ప్రజాధనాన్ని దుర్వినియోగపర్చడం లేదు' అని మంత్రి సవిత స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'ఎన్టీఆర్ విగ్రహానికి ప్రజాధనాన్ని దుర్వినియోపరుస్తున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. ఎన్టీఆర్ అభిమానులు చాలా మంది స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి ట్రస్ట్ ద్వారా విగ్రహం ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారు. ప్రజల సహకారంతో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఫేక్ సోషల్ మీడియా ఖాతాల ద్వారా కులమత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోంది' అని మంత్రి సవిత స్పష్టం చేశారు.

పెట్టుబడులు తేవడమంటే కోడిగుడ్డు కథలు చెప్పడం కాదు: రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం అంటే కోడి గుడ్డు కథలు చెప్పడం కాదు. రాష్ట్రాభివృద్ధికి దోహదపడేలా పారిశ్రామికవేత్తలను ఒప్పించి పరిశ్రమలను తేవడం' అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గతంలో దావోస్ పర్యటనకు ఎందుకు వెళ్లలేదని అప్పటి పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్‌ను ప్రశ్నిస్తే... అక్కడ చలి ఎక్కువగా ఉంటుందని, దానివల్లే వెళ్లలేదని సమాధానం ఇచ్చారు. జగన్ ట్రాక్ రికార్డు ఏమిటో ప్రజలందరికీ తెలుసు' అని శ్రీనివాసరెడ్డి అన్నారు.

ప్రజారోగ్యంతో జగన్ చెలగాటం

» అధికారంలో ఉండగా భ్రష్టు పట్టించారు: మంత్రి సత్యకుమార్

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా వైసీపీ అధినేత జగన్.. ప్రజారోగ్యంతో చెలగాటమాడారని, ఇప్పుడు మాత్రం మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు అన్ని వ్యవస్థలతోనూ ఆడుకుని, ప్రజల ప్రాణాల్ని పణంగా పెట్టారని ధ్వజమెత్తారు. చెప్పిన అబద్ధాన్నే మళ్లీ మళ్లీ చెప్పడం జగన్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. గంటల తరబడి మీడియాతో మాట్లాడుతూ.. ఆత్మస్తుతి పరనిందలతో కాలం గడుపుతున్నారని, ఐదేళ్లు రాష్ట్రాన్ని అందినకాడికి దోచుకుని, ఇప్పుడు నీతులు చెబితే ప్రజలు నమ్ముతారా? అని నిలదీశారు. రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది శిశువుల్లో 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారని, గతంతో పోల్చితే మరణాల సంఖ్యను తగ్గించామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ మరణాలను కూడా నివారించేందుకు ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జాతీయ స్థాయిలో ప్రతి వెయ్యి మంది శిశువుల్లో 25 మంది ప్రాణాలు కోల్పోతున్నారని వెల్లడించారు. ఆసుపత్రుల్లో గర్భిణులకు, నవజాత శిశులకు అందుతున్న వైద్యం, ప్రసవ సమయంలో అనుసరిస్తున్న విధానాల్లోని లోపాలను గుర్తిస్తున్నామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ అవయవ మార్పిడి కేంద్రాలు తొమ్మిదేనా..!

» వివరాలతో అఫిడవిట్ వేయండి: ఆరోగ్య శాఖకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేవలం తొమ్మిది ప్రభుత్వ ఆసుపత్రులు మాత్రమే అవయమార్పిడి కేంద్రాలు(ఓటీసీ)గా నమోదు కావడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. మౌలిక సదుపాయాలు, నిపుణులైన డాక్టర్లు ఉండి కూడా మరిన్ని ప్రభుత్వ ఆసుపత్రులు ఓటీసీలుగా మారేందుకు ముందుకు రాకపోవడానికి ఎలాంటి కారణాలు కనపడడం లేదని పేర్కొంది. ఆర్గాన్ హార్వెస్టింగ్ సెంటర్లను(ఓహెచ్‌సీ)లను ఓటీసీలుగా మార్చే ప్రతిపాదన ఉందని ఆరోగ్యశాఖ చెబుతున్నప్పటికీ అది ఏ దశలో ఉందో స్పష్టత లేదని తెలిపింది. తొమ్మిది మాత్రమే గుర్తింపు పొందడానికి గల కారణాలు, ఓటీసీలుగా ప్రకటించేందుకు అవకాశం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల వివరాలతో సవివరంగా అఫిడవిట్ దాఖలు చేయాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

వేగంగా ఉపాధి పనులు!

» మార్చి నెలాఖరులోగా మొత్తం పూర్తవ్వాలి
» ఇప్పటికే 720 కి.మీ. సిమెంట్ రోడ్ల నిర్మాణం
» రూ.1,000 కోట్ల బిల్లులు అప్‌లోడ్
» మరో రూ.2వేల కోట్ల పనులు పూర్తికి కసరత్తు
» మినీ గోకులాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ పనులన్నీ మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో జీరామ్‌జీ పథకం వచ్చిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఇటీవల అన్ని జిల్లాల డ్వామా పీడీలు, పంచాయతీరాజ్ ఎస్ఈలతో ఆ శాఖ కమిషనర్ కృష్ణతేజ సమావేశం నిర్వహించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ ద్వారా రాష్ట్రంలో 18 కోట్ల పని దినాలు కల్పించినందున సుమారు దాదాపు రూ.9వేల కోట్ల మెటీరియల్ నిధులు ఖర్చు చేసే వెసులుబాటు లభించింది. ఇప్పటి వరకూ 720 కి.మీ. మేర సిమెంట్ రోడ్లు, 390 కి.మీ. మేర బీటీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీనికి సంబంధించి సుమారు రూ.1,000 కోట్ల మేర బిల్లులు అప్‌లోడ్ చేశారు. మార్చి 31లోగా మిగిలిన రూ.2వేల కోట్ల పనులు పూర్తి చేయకపోతే మెటీరియల్ నిధులన్నీ నిర్వీర్యమైపోతాయి. దీంతో ఈ పనులను వేగంగా పూర్తి చేసేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రంలో 25 వేల మినీ గోకులాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామీణ పేదలకు 90 శాతం సబ్సిడీతో రూ.2 లక్షల విలువైన ఆవాసాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. జిల్లాల్లో కలెక్టర్లు ఈ ఏడాది సుమారు 34వేల మినీ గోకులాలను మంజూరు చేశారు. వీటిలో 22 వేల మినీ గోకులాల పనులు ప్రారంభించి 13వేలు పూర్తి చేశారు. వీలైనన్ని ఎక్కువ మినీ గోకులాలను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. చేసిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాలని, గ్రామీణులు బిల్లుల చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా 4 లక్షలకు పైగా వ్యక్తిగత కంపోస్టు పిట్లు, లక్ష వ్యక్తిగత సోక్ పిట్లను పూర్తి చేశారు.

బిల్లులు అప్‌లోడ్ చేయండి

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు ఉపాధి పథకంలో చేపట్టిన పనులన్నింటికీ బిల్లులు అప్‌లోడ్ చేయాలని, గ్రామీణులకు పని కల్పించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను గ్రామీణాభివృద్ధి శాఖ సూచించింది. డివిజన్ స్థాయిలో శుక్ర, శని వారాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని సమీక్షించాలని తెలిపింది. మినీ గోకులాలు, ఫాం పాండ్స్, కంపోస్టు పిట్స్, సోక్ పిట్స్ అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. రైతులకు మంజూరు చేసిన ఉద్యాన పంటలకు సంబంధించి బిల్లులు, ప్లాంటేషన్ బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆ శాఖ ఆదేశించింది. వీలైనంత వరకు ఫిబ్రవరి మొదటి వారంలో మెటీరియల్ పనుల బిల్లులు అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించింది. పనుల పురోగతిపై డ్వామా పీడీలతో కమిషనరేట్ అధికారులు నిరంతరం సమీక్షించనున్నారు.

ఆలయాల్లో ఈ–ఆఫీస్ సేవలు

» దర్శనం, సేవల టికెట్లు ఆన్‌లైన్‌లోనే
» భవన నిర్మాణాలు ఏడాదిలో పూర్తిచేయాలి
» ఆలయ ఉద్యోగులందరికీ వెంటనే పదోన్నతులు
» ఉత్తర్వుల్లో 50% తెలుగులోనే ఉండాలి
» ఈవోలకు దేవదాయ కమిషనర్ ఆదేశాలు

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల దర్శన, సేవల టికెట్ల లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే జరగాలని దేవదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ఆదేశించారు. శాఖలో విధులు నిర్వహించే ఈవోలు, ఏసీలు, డీఈవో (జిల్లా ఎండోమెంట్ అధికారి) ఈ ఏడాదిలో ఏ పనులపై దృష్టిపెట్టాలో నిర్దేశిస్తూ బుధవారం ఒక సర్క్యులర్ జారీ చేశారు. 6(బీ), 6(బీ) ఆలయాల్లో వంద శాతం ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆలయానికి సంబంధించిన లీజులు కనీసం 30శాతం వసూలు చేయాలన్నారు. ఆలయాల్లో అందించే సేవలపై భక్తుల్లో సంతృప్తి స్థాయి 80శాతం పైన ఉండాలని పేర్కొన్నారు. సీజీఎఫ్ కింద చేపట్టిన నిర్మాణాలను ఈ ఏడాది చివరి నాటికి 50 శాతానికి పైగా పూర్తి చేయాలని, ఆలయ నిధులతో (రూ.5 కోట్ల కంటే తక్కువ ఖర్చు) నిర్మాణం చేపట్టిన భవనాలను ఈ ఏడాది కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిర్మించే 5వేల ఆలయాలను నిర్మాణం ప్రారంభించిన తేదీ నుంచి ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయాల్లో ఉద్యోగులందరికీ వెంటనే పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. ఆలయాలు జారీచేసే ఉత్తర్వుల్లో కనీసం 50శాతం తెలుగులోనే ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాలతో పాటు 6(ఏ) ఆలయాల్లో పరిపాలన మొత్తం ఈ-ఆఫీస్‌లోనే నిర్వహించాలని సూచించారు. దేవదాయ శాఖకు చెందిన భూములు, ఆస్తుల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, లీజులు, అద్దెలను మార్కెట్ విలువకు అనుగుణంగా క్రమం తప్పకుండా వసూలు చేయాలని కమిషనర్ నిర్దేశించారు.



క్యూలైన్లకు అనుకొని హుండీలు

భక్తుల సౌకర్యార్థం ప్రముఖ ఆలయాల్లో క్యూలైన్లకు అనుకొని స్టెయిన్‌లెస్ స్టీల్ హుండీలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ బుధవారం మరో సర్క్యులర్ జారీ చేశారు. భక్తులు క్యూలైన్లలో నెమ్మదిగా వెళ్లడాన్ని నివారించేందుకు ఆలయాల్లో అవకాశం ఉన్నచోట వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు కానులు, ముడుపులు ప్రధాన హుండీలో వేసే క్రమంలో చాలావరకూ క్యూలైన్లు నెమ్మదిగా కదులుతున్నాయని తెలిపారు. అలాగే క్యూలైన్లు కనీసం రెండున్నర నుంచి మూడు అడుగుల వెడల్పు, నాలుగు నుంచి ఆరడుగుల ఎత్తు ఉండాలని పేర్కొన్నారు. హుండీల కొనుగోలు, క్యూలైన్ల ఏర్పాట్లకు టెండర్లు పిలవడంపై కమిషనర్ ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల చేశారు.



గవర్నర్లు, సీఎంలు సయోధ్యతో పనిచేయాలి

» మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల గవర్నర్లు, సీఎంలు సయోధ్యతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం ఆయన రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. అనంతరం కార్యకర్తలతోనూ సమావేశమయ్యారు. గవర్నర్లకు కొన్ని రాజ్యాంగబద్ధమైన విధులు ఉంటాయని, వాటికి అడ్డంకులు కలిగించకూడదని అన్నారు. దేశం అఖండంగా ఉండాలని, కొన్ని శక్తులు దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని కుట్రలు చేస్తున్నాయని.. వాటిని తిప్పికొట్టాలని తెలిపారు. పేదరిక నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, తాను కేంద్ర మంత్రిగా ఉండగా రాజమండ్రికి 4 వేల ఇళ్లు మంజూరు చేశానని గుర్తుచేశారు. రాజమండ్రితోను, ఇక్కడి నాయకులతోనూ తనకు మంచి సంబంధాలున్నాయన్నారు. జాతీయభావాన్ని గ్రామగ్రామానికీ తీసుకెళ్లాలని కోరారు. ఆయన వెంట ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు ఉన్నారు.



డయాఫ్రం వాల్ వేగంగా కట్టారు

» డీఎస్ఎం అవసరం లేదు: విదేశీ నిపుణులు




గ్యాప్-1 ప్రాంతంలో తవ్వకాలు చేయిస్తున్న నిపుణుల బృందం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అతిముఖ్యమైన డయాఫ్రం వాల్‌ను ఇంత వేగంగా నాణ్యతతో ఎలా కట్టగలిగారని విదేశీ నిపుణులు ఆరా తీశారు. పోలవరం కాంట్రాక్టు సంస్థను, జల వనరులశాఖ అధికారులను అంతర్జాతీయ నిపుణుల కమిటీ ప్రశ్నించింది. మంగళవారం డయాఫ్రమ్‌వాల్ చెరివైపులా డీప్ సోయిల్ మిక్సింగ్ (డీఎస్ఎం) చేయాలని పట్టుబట్టిన పీవోఈ సభ్యుడు.. బుధవారం సాంకేతికంగా కొద్దిపాటి సలహాలను ఇచ్చారు. డీఎస్ఎం అవరసరం లేదని తేల్చి చెప్పారు. దీంతో.. జల వనరులశాఖ అధికారులు, డిజైన్‌లను రూపొందిస్తున్న 'ఆఫ్రీ' సంస్థ ఊపిరి పీల్చుకున్నాయి. ప్రాజెక్టు ప్రాంతంలో డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి.సిక్కో (అమెరికా), సీన్ హించ్‌బెర్జర్ (కెనడా) మూడోరోజు బుధవారం కూడా పర్యటించారు. ప్రధానంగా డయాఫ్రం వాల్, గ్యాప్-1, గ్యాప్-2 పనులను, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కొన్నిచోట్ల శాంపిళ్లు కూడా తీసుకున్నారు. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యాం రోలింగ్ విషయంలో ప్రస్తుతం జలవనరుల శాఖ అధికారులు వినియోగిస్తున్న ఫ్లాట్ ఫుట్, వైబ్రేటెడ్ ఫుట్ రోలింగ్ పద్ధతులు ఆమోదయోగ్యమేనని నిపుణులు పేర్కొన్నారు. ప్లాస్టిక్ క్లే కోర్ ప్రాంతాల్లో మాత్రం షీఫ్ ఫుట్ రోలర్లు వినియోగించాలని సూచించారు. అనంతరం క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ల్లో నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారనే అంశాలను స్వయంగా పరిశీలించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనుల్లో వేగం, నాణ్యతా ప్రమాణాలపై నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఈ పనుల డాక్యుమెంటేషన్‌లో వరుస క్రమాన్ని పాటించలేదని అభిప్రాయపడ్డారు. బుధవారంతో ప్రాజెక్టు ప్రాంతంలో వారి పర్యటన ముగిసింది. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో కేంద్ర జల సంఘం చీఫ్ ఇంజనీర్ భక్షి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చీఫ్ ఇంజనీర్ ఎం.రమేశ్‌కుమార్ అధ్యక్షతన సమావేశమై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. గురువారం బొమ్మూరులో పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌తో వారు సమావేశమై.. అనంతరం ఢిల్లీ వెళ్తారు. శుక్రవారం పీపీఏ సీఈవో యోగేశ్ పైథాంకర్, కేంద్ర జలసంఘం చైర్మన్‌తో భేటీ అవుతారు. అనంతరం తమ నివేదికను జలసంఘానికి పంపుతారు. పర్యటనలో వారి వెంట కేంద్ర జలసంఘం అధికారులు పాల్గొన్నారు.

పన్నుల ఆదాయం పెంచాలి!

» వాణిజ్య పన్నుల అధికారులతో పయ్యావుల



అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వ్యాపారులతో స్నేహభావంతో వ్యవహరిస్తూ ప్రభుత్వ పన్నుల ఆదాయాన్ని పెంచడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులను కోరారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని ఆ శాఖ రాష్ట్ర కార్యాలయంలో రేంజ్ ఆఫీసర్లు, జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాలన సజావుగా సాగేందుకు వచ్చే మూడు నెలల్లో అవసరమైన నిధుల సమీకరణలో వాణిజ్య పన్నులశాఖ పాత్ర కీలకమని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో పన్ను వసూళ్ల వృద్ధి రేటు మరింత మెరుగుపడాల్సి ఉందని గణాంకాలతో వివరించారు. డివిజన్లు, సర్కిళ్ల వారీగా నిర్దేశిత పన్ను వసూళ్ల లక్ష్యాలను డిసెంబరునాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సంస్కరణల పేరు చెప్పి అధికారులు బాధ్యతల నుంచి రిలాక్స్ కావద్దని.. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా గమనిస్తున్నారని హెచ్చరించారు. ఈ త్రైమాసికంలో ఉత్తమ ఫలితాలు సాధించి పాత రికార్డులను తిరగరాయాలన్నారు. ఎక్సైజ్ శాఖ పనితీరును స్ఫూర్తిగా తీసుకుని వాణిజ్య పన్నుల శాఖ కూడా పన్ను పరిధి (ట్యాక్స్ బేస్)ని పెంచి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ఆటో అప్రూవల్ (14ఎ) సౌకర్యాన్ని తప్పుడు మార్గాల్లో ఉపయోగిస్తున్నవారిని నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రస్తుతం 90 శాతం జరుగుతున్న రిటర్న్ ఫైలింగ్‌ను 100 శాతానికి తీసుకెళ్లాలన్నారు. ఆడిట్ కేసులకు నిర్దేశిత గడువు లోగా పరిష్కారం చూపాలని, క్షేత్ర స్థాయి పన్ను ఎగవేతను అరికట్టాలని కోరారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో 29 శాతానికి పైగా రెవెన్యూ వృద్ధి సాధించడమే లక్ష్యమని చెప్పారు. వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ అహ్మద్ బాబు మాట్లాడుతూ.. మార్చి నాటికి ఆదాయ వృద్ధిని 10శాతానికి తీసుకెళ్లాలన్నారు.

రెగ్యులర్ బెయిల్ కోసం.. ట్రయల్ కోర్టుకే వెళ్లండి!

(మొదటి పేజీ తరువాయి)

తేల్చిచెప్పింది. నిందితుల డీఫాల్ట్ బెయిల్‌ను రద్దు చేస్తూ గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. అయితే అరెస్టు నుంచి వారికి కల్పించిన మధ్యంతర రక్షణను పొడిగించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. తమకు మంజూరైన డీఫాల్ట్ బెయిల్‌ను హైకోర్టు గతేడాది నవంబరు 19న రద్దుచేయడాన్ని సవాల్ చేస్తూ ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప సుప్రీంకోర్టును ఆశ్రయించారు. త్రిసభ్య ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. రాష్ట్రప్రభుత్వం తరపున ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా, నిందితుల తరపున సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. వారి పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే ట్రయల్ కోర్టును ఆశ్రయించి రెగ్యులర్ బెయిల్ పిటిషన్ వేసుకోవచ్చని వారికి సూచించింది. ట్రయల్ కోర్టు విచారణ జరిపేవరకు మధ్యంతర రక్షణ కొనసాగుతుందని.. ఒకవేళ బెయిల్ రాకపోతే తిరిగి హైకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా నిందితులకు రెండు వారాల పాటు మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నకిలీ మద్యం కేసులో బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

విజయవాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో బుధవారం వాదనలు ముగిశాయి. ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు(ఏ1), అద్దేపల్లి జగన్మోహనరావు(ఏ2), బాలాజీ(ఏ3), తలారి రంగయ్య(ఏ14) బెయిల్ పిటిషన్లపై తీర్పును కోర్టు 29కి వాయిదా వేసింది. సయ్యద్ హాజి(ఏ5), కట్టా రాజు(ఏ6), మిథున్‌దాస్(ఏ9), అంతాదాస్(ఏ10), షేక్ అల్లాభక్షు(ఏ16) బెయిల్ పిటిషన్లపై తీర్పు 28కి వాయిదా పడింది.

మిథున్‌రెడ్డి పిటిషన్‌పై నేడు తీర్పు

మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును విజయవాడ ఏసీబీ కోర్టు గురువారానికి రిజర్వు చేసింది. బెయిల్ షరతుల ప్రకారం ప్రతి శుక్రవారం తాను సిట్ ముందు హాజరవ్వాల్సి ఉందని.. అయితే 23న గానీ, 26న గానీ హాజరు కాలేనని, అనుమతి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ ముగియడంతో న్యాయస్థానం తీర్పును గురువారానికి వాయిదా వేసింది.

28న పిన్నెల్లి గ్రామానికి ఎస్సీ కమిషన్: జవహర్

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో జరిగిన ఘటనపై వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు 28న ఎస్సీ కమిషన్ సభ్యులు పిన్నెల్లి గ్రామంలో పర్యటిస్తారని కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఇద్దరు దళితుల మధ్య జరిగిన వ్యక్తిగత వివాదంలో మంద సాల్మన్ మృతి చెందడం విచారకరం. ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఘటనను కొన్ని పార్టీలు రాజకీయ హత్యగా చిత్రీకరించడం దారుణం. ఇలాంటి ఘటనలపై ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అందుకే పిన్నెల్లి గ్రామానికి ఎస్సీ కమిషన్ సభ్యులు వెళ్లాలని నిర్ణయించాం' అని జవహర్ తెలిపారు.



వసంత రాయులు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

అండగా ఉండి ఆదుకుంటాం

పార్టీ క్రియాశీల సభ్యుడి కుటుంబానికి పవన్ భరోసా

కృత్తివెన్ను, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన జనసేన క్రియాశీలక సభ్యుడు చందు వీరవెంకట వసంత రాయులు (53) కుటుంబానికి అండగా ఉండి, అన్నివిధాల ఆదుకుంటామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. బుధవారం కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం పెదచందాల గ్రామంలో ఆయన పర్యటించారు. తొలుత, గతేడాది ఆగస్టు 3న రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వసంత రాయులు ఇంటికి వెళ్లి, ఆయన ఫొటో వద్ద నివాళులు అర్పించి, ఆయన భార్య నాగ పుష్పవతి, కుమారుడు సీతారామరాజు, కుమార్తె జాహ్నవిలను ఓదార్చారు. ప్రమాదంలో వసంత రాయులుకు బ్రెయిన్ డెడ్ అయినపుడు అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను అభినందించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ తరఫున క్రియాశీల సభ్యునికి ఇచ్చే రూ. 5 లక్షల బీమా చెక్కును పవన్ ఆ కుటుంబ సభ్యులకు అందించారు. కుమారుడు సీతారామరాజుకు ఉద్యోగ అవకాశం కల్పించి, కుటుంబానికి అండగా ఉండాలని కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లకు సూచించారు. కుమార్తె జాహ్నవికి వినికిడి లోపంతో పాటు మాటలు రావని తెలుసుకొని టీటీడీ శ్రవణం ప్రాజెక్టు నుంచి వైద్య సహాయం అందించాలని అధికారులకు సూచించారు. తర్వాత పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. అవయవదానం ఆదర్శనీయమన్నారు. ఆ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. పెడన నియోజకవర్గంలో కొన్ని సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తన దృష్టికి తెచ్చారని, వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. తనకు ఘనంగా స్వాగతం పలికిన వారందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పాల్గొన్నారు.

నేడు కోటప్పకొండకు పవన్‌కల్యాణ్

నరసరావుపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారంపల్నాడు జిల్లా కోటప్పకొండకు రానున్నారు. త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని పూజల అనంతరం కోటప్పకొండ-కొత్తపాలెం రహదారిని ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పవన్ పర్యటన ఏర్పాట్లను జేసీ సంజనాసింహా, ఎస్పీ బి.కృష్ణారావు, గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శి సయ్యద్ జిలాని, చిలకలూరిపేట సమన్వయకర్త తోట రాజరమేశ్ బుధవారం పరిశీలించారు.

అంతరిక్షానికి బై బై

» వ్యోమగామి సునీతా విలియమ్స్ రిటైర్మెంట్



న్యూఢిల్లీ, జనవరి 21: భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ తన 27 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికారు. 608 రోజులపాటు అంతరిక్షంలోనే గడిపి, తొమ్మిది సార్లు స్పేస్‌వాక్ చేసిన 60 ఏళ్ల సునీతా విలియమ్స్ నాసా నుంచి రిటైరైనట్టు ప్రకటించారు. గత ఏడాది డిసెంబరు 27 నుంచే ఆమె రిటైర్మెంట్ అమల్లోకి వచ్చిందని నాసా వెల్లడించింది. 1998లో నాసాలో చేరిన సునీత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) మిషన్లలో కీలక పాత్ర పోషించారు. తన సుదీర్ఘ కెరీర్‌లో మూడు సార్లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లొచ్చారు. నాసా చరిత్రలో అత్యంత విజయవంతమైన వ్యోమగాముల్లో ఒకరిగా పలు రికార్డులు నెలకొల్పారు.

కిల్ స్విచ్, బీమా!

» డిజిటల్ అరెస్టుల కట్టడికి కేంద్ర 'హోం' కమిటీ సూచన

ముంబై/న్యూఢిల్లీ, జనవరి 21: దేశంలో డిజిటల్ అరెస్టులు, ఆర్థిక మోసాలను కిల్ స్విచ్, బీమాలతో కట్టడి చేయాలని కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ సూచించింది. ఈ రెండు అంశాలపై కమిటీ ప్రధానంగా దృష్టి సారించింది. అదేవిధంగా మోసపూరిత లావాదేవీలను గుర్తించడం, వాటి ద్వారా మ్యూల్ ఖాతాలకు సొమ్ము బదిలీ కాకుండా నిలుపుదల చేయడం వంటి అంశాలపైనా ఈ కమిటీ దృష్టి సారించింది. డిజిటల్ అరెస్టులకు గురయ్యామని గుర్తించిన వెంటనే బాధితులు 'కిల్ స్విచ్'ను వినియోగించి వివిధ ఆర్థిక సంస్థలు, బ్యాంకుల్లో ఉన్న తమ అకౌంట్లను నిలుపుదల చేయొచ్చు. తద్వారా వారి అకౌంట్లకు సంబంధించిన అన్ని లావాదేవీలు నిలిచిపోతాయి. అన్ని యూపీఐ, బ్యాంక్ యాప్స్‌లో కిల్ స్విచ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే డిజిటల్ మోసాల కారణంగా బాధితుల సొమ్ము అపహరణకు గురైనప్పటికీ బీమా చేయించండం ద్వారా ఆ సొమ్మును తిరిగి పొందే అవకాశం ఉంటుంది. వాణిజ్య సహా అన్ని బ్యాంకుల్లోనూ ఈ బీమాను తీసుకురావాలని ఉన్నతస్థాయి కమిటీ ప్రతిపాదించింది.

కర్ణాటకలోనూ.. గవర్నర్ వర్సెస్ ప్రభుత్వం

» నేటి అసెంబ్లీ సమావేశాలకు రానన్న గెహ్లాట్

» ప్రసంగ పాఠంలో 11 పేరాలు తొలగించాలని షరతు

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కేరళ తరహాలో కర్ణాటకలోనూ గవర్నర్, రాష్ట్రప్రభుత్వం మధ్య వివాదం తలెత్తింది. గురువారం అసెంబ్లీ ఉభయసభలనుద్దేశించి తాను చేయాల్సిన ప్రసంగంలోని 11 పేరాలను తొలగిస్తేనే ప్రత్యేక సమావేశాలకు వచ్చి ప్రసంగిస్తానని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ షరతు విధించారు. ఇందుకు సీఎం సిద్దరామయ్య ససేమిరా అన్నారు. గెహ్లాట్ సభకు రాకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు. కేంద్రం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును, విధానాలను మార్చడం.. దీనిపై కాంగ్రెస్ దేశవ్యాప్త ఆందోళన చేపట్టడం తెలిసిందే. ఉపాధి పథకాన్ని 'వీబీజీరామ్‌జీ'గా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. సభలో దీనిపై చర్చించి, ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాల్సిందిగా తీర్మానించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయనకు సమాచారం ఇచ్చారు. చదవాల్సిన ప్రసంగ పాఠాన్ని ముందుగానే పంపించారు. అయితే తాను అసెంబ్లీకి రావడం లేదంటూ బుధవారం సాయంత్రం ఆయన నేరుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు.

గణతంత్ర వేడుకలే లక్ష్యం..

'26-26' ఉగ్రదాడులు?

పాక్‌కు చెందిన జైషే మహ్మద్ ప్రణాళిక!.. కేంద్ర నిఘా వర్గాల హెచ్చరిక

» ఢిల్లీ, కశ్మీర్, పంజాబ్ సహా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన అధికారులు

» రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 21: గణతంత్ర వేడుకలే లక్ష్యంగా పాక్ ఉగ్రవాదులు దాడులకు కుట్ర పన్నారా? అంటే నిఘా వర్గాలు అవుననే అంటున్నాయి. పాక్‌కు చెందిన ఉగ్రసంస్థ జైషే మహ్మద్ భారత్‌లో ఉగ్రదాడులకు ప్రణాళిక వేసినట్లు వెల్లడించాయి. ఈ నెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు హెచ్చరించాయి. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ జైషే ఉగ్రవాదులకు సహకరిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 26న పెద్దఎత్తున దాడులకు పాల్పడేందుకు '26-26' అనే కోడ్ నేమ్‌ను పెట్టుకున్నట్లు తెలిపాయి. గణతంత్ర వేడుకలకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతో దాడులకు దిగవచ్చని తెలిపాయి. నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు సరిహద్దులు సహా జమ్మూకశ్మీర్, ఢిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. పలువురు అనుమానితుల ఫొటోలతో ఢిల్లీ పోలీసులు వాంటెడ్ నోటీసులు జారీ చేశారు. వారిని ఎక్కడైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజల్ని కోరారు. సోషల్ మీడియాలో ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్న కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిందితులు సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ.. జమ్మూకశ్మీర్, పంజాబ్, ఢిల్లీ, హరియాణాలోని యువకులను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.



గణతంత్ర ఉత్సవాల కోసం ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో పోలీసుల రిహార్సల్స్

తెలంగాణలోనూ హై అలర్ట్

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 26న పేలుళ్లతో విధ్వంసం సృష్టించడానికి ఉగ్రవాదులు కుట్ర పన్నారన్న సమాచారంతో కేంద్ర నిఘా బృందాలు ఇప్పటికే రాష్ట్రాలను అప్రమత్తం చేశాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద ముఠాలు దేశవ్యాప్తంగా ఉన్న తమ స్లీపర్ సెల్స్‌ను క్రియాశీలం చేస్తున్నాయని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఉగ్రవాదుల తాజా టార్గెట్ ఢిల్లీ మాత్రమే కాదని, అహ్మదాబాద్, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, మైసూరు, హైదరాబాద్, తిరుపతి, కొచ్చి, చెన్నై లాంటి నగరాలనూ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని భావిస్తున్నాయి. స్లీపర్ సెల్స్ ఈ సారి భారీ స్థాయిలో ఆత్మాహుతి దాడులకు పాల్పడే అవకాశం ఉందని అనుమానిస్తున్నాయి. ఇక హైదరాబాద్‌తో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఉగ్రవాదుల కదలికలు బయటపడిన నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా హై అలర్ట్‌ను ప్రకటించారు. విమానాశ్రయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రజలు అత్యధికంగా సంచరించే మార్కెట్లు, మాల్స్‌ను ఉగ్రవాదులు టార్గెట్ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉగ్రవాద లింకులున్న అనుమానితులపై నిఘా పెట్టారు. తెలంగాణకు చెందిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు ఉగ్రవాద అనుమానితుల సమాచారాన్ని జిల్లా పోలీసులకు పంపించి అప్రమత్తం చేస్తున్నారు.

పెళ్లయిన జంటలకు ఆదాయపన్ను ఉపశమనం?

» భార్య, భర్త కలిసి ఉమ్మడిగా ఐటీ రిటర్నులు దాఖలు చేసే అవకాశం

» మినహాయింపులను పంచుకునే వీలు

» మొత్తంగా ఆదాయ పన్ను తగ్గే చాన్స్

» కేంద్రానికి అందిన ప్రతిపాదనలు

» త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో చేర్చవచ్చనే అంచనాలు



న్యూఢిల్లీ, జనవరి 21: వివాహమైన జంటలకు ఆదాయ పన్ను (ఐటీ) నుంచి ఉపశమనం కల్పించేలా ఉమ్మడిగా ఐటీ రిటర్నులు దాఖలు చేసే అవకాశం కల్పించే ప్రతిపాదనను కేంద్రం పరిశీలిస్తోంది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఇకాయ్)తోపాటు పలు సంస్థలు, వ్యక్తులు ఈ అవకాశం కోసం కేంద్రానికి ప్రతిపాదనలను సమర్పించాయి. సాధారణంగా వ్యక్తిగత ఆదాయంలో ఇన్సూరెన్స్, ఇంటి అద్దె, పిల్లల చదువుల ఖర్చులు వంటి వాటికి నిర్ణీత పరిమితి మేరకు పన్ను మినహాయింపు ఉంటుంది. దంపతులలో ఎవరు ఈ ఖర్చును భరించినా వారి వ్యక్తిగత ఐటీ రిటర్నులలో మాత్రమే చూపించుకోవడానికి వీలుంది. ఒకవేళ దంపతులలో ఒకరే సంపాదిస్తున్నా.. భార్యాభర్తల సంపాదనలో ఎక్కువగా తేడాలున్నా.. మినహాయింపులను పూర్తిగా క్లెయిమ్ చేసుకోవడానికి అవకాశం లేదు. అదే ఉమ్మడిగా ఐటీ రిటర్నులు దాఖలు చేసే అవకాశం కల్పిస్తే.. మినహాయింపులను పూర్తిగా క్లెయిమ్ చేసుకోవడానికి వీలుంటుంది. దీనితో కట్టాల్సిన పన్ను మొత్తం తగ్గేందుకు అవకాశం ఉంటుంది. దానికితోడు దంపతులు ఇంటికోసం, ఇతర అవసరాల కోసం ఉమ్మడిగా రుణాలు తీసుకోవడం మరింత సులువు అవుతుంది. అమెరికా, జర్మనీ తదితర దేశాల్లో దంపతులు ఉమ్మడిగా ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసే అవకాశం ఇప్పటికే ఉంది. కేంద్రం తాజా బడ్జెట్‌లో దీనిని చేరిస్తే.. ఆదాయ పన్ను వ్యవస్థలో కీలక మార్పుకానుంది. దంపతుల ఉమ్మడి ఆదాయంలో రూ.8 లక్షల వరకు ఎలాంటి పన్ను విధించవద్దని, రూ.8-16 లక్షల మధ్య 5శాతం, రూ.16-24లక్షల మధ్య 10శాతం, రూ.24-32 లక్షల మధ్య 15శాతం, రూ.32-40 లక్షల మధ్య 20శాతం, రూ.40-48లక్షల మధ్య 25శాతం, రూ.48లక్షలపైన 30శాతం పన్ను విధించాలని ఇకాయ్ ప్రతిపాదించింది.

ఉదయనిధిది విద్వేష ప్రసంగమే

» సనాతనపై ఆయన వ్యాఖ్యలు హిందువులకు వ్యతిరేకం: మద్రాస్ హైకోర్టు

చెన్నై, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై మద్రాస్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ తీవ్రంగా స్పందించింది. ఆయన వ్యాఖ్యలు విద్వేషపూరితమైనవని, దేశంలో 80 శాతం మందిగా ఉన్న హిందువులకు వ్యతిరేకమైనవని బెంచ్ స్పష్టం చేసింది. ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ మినహా మహాత్మాగాంధీ, కామరాజర్, బుద్ధుడు, రామానుజుడు, వళ్లలార్ వంటి మహాపురుషులు సనాతన ధర్మానికి వ్యతిరేకులు కారని వ్యాఖ్యానించింది. ఉదయనిధి స్టాలిన్ 2023లో సనాతన ధర్మానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన ఢిల్లీకి చెందిన బీజేపీ ఐటీ విభాగం జాతీయ అధ్యక్షుడు అమిత్ మాల్వియాపై తిరుచ్చి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసును రద్దు చేయాలని కోరుతూ అమిత్ మాల్వియా హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై విచారణ క్రమంలో ఉదయనిధి స్టాలిన్‌ను ఉద్దేశించి న్యాయమూర్తి జస్టిస్ ఎస్ శ్రీమతి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి (ఉదయనిధి స్టాలిన్) బయట తిరుగుతున్నారు. ఆయనపై మిగతా రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయిగానీ, తమిళనాడులో కేసు పెట్టలేదు. కానీ, ఆ వ్యక్తి వ్యాఖ్యలను వ్యతిరేకించారంటూ, పిటిషనర్‌పై మాత్రం కేసు పెట్టారు. ఈ పరిస్థితి బాధిస్తోంది" అని న్యాయమూర్తి అన్నారు. పోలీసులు నమోదు చేసిన కేసును రద్దుచేశారు. ఈ క్రమంలో ఉదయనిధి ప్రసంగంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "'నాశనం' (తమిళంలో ఒళిప్పు) అనే పదం ప్రాతిపదికగా ఈ కేసు దాఖలైంది. నాశనం అంటే ఉన్నదానిని లేకుండా చేయడమే. సనాతన ధర్మాన్ని అనుసరించే వ్యక్తుల సమూహం ఉండకూడదనుకుంటే.. అది 'జాతి నిర్మూలన' కిందకు వస్తుంది. అందువల్ల ఉదయనిధి ప్రసంగాన్ని ఖండిస్తూ సోషల్ మీడియలో పోస్ట్ పెట్టినదానిని ద్వేషపూరిత ప్రసంగంగా పరిగణించలేం." అని న్యాయమూర్తి తెలిపారు. తమిళనాట హిందువులపై గతంలో ఎన్నో దాడులు జరిగాయనేందుకు ఆధారాలు ఉన్నాయన్నారు. గత వందేళ్లుగా ఉన్న డీఎంకే ఆధ్వర్యంలో హిందూమతంపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. కాగా, తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఉదయనిధి స్టాలిన్ తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా డిమాండ్ చేశారు.

ఉదయనిధి స్టాలిన్ ఏమన్నారంటే..

ఉదయనిధి 2023లో జరిగిన ఓ సభలో మాట్లాడుతూ.. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. "కొన్నింటిని మనం వ్యతిరేకించలేం. వాటిని నిర్మూలించాల్సిందే. డెంగీ, దోమలు, మలేరియా, కరోనాలను నిర్మూలించేస్తాం కదా! అదేవిధంగా సనాతన ధర్మాన్ని వ్యతిరేకించడం కాకుండా.. దానిని నిర్మూలించేయాలి. సామాజిక న్యాయానికి, సమానతకు సనాతన ధర్మం వ్యతిరేకం. కులం, మతం ఆధారంగా అది సమాజాన్ని చీల్చివేస్తుంది" అని వ్యాఖ్యానించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



కొత్త ఇంట్లోకి ఆమిర్, గౌరీ

బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ ఆమిర్‌ఖాన్ తన వ్యక్తిగత జీవితంలో మరో ముందడుగు వేశారు. తన భాగస్వామి గౌరీ స్ప్రాట్‌తో కలసి ముంబైలోని ఓ విలాసవంతమైన కొత్త ఇంట్లోకి మారనున్నారు. ఈ ఇల్లు ఆమిర్ కుటుంబ సభ్యులు నివసిస్తున్న ప్రాంతానికి సమీపంలోనే ఉండడం విశేషం. మరోవైపు తన పెళ్లి గురించి వస్తున్న వార్తలపై ఆమిర్ స్పందిస్తూ, ప్రస్తుతానికి పెళ్లి గురించి ఎలాంటి తక్షణ ప్రణాళికలు లేవు, మానసికంగా మేమిద్దరం ఎప్పుడో ఒక్కటయ్యామని స్పష్టం చేశారు. ప్రస్తుతం తన నిర్మాణంలో తెరకెక్కుతోన్న 'హ్యాపీ పటేల్' చిత్రం పనుల్లో బిజీగా ఉండడం వల్ల కొత్త ఇంట్లోకి మారే పనులతో కాస్త హడావిడిగా అనిపిస్తోందని ఆమిర్ పేర్కొన్నారు.

మృణాల్ ముగించారు



విభిన్న కథాంశాలను ఎన్నుకుంటూ వరుస విజయాలు సాధిస్తున్న అడివి శేష్ తాజా చిత్రం 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం 'డెకాయిట్' షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. తాజా షెడ్యూల్‌తో మృణాల్ ఠాకూర్ వర్క్ పూర్తయింది. యూనిట్ ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికింది. తెలుగు, హిందీ భాషల్లో తన పాత్రకు తనే డబ్బింగ్ చెబుతున్నారు మృణాల్. ఉగాది సందర్భంగా మార్చి 19న విడుదలయ్యే ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, అతుల్ కులకర్ణి, సునీల్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియో సమర్పణలో సుప్రియ యార్లగడ్డ 'డెకాయిట్' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత.

రోమియో పోరాటం



బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్ హీరోగా విశాల్ భరద్వాజ్ తెరకెక్కించిన చిత్రం 'ఓ రోమియో'. ఈ థ్రిల్లింగ్ యాక్షన్ డ్రామాలో త్రిప్తీ డిమ్రీ కథానాయిక. విక్రాంత్ మాసే, నానా పటేకర్, అవినాశ్ తివారీ, తమన్నా కీలక పాత్రలు పోషించారు. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 13న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. అదిరిపోయే పోరాట ఘట్టాలు, ఆసక్తికరమైన సంభాషణలు, అలరించే సంగీతం, అద్భుతమైన విజువల్స్‌తో నిండిన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేసింది. ఇందులో గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు షాహిద్. కాగా, విశాల్ భరద్వాజ్, షాహిద్ కపూర్ కలయికలో తెరకెక్కిన 'కమీనే', 'హైదర్' చిత్రాలు విమర్శకుల ప్రశంసలు పొందాయి.

ఆత్రేయపురం బ్రదర్స్... స్వీట్ వార్



మారుతున్న ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా, సరికొత్త కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆత్రేయపురం బ్రదర్స్'. 'ఏ స్వీట్ రైవల్రీ' అనేది ఉపశీర్షిక. రాజేశ్ జగన్నాథం దర్శకత్వంలో ఎస్2ఎస్ సినిమాస్, ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ పతాకాలపై రూపొందుతోంది. బుధవారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి వశిష్ఠ క్లాప్ ఇవ్వగా, విజయ్ కనకమేడల కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు అనుదీప్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. 'ఈ తరం ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలతో, వైవిధ్యభరితమైన కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నాం' అని చిత్ర బృందం తెలిపింది. రాజీవ్ కనకాల, రఘుబాబు కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సంతు ఓంకార్, సినిమాటోగ్రఫీ: రమీజ్ నవనీత్.

సరికొత్త అనుభూతినిచ్చేలా...



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై జంటగా కరుణకుమార్ తెరకెక్కించిన చిత్రం 'హనీ'. రవి పీట్ల, ప్రవీణ్‌కుమార్ రెడ్డి నిర్మించారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. వాస్తవిక సంఘటనల ప్రేరణతో మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాల నేపథ్యంలో చిత్రం రూపొందినట్లు తెలుస్తోంది. ప్రేక్షకులు ఎన్నడూ చూడని ఓ సరికొత్త ప్రపంచాన్ని చూపించనున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: మార్తాండ్ కె వెంటకేశ్, సినిమాటోగ్రఫీ: నాగేశ్ బానెల్, సంగీతం: అజయ్ అరసాడ. ఫిబ్రవరి 6న సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్.

ఊర్వశి సోదరుడు.. కమల్ ఇకలేరు



సీనియర్ నటి ఊర్వశి సోదరుడు, తమిళ నటుడు కమల్ రాయ్ (54) ఇకలేరు. బుధవారం చెన్నైలో గుండెపోటుతో మృతి చెందారు. 'సయూజ్యం', 'కొలిలాక్కం', 'యువజనోల్సవం', 'మంజు', 'కల్యాణ సౌగంధికం, 'వాచలం' వంటి సినిమాల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. నటుడిగానే కాకుండా పలు సినిమాల్లో విలన్‌గా కూడా రాణించారు. ఆయన మృతిపట్ల కోలీవుడ్ చిత్ర పరిశ్రమ సంతాపం తెలిపింది.

అంతరిక్షమే హద్దుగా



నిజ జీవితంలో దంపతులైన హీరో వరుణ్ సందేశ్, వితికా షేరు వెండితెరపై మరోసారి జంటగా కనిపించనున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో కార్తీక్ భాగ్యరాజా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'డియర్ ఆస్ట్రోనాట్'. వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం మంగళవారం విడుదల చేసింది. 'చిన్నప్పటి నుంచి అంతరిక్షంలోకి వెళ్లాలని నక్షత్రాల మధ్య విహరించాలని కలలు కనే ఒక సాధారణ మహిళ కథే 'డియర్ ఆస్ట్రోనాట్'. కథనం చాలా కొత్తగా ఉంటుంది' అని యూనిట్ తెలిపింది.

దేశభక్తి గీతం



నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో అక్కి విశ్వనాథ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఛైనా పీస్'. కమల్ కామరాజు, రఘుబాబు, శ్రీకాంత్ అయ్యంగార్ ఈ స్పై యాక్షన్ డ్రామాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. మూన్‌లైట్ డ్రీమ్స్ బ్యానర్ నిర్మిస్తోంది. ఇటీవలె విడుదల చేసిన టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. తాజాగా ఈ సినిమా నుంచి 'భగ భగ' అంటూ సాగే దేశభక్తి గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. రెహ్మాన్ రచించగా, కాలభైరవ ఆలపించారు. కార్తిక్ సంగీతం అందించారు. ఫిబ్రవరి చివరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు.

పెంపుడు కుక్కకు తులాభారం

● క్షమాపణలు చెప్పిన నటి టీనా శ్రావ్య



ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి వనదేవతల దర్శనార్థం బుధవారం వచ్చిన సినీనటి టీనా శ్రావ్య తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఆమె తన పెంపుడు కుక్కకు బంగారం (బెల్లం)తో తులాభారం వేయడం వివాదాస్పదమైంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో టీనా శ్రావ్యపై కొందరు భక్తులు మండిపడుతున్నారు. ఇది ముమ్మాటికీ భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శ్రావ్య సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. ఇటీవల తన పెంపుడు కుక్క అనారోగ్యానికి గురైందని, ఆరోగ్యం కుదటపడితే ఎత్తుబంగారం ఇస్తానని మొక్కుకున్నానని తెలిపారు. తాను భక్తితోనే ఆ మొక్కు తీర్చానని, గిరిజన సంప్రదాయాలను కించపరిచే ఉద్దేశం తనకు లేదని చెప్పారు. భక్తుల మనోభావాలు దెబ్బతింటే తనను క్షమించాలని విజ్ఞప్తి చేశారు.

ములుగు (ఆంధ్రజ్యోతి)



విశాఖ సాగర తీరంలో వేల్ షార్క్

స్కూబా డైవర్లకు కనిపించిన భారీ సొరచేప

సాగర్‌నగర్(విశాఖపట్నం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): సముద్ర పర్యావరణ వ్యవస్థ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటే కనిపించే భారీ వేల్ షార్క్ బుధవారం విశాఖ తీరంలో స్కూబా డైవర్లను అలరించింది. రుషికొండ వద్ద సముద్రపు అంచుల్లో డైవింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా వేల్‌షార్క్ ప్రత్యక్షం కావడంతో స్కూబా డైవర్లు ఆశ్చర్యపోయారు. సాధారణంగా ఇవి సముద్ర పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటేనే కనిపిస్తాయని వారు చెప్పారు. ఇక్కడ షార్క్‌లు కనిపించడంతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపున్న స్కూబా డైవింగ్ జాబితాలో విశాఖ చేరుతుందంటున్నారు. ఇప్పటికే అనేక సహజమైన పగడపు దిబ్బలు, పురాతన నౌకల శిథిలాలు ఇక్కడి తీరంలో డైవర్లను అలరిస్తున్నాయని తెలిపారు.

పర్యాటకానికి ఊతం

సముద్ర గర్భంలో అపారమైన సంపద దాగి ఉంది. ఇప్పటికే అనేక డైవింగ్ సైట్లను గుర్తించాం. మరిన్ని అన్వేషించాల్సింది ఉంది. వేల్‌షార్క్ కనిపించడం విశాఖ అంతర్జాతీయ స్థాయి డైవింగ్ హబ్‌గా ఎదగడానికి దోహదపడుతుంది. మౌలిక సదుపాయాలు, రక్షణ చర్యలు చేపడితే ప్రపంచ దేశాల నుంచి భారీగా పర్యాటకులు తరలివస్తారు.

- బి.బలరాంనాయుడు, అధ్యక్షుడు, ఏపీ వాటర్ స్పోర్ట్స్



ఐస్‌క్రీమ్ తింటున్న చిన్నారులు. సత్యన్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న గిన్నిస్ రికార్డ్ ఆఫ్ బుక్స్ ప్రతినిధి రిచర్డ్ విలియం స్టెన్నింగ్

ఐస్‌క్రీం తింటూ గిన్నిస్ రికార్డు

ఒకే సమయంలో ఆరగించిన 4వేలకుపైగా చిన్నారులు

ఒకే సమయంలో 4,008 మంది చిన్నారులు ఐస్‌క్రీమ్ తిని గిన్నిస్ ప్రపంచ రికార్డు నెలకొల్పారు. హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్స్ లిమిటెడ్‌కు చెందిన 'అరు ణ్ ఐస్‌క్రీమ్' ఆధ్వర్యంలో బుధవారం చెన్నైలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులను పలు వరుసల్లో నిలబెట్టి, వారికి బటర్ స్కాచ్, చాకొలెట్ ఫ్లేవర్ జాలి ట్రైన్, పాలతో కూడిన ఐస్‌క్రీమ్‌లను అందించారు. వారంతా ఒకే సమయంలో ఒక నిమిషంపాటు ఐస్‌క్రీమ్‌ను సేవించారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ ప్రతినిధులు రిచర్డ్ విలియం స్టెన్నింగ్(యూకే), మిలింద్ వెర్లేకర్(పుణే) అధికారికంగా గుర్తించారు. హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్స్ లిమిటెడ్ వైస్ చైర్మన్ సి.సత్యన్‌కు సర్టిఫికెట్‌ను అందజేశారు.

- చెన్నై,ఆంధ్రజ్యోతి

హలో.. 'సామ్'..!

ఏయూ మహిళా ఇంజనీరింగ్ విద్యార్థినుల అద్భుత ఆవిష్కరణ

తక్కువ ఖర్చుతో రూపకల్పన.. వినియోగించడం అత్యంత సులువు

అలెక్సా తరహాలో విభిన్న ఫీచర్లతో ఏఐ ఆధారిత వాయిస్ చాట్‌బాట్

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రపంచంలో ఏఐ ఆధారిత చాట్‌బాట్‌లు మానవ జీవితాన్ని వేగవంతం చేస్తున్నాయి. రాయడం, నేర్చుకోవడం, ఏదైనా విషయాలను వేగంగా వెతకడంలో ఏఐ చాట్‌బాట్‌లు ఎంతగానో సాయపడుతున్నాయి. అయితే వీటికి మరిన్ని ఫీచర్లు జోడిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం విద్యార్థినులు ఏఐ ఆధారిత వాయిస్ చాట్‌బాట్‌ను డిజైన్ చేశారు. అలెక్సా తరహాలో దీనికి 'సామ్' అని పేరు పెట్టారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఏఐ వాయిస్ ఆధారిత చాట్ బాట్‌లతో పోలిస్తే వీళ్లు రూపొందించిన 'సామ్'లో విభిన్న ఫీచర్లు ఉన్నాయి. ఫైనలియర్ ప్రాజెక్టులో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అరవింద శిల్ప మార్గదర్శకంలో విద్యార్థినులు పసగడుగుల హర్షశ్రీ, ఎస్ఎల్ఎస్ సంజన, కె.సంధ్య దీన్ని రూపొందించారు. కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ, ఇతర అధ్యాపకులు సహకారం అందించారు.

అన్ని ఫీచర్లూ ఒకేచోట.. అదే దీని ప్రత్యేకత

ఇప్పటివరకు మార్కెట్‌లో ఉన్న ఏఐ ఆధారిత చాట్‌బాట్‌లు వాయిస్ ఆధారంగా సేవలందిస్తున్నాయి. ఏయూ విద్యార్థినులు డిజైన్ చేసిన రాస్ప్బెర్రీ పై ఆధారిత ఏఐ చాట్ బాట్‌లో అనేక రకాల సేవలు పొందవచ్చు. దీన్ని ఫోన్, కంప్యూటర్ వంటి పరికరాల సాయంతో వినియోగించుకునే అవకాశం ఉంది. వాయిస్‌ను టెక్ట్స్‌గా మార్చి సమాధానాన్ని రాబట్టే ఏఐ ఆధారిత వాయిస్ చాట్‌బాట్‌లు మార్కెట్‌లో కొన్ని ఉన్నాయని, అలాగే.. కొన్ని చాట్‌బాట్‌లు టెక్ట్స్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంతోపాటు మ్యూజిక్ ప్లే చేయడం, ఫొటోలు తీయడం, వాటిని సేవ్ చేయడం వంటి సేవలూ అందిస్తాయని విద్యార్థినులు తెలిపారు. వీటన్నింటినీ కలిపి ఒకేచోట అందించేలా ఈ చాట్ బాట్‌ను రూపొందించామని వారు తెలిపారు. ఫొటోలు తీసి.. వాటిని ఎక్కడ సేవ్ చేయాలన్న ఫీచర్‌తో కూడిన వాయిస్ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకురావడం ఇదే తొలిసారని చెబుతున్నారు. మాడ్యుల్ ఆధారిత నిర్మాణం వల్ల భవిష్యత్తులో మార్పులు చేసుకునేందుకు వీలుంటుందని అన్నారు.

వినియోగించిన టెక్నాలజీలు ఇవే..

ఈ వాయిస్ చాట్‌బాట్ కోసం ఓపెన్ సోర్స్‌లో ఉన్న పలు టెక్నాలజీలను విద్యార్థినులు వినియోగించారు. గూగుల్ వెబ్ స్పీచ్ ఏపీఐను వాయిస్‌ను టెక్ట్స్‌గా మార్చేందుకు, జెమిని ఏఐను బోధనాత్మక సమాధానాల కోసం, జీటీటీఎస్‌ను టెక్ట్స్‌ను స్పీచ్‌గా మార్చేందుకు, ఓపెన్ వెదర్ మ్యాప్ ఏపీఐను వాతావరణ సమాచారం పొందేందుకు, యూట్యూబ్ డీఎల్‌పీ అండ్ వీఎల్‌సీని మ్యూజిక్ ప్లేబ్యాక్ కోసం, ఓపెన్ సీవీని ఫొటోలు తీసేందుకు వినియోగించారు. మూడు నెలల వ్యవధిలో కేవలం రూ.8 వేల ఖర్చుతో దీన్ని డిజైన్ చేశారు. వ్యక్తిగత వాయిస్ అసిస్టెంట్‌గా, విద్యా సంస్థల్లో ఇంటరాక్టివ్ లెర్నింగ్ టూల్‌గా, ఇన్ఫర్మేషన్ కియోస్క్‌గా, దృష్టి లోపమున్న వారికి సహాయకారిగా, భవిష్యత్తులో స్మార్ట్ హోమ్ కంట్రోల్ వ్యవస్థగా వినియోగించుకునేలా దీన్ని రూపొందించారు. ఈ చాట్‌బాట్‌ను డిజైన్ చేసిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.అరవింద శిల్ప అభినందించారు.



ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో విద్యార్థినులు హర్షశ్రీ, సంజన, సంధ్య



ఏయూ విద్యార్థినులు రూపొందించిన ఏఐ ఆధారిత వాయిస్ చాట్‌బాట్

లోటు రూ.15,651 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్నారు. ఏటా రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయవ్యయాల ప్రతిపాదనలను ఏపీఈఆర్సీకి డిస్కమ్‌లు సమర్పిస్తాయి. వీటిపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన అనంతరం వాటి ప్రతిపాదనల్లో కోత విధించాలా లేక యథాతథంగా ఆమోదించాలా అన్న అంశంపై ఏపీఈఆర్సీ నిర్ణయం తీసుకుంటుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి.. ఏపీఎస్పీడీసీఎల్ సమర్పించిన ఆదాయవ్యయాల ప్రతిపాదనల నివేదికలో రూ.7,733.85 కోట్ల లోటును పేర్కొంది. ఏపీసీపీడీసీఎల్ తన నివేదికలో రూ.3,465.35 కోట్ల లోటు ఉన్నట్టు తెలిపింది. ఏపీఈపీడీసీఎల్ తన నివేదికలో రూ.4,452.73 కోట్ల లోటును పేర్కొంది. మొత్తం మీద మూడు డిస్కమ్‌లు కలిపి రూ.15,651.93 కోట్ల లోటును ప్రతిపాదించాయి.

వైద్యుడి కిరాతకం

డబ్బు కోసం పెదనాన్న, పెద్దమ్మల హత్య

- మత్తు ఇంజక్షన్ ఓవర్ డోస్ ఇచ్చిన డాక్టర్
- ఒక్క రోజులోనే కుట్రను ఛేదించిన శివమొగ్గ పోలీసులు



చంద్రప్ప, జయమ్మ దంపతులు (ఫైల్)

బెంగళూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఓ వైద్యుడు డబ్బుల కోసం అత్యంత కిరాతకంగా ప్రవర్తించాడు. సొంత పెదనాన్న, పెద్దమ్మకు మత్తు ఇంజక్షన్ ఓవర్ డోస్ ఇచ్చి హత్య చేశాడు. ఈ దారుణ సంఘటన శివమొగ్గ జిల్లా భద్రావతిలో చోటు చేసుకుంది. జిల్లా ఎస్పీ నిఖిల్ కేసు వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. 'భద్రావతిలో విశ్రాంత ఉద్యోగి చంద్రప్ప(75), ఆయన భార్య జయమ్మ(65) నివసిస్తున్నారు. వారి కుమారులు మరోచోట ఉంటారు. చంద్రప్ప తమ్ముడు పాలాక్షప్ప కుమారుడు మల్లేశ్ బీఏఎంఎస్ చేసి వైద్యునిగా కొనసాగుతున్నాడు. ఇటీవల తన పెదనాన్నను రూ.15 లక్షలు అప్పు అడిగాడు. ఇవ్వకపోవడంతో ద్వేషం పెంచుకున్నాడు. ఆయనను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. కుట్రలో భాగంగా మంగళవారం వారి ఇంటికి వెళ్లి కాసేపు గడిపాడు. వయోభారంతో ఏర్పడ్డ అనారోగ్య ఇబ్బందులను వృద్ధ దంపతులు మల్లేశ్‌కు తెలిపారు. వైద్యం పేరిట వారిద్దరికీ హెవీ డోస్ మత్తు ఇంజక్షన్ ఇచ్చాడు. దీంతో వారిరువురూ మృతి చెందారు. మృతుల ఒంటిపై, బీరువాలో ఉన్న నగలను తీసుకొని మల్లేశ్ పరారయ్యాడు. ఆరోగ్యంగా ఉన్న తమ తల్లిదండ్రులు ఒకేసారి మృతి చెందడంపై అనుమానం వ్యక్తం చేసిన వారిని మభ్యపెట్టేందుకు మల్లేశ్ ప్రయత్నించాడు. 'ఇంటికి వచ్చి పెదనాన్న, పెద్దమ్మలతో మాట్లాడాను. వారు బాగున్నారు. అంతలోనే ఏం జరిగింది..?' అంటూ ఫోన్ చేసి ఆరా తీశాడు. పోస్టుమార్టం చేయించకూడదని పిల్లలు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ నిఖిల్ సంఘటనా స్థలానికి వెళ్లారు. హతుల ముగ్గురు కుమారులతో మాట్లాడి, వివరాలను తెలుసుకున్నారు. 'మా అమ్మ మెడలో తాళి, చేతికి ఉన్న నాలుగు గాజులు, బీరువాలో ఉన్న ఆభరణాలు చోరీ అయ్యాయి' అని వారు ఎస్పీకి వివరించారు. బీరువాలో ఉన్న సుమారు 30 పట్టుచీరలు అలాగే ఉండటం, బంగారం మాత్రమే చోరీ కావడంతో పోలీసులు మల్లేశ్‌ను అనుమానించారు. డాక్టర్ మల్లేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిజం కక్కించారు.

నడిపించుకుంటూ కోర్టుకు..

హత్య కేసు నిందితులకు పోలీసుల స్పెషల్ ట్రీట్‌మెంట్

తుని రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తను దారుణంగా హతమార్చిన కేసులో నిందితులకు తుని రూరల్ పోలీసులు స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. మొత్తం 12మంది నిందితులను అరెస్ట్ చేసి, వారిని రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లి కోర్టులో హాజరుపరిచారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో కొన్నేళ్లుగా టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య వైరం కొనసాగుతోంది. ఈ నెల 16న గ్రామంలో ఓ టీడీపీ నాయకుడి పుట్టిన రోజు వేడుకలకు పలువురు టీడీపీ కార్యకర్తలు హాజరయ్యారు. వీరంతా రాత్రి 8 గంటల సమయంలో సమీపంలోని రామాలయం వద్ద జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమం చూసేందుకు వెళ్తున్నారు. అప్పటికే కోటనందూరు వైసీపీ మండల అధ్యక్షుడు చింతకాయల చినబాబు ఇంటివద్ద కొంతమంది వైసీపీ శ్రేణులు కత్తులు, ఇనుప రాడ్లు, కర్రలతో కాపు కాశారు. అటుగా వచ్చిన టీడీపీ కార్యకర్తలపై పథకం ప్రకారం దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త లాలం బంగారయ్య మృతి చెందాడని, ఈ కేసులో 12 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని డీఎస్పీ తెలిపారు. సరిపడా వాహనం అందుబాటులో లేకపోవడంతో నిందితులను కాలినడకన కోర్టుకు తీసుకెళ్లాల్సి వచ్చిందని చెప్పారు.



తునిలో హత్య కేసు నిందితులను కాలినడకన కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

ఎమ్మెల్యేలకు నో వర్క్.. నో పే!

- అప్పటికీ వినకుంటే రీకాల్ చేసే హక్కును ప్రజలకు కల్పించాలి
- అవసరమైతే చట్టాన్ని సవరించాలి
- అఖిల భారత స్పీకర్ల సమావేశంలో శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఏవిధంగా అయితే 'నోవర్క్.. నోపే'(పని చేయకపోతే.. చెల్లింపులు లేవు) చట్టసభలకు హాజరుకాని ప్రజాప్రతినిధులకు కూడా వర్తింపజేయాలని ఏపీ శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవులో జరుగుతున్న అఖిల భారత సభాపతుల సమావేశంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పాల్గొన్నారు. 'ప్రజల పట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం' అనే అంశంపై అయ్యన్న మాట్లాడారు. ఉద్యోగులు విధులకు హాజరుకాకపోతే వారి వేతనాల్లో కోత పెట్టినట్లే, చట్టసభలకు హాజరుకాని ప్రజాప్రతినిధుల జీతభత్యాల్లో కూడా కోత విధించాలని సూచించారు. అప్పటికీ గుణపాఠం నేర్చుకోని ప్రజా ప్రతినిధులను మళ్లీ ప్రజాకోర్టులో నిలబెట్టాలని, దీనికోసం అవసరమైతే రాజ్యాంగాన్ని, ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించి ప్రజలకు రైట్ టు రీకాల్(ఎన్నికను రద్దు చేసే) హక్కు కల్పించాలని సూచించారు. పారదర్శకత లోపించిన ఏ వ్యవస్థా ప్రజలకు జవాబుదారీ కాజాలదని, ఈ కారణంగానే మన రాజ్యాంగంలో శాసనవ్యవస్థను అత్యంత పారదర్శకంగా పనిచేసేలా రూపొందించారని అయ్యన్న పేర్కొన్నారు. శాసనవ్యవస్థలో ప్రతి పనీ ప్రజలకు తెలిసే జరుగుతుందని, అందుకే శాసనవ్యవస్థను అద్దాల మేడతో పోలుస్తారన్నారు. అయితే, కొందరు శాసనసభ్యులు తమ విధులను నిర్వర్తించకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఏపీ విషయానికే వస్తే 2024 ఎన్నికల తర్వాత శాసనసభకు ఎన్నికైన సభ్యుల్లో కొంత మంది ఒక్క రోజు కూడా సభకు రానివారు ఉన్నారని, అది చాలదన్నట్లు సభకు హాజరుకాకపోయినా వారిలో కొందరు క్రమం తప్పకుండా వేతనాలు, భత్యాలు తీసుకుంటున్నారని తెలిపారు. సభాపతిగా ఇది తనకు ఎంతో వేదన కలిగిస్తోందన్నారు. ఇలాంటి అనైతిక ప్రవర్తనతో ప్రజల దృష్టిలో చులకన అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా అనైతిక వ్యవహార్శైలిని నిషేధించే నిబంధనలేవీ లేవు కాబట్టి, ఈ విషయంలో తమకొక మార్గం చూపించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను అయ్యన్నపాత్రుడు అభ్యర్థించారు. కాగా, మాతృభాష తెలుగులో ప్రసంగించిన అయ్యన్నపాత్రుడును పంజాబ్ శాసన సభ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్ సభా ముఖంగా అభినందించారు.



చట్టసభల సభాపతుల మహాసభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

నాలుగు బస్సులు ఢీ

41 మంది విద్యార్థులకు గాయాలు

అర్ధరాత్రి తూర్పుగోదావరి జిల్లాలో ఘటన



ప్రమాదంలో ధ్వంసమైన బస్సు ముందుభాగం

దివాన్‌చెరువు/రాజమహేంద్రవరం అర్బన్/డిండి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గేదె అడ్డు వచ్చిందని ఒక బస్సు డ్రైవర్ షడన్ బ్రేక్ వేయడంతో దాని వెనుక వస్తున్న మూడు బస్సులు వరుసగా ఒకదానినొకటి వెనుక నుంచి ఢీకొన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిందీ ఘటన. నాలుగూ ప్రైవేటు బస్సులే. ఈ ఘటనలో తెలంగాణలోని నల్లగొండ జిల్లా దిండి ప్రాజెక్టు సమీపంలోని మోడల్ స్కూల్‌కు చెందిన 41 మంది విద్యార్థినీవిద్యార్థులతోపాటు ఒక ప్రిన్సిపాల్, నలుగురు ఉపాధ్యాయులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. దిండి మోడల్ స్కూల్‌కు చెందిన 9, 10 తరగతులతోపాటు ఇంటర్మీడియెట్‌కు చెందిన మొత్తం 109 మంది విద్యార్థినీవిద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు, నలుగురు బస్సు డ్రైవర్లతో ఈనెల 17న రెండు బస్సుల్లో విజ్ఞానయాత్రకు బయలుదేరారు. అరకు, బొర్ర గుహలు, విశాఖ ఆర్కే బీచ్, సింహాచలం, అన్నవరం దర్శించుకుని మంగళవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. అర్ధరాత్రి రాజానగరం మండలం దివాన్‌చెరువు వద్దకు వచ్చేసరికి గేదె అడ్డురావడంతో ముందు వెళుతున్న ట్రావెల్స్ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆ వెనుకే విద్యార్థులతో వస్తున్న రెండు బస్సులు, వాటి వెనుక ఉన్న మరో ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఒక దానినొకటి ఢీకొన్నాయి. రాజమహేంద్రవరం, రాజానగరంలకు చెందిన 3 అంబులెన్సుల్లో క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించారు. వీరిలో చాలా మందికి మెడ, తలకు, చేతులు, కాళ్లకు గాయాలవడంతో ఎక్స్‌రే, కొందరికి సీటీ స్కాన్ తీసి, ఎవ్వరికీ ఫ్రాక్చర్ కాలేదని వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం బుధవారం ఉదయం వారంతా స్వస్థలానికి చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ దివ్య చెప్పారు. గాయపడినవారిలో ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీలత, జ్యోతి, విజయ్, రవి ఉన్నారు. ప్రమాదం గురించి తెలిసి విద్యార్థుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.



రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

12 మంది ఇంజనీర్లపై వేటు

విజిలెన్స్ నివేదిక మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఎన్‌డీబీ) నిధులతో చేపట్టిన రహదారి పనుల్లో గోల్‌మాల్ జరిగిందని విజిలెన్స్ నిర్ధారించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జరిగిన 9 రహదారుల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సమగ్ర విచారణ చేసిన తర్వాత 12 మంది రోడ్లు-భవనాల శాఖ(ఆర్అండ్‌బీ) ఇంజనీర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజిలెన్స్ సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు(జీఓ-8) జారీ చేశారు. ఎన్‌డీబీ నిధులతో రహదారులు, వంతెనల పునర్నిర్మాణ ప్రాజెక్టు(ఏపీఆర్‌బీఆర్‌పీ), మండల, గ్రామీణ అనుసంధాన పురోగతి ప్రాజెక్టు(ఏపీఎమ్‌సీఆర్‌సీఐపీ) ప్రాజెక్టుల కింద చిత్తూరు జిల్లాల్లో రహదారుల పనులు చేపట్టారు. అయితే కొన్నింటిపై ఫిర్యాదులు రాగా వాటిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ విచారణ చేపట్టి గతేడాది అక్టోబరు 7న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దేవదొడ్డి-లంకపల్లి రహదారి విస్తరణ, పూతలపట్టు-ఐరాల వయా కొండేపల్లి, పూతలపట్టు-రామాపురం వయా కొండేపల్లి, చౌడేపల్లి-వలసపల్లి వయా బోయకొండ, నాగలాపురం-చిన్నపండూరు, సూళ్లూరుపేట-సంతవేలూరు, దామలచెర్వు-నెంద్రగుంట, శ్రీకాళహస్తి-మసాలపాడు పనులలో అవకతవకలు జరిగాయని విజిలెన్స్ నిర్ధారించింది.

విశాఖలో వచ్చే 18న ఐఎఫ్ఆర్

- 19 నుంచి మిలాన్
- రాష్ట్రపతి, ముఖ్యమంత్రి హాజరు

విశాఖపట్నం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చే నెల 18న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్), 19న మిలాన్ జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వాటికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. నగరంలోని పార్కులు, ప్రధాన రహదారుల సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. నేవీ అధికారులు మాధ్యూ, రజనీశ్‌శర్మలు మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలకు దేశ, విదేశాల నుంచి 73 మంది అతిథులు వస్తున్నారన్నారు. 22 దేశాల నుంచి నౌకలు వస్తాయని తెలిపారు. ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు మిలాన్ సందర్శన ఉంటుందన్నారు. 18న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, 19న సిటీ పరేడ్ ఉంటాయన్నారు. 19, 20 తేదీల్లో మిలాన్ హార్బర్ ఫేజ్, 21 నుంచి 25 వరకు సీ ఫేజ్ ఉంటాయని పేర్కొన్నారు. ఫ్లీట్ రివ్యూకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, మిలాన్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తారని తెలిపారు.

ఐఎఫ్ఆర్ అంటే.. భారత రాష్ట్రపతి తన హయాంలో నౌకాదళ సామర్థ్యాన్ని ఒకసారి సమీక్షిస్తారు. దానిని ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ అంటారు. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్) అంటే.. దేశ నౌకాదళంతోపాటు పొరుగు దేశాలకు చెందిన నౌకలు పాల్గొంటాయి. ఈ సందర్భంగా ఆయా దేశాలకు చెందిన నౌకల సామర్థ్యాలను రాష్ట్రపతి సమీక్షిస్తారు. ఈ కార్యక్రమంలో కీలకమైన యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లు పాల్గొంటాయి.

మిలాన్.. వివిధ దేశాలకు చెందిన నౌకాదళాలు ప్రదర్శనలో పాల్గొంటాయి. సముద్ర కార్యకలాపాల్లో పరస్పర సహకారం, సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి ఉద్దేశించిన నిర్వహించే కార్యక్రమమే మిలాన్. ఈ సందర్భంగా ఆయా దేశాలకు చెందిన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

వచ్చే నెలలో ఆర్సెలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన

- అనుమతుల కోసం కేంద్రంతో మాట్లాడండి
- మిట్టల్ సమక్షంలో అధికారులతో సీఎం సమీక్ష

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు అన్ని అనుమతుల సాధన కోసం కేంద్రంతో మాట్లాడాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దావోస్ పర్యటనలో ఉన్న చంద్రబాబుతో ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీమిట్టల్ సమావేశమయ్యారు. వచ్చే నెల 15వ తేదీ తర్వాత ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. తొలిదశలో దాదాపు రూ.60,000 కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. లక్ష్మీమిట్టల్ సమక్షంలోనే చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. కేంద్రంతో సంప్రదింపులు జరిపి అన్ని అనుమతులనూ సాధించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఢిల్లీ వెళ్లి అధికారులతో మాట్లాడాలని సూచించారు. ప్రభుత్వ సహకారంలో ఎక్కడా లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ విషయంలో సమన్వయం చేసుకోవాలని మంత్రులు లోకేశ్, భరత్‌లకు సీఎం సూచించారు.



ఆర్సెలార్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్‌తో సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



తమారా లీజర్ సీఈవో సృష్టి శిబులాల్‌తో సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి భరత్, తదితరులు

అమరావతిలో యువతకు ఏఐ నైపుణ్య శిక్షణ

చంద్రబాబుతో కాలిబో అకాడమీ చైర్మన్ భేటీ

దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబుతో కాలిబో ఏఐ అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ రాజ్ వట్టికూటి భేటీ అయ్యారు. వట్టికూటి అకాడమీ ద్వారా యువతకు అమరావతిలో ఏఐ నైపుణ్య శిక్షణను ప్రారంభిస్తున్నట్లు రాజ్ వెల్లడించారు. రాష్ట్రంలోని ఇతర విద్యాలయాల భాగస్వామ్యంతో యువతకు ఏఐలో నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సీఎం సూచించారు. విశాఖ మధురవాడ ఐటీ సెజ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఏపీలో అద్భుత ప్రదేశాలున్నాయి

ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టండి

తమారా లీజర్‌ను కోరిన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో ఆతిథ్య రంగంలో అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాలని తమారా లీజర్ సీఈవో సృష్టి శిబులాల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దావోస్ ఆర్థిక సదస్సులో చంద్రబాబుతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో పర్యాటకానికి పారిశ్రామిక హోదా కల్పించామని చంద్రబాబు వెల్లడించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు. పోలవరం నుంచి భద్రాచలం వరకూ గోదావరి నదీ తీరంలో అద్భుతమైన టూరిజం కేంద్రాలున్నాయన్నారు. కోనసీమ, గండికోట, అరకు, లంబసింగి లాంటి మంచి పర్యాటక కేంద్రాలున్నాయని వివరించారు. ప్రతి పర్యాటక ప్రాంతానికీ రోడ్డు, రైలు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ ఉందన్నారు. టూరిజం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేస్తుందని, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఎకో టూరిజం పెంచుతున్నామన్నారు. తాము త్వరలోనే ప్రతిపాదనలతో వస్తామని సీఈవో వెల్లడించారు.

ఏపీ బ్రాండింగ్ @ దావోస్!

(మొదటి పేజీ తరువాయి)

బ్రాండింగ్ చేసేందుకు ప్రపంచ ఆర్థిక సదస్సును తాను వేదికగా ఉపయోగించుకుంటున్నానని అన్నారు. "రాష్ట్రానికి బ్రాండింగ్ వస్తే పెట్టుబడులు వస్తాయి. పెట్టుబడులు వస్తే అభివృద్ధి జరుగుతుంది. అభివృద్ధి జరిగితే పేదలకు సంక్షేమం అందించవచ్చు. సింగపూర్ మాజీ అధ్యక్షుడు లీ క్వాన్ యూ , మలేషియా మాజీ అధ్యక్షుడు మహతీర్ మహ్మద్ నాకు స్ఫూర్తి. పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు ఉత్పత్తి వేగంగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. విశాఖకు గూగుల్ కంపెనీ రాక రాష్ట్రాభివృద్ధిలో గొప్ప ముందడుగు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలోఅప్ వల్లే ఈ పెట్టుబడులు సాధించగలిగాం. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే గూగుల్ పెట్టుబడులపై లోకేశ్ సంప్రదింపులు ప్రారంభించారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయి. రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నాం. టెక్నాలజీ, టెలికాం, విద్యుత్తు, ఏవియేషన్, నేషనల్ హైవేస్ రంగాల్లో చేపట్టిన సంస్కరణలతో దేశ దశా దిశా మారిపోయింది. 30 ఏళ్ల కిందట దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయి. నేడు ప్రతి రంగంలోనూ దేశం అద్భుత పురోగతి సాధిస్తోంది. అప్పుడూ ఇప్పుడూ సంస్కరణలను అందిపుచ్చుకుంటున్నాం. ఈ సంస్కరణలే రాష్ట్ర యువతకు అవకాశాలు కల్పిస్తున్నాయి" అని చంద్రబాబు అన్నారు.

భవిష్యత్తు నగరంగా అమరావతి

"రాజధాని నిర్మాణం ఒక అవకాశంగా భావిస్తున్నా. ఒక అద్భుతమైన ప్రణాళికతో రాజధాని నిర్మాణం జరుగుతోంది. అమరావతి భవిష్యత్తు నగరంగా ఉంటుంది. టెక్నాలజీ, గ్రీన్-బ్లూ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నాం. టూరిజం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక కేంద్రాలున్నాయి. చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారత దేశానికి ఒక గొప్ప అవకాశంగా అందుతోంది. దీనిని ఒక వరంగా మలచుకుంటున్నాం. సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ భారత దేశానికి ఇప్పుడు బలమైన ఆస్తి. ఒకప్పుడు భారత దేశంలో ఎలక్ట్రానిక్స్ వస్తువులు దిగుమతి చేసుకునేవారు. ఇప్పుడు ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగాం. గతంలో డబుల్ గ్రోత్ అంటే నమ్మలేదు.. ఇప్పుడు నిజమైంది" అని చంద్రబాబు అన్నారు.

రాష్ట్రంలో ఇజ్రాయెల్ పారిశ్రామిక క్లస్టర్

- దావోస్ సదస్సులో సీఎం చంద్రబాబు ప్రతిపాదన
- ఆ దేశ వాణిజ్య మంత్రితో సమావేశం
- సానుకూలంగా స్పందించిన ఇజ్రాయెల్

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనకు ఇజ్రాయెల్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి సాంకేతిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. దావోస్ ఆర్థిక సదస్సులో మూడో రోజు బుధవారం ఇజ్రాయెల్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నిర్ బర్కత్, ఈ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్, ట్రేడ్ మిషన్ ప్రతినిధి షిర్ స్లట్స్కీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం, సువిశాల సముద్రతీర ప్రాంతం, అందుబాటులో ఉన్న ఓడరేవులు, విమానాశ్రయాలు, యువతలో సాంకేతిక పరిజ్ఞానం, సహజ వనరులు వంటి అంశాల గురించి ఇజ్రాయెల్ మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో యూఏవీ డ్రోన్ తయారీ, తీర ప్రాంత గస్తీ, వ్యవసాయ రంగంలో వినియోగానికి డ్రోన్ల తయారీ సాంకేతికతపై చర్చలు జరిగాయి. డీశాలినేషన్, పారిశ్రామిక అవసరాల కోసం వ్యర్థ జలాల రీసైక్లింగ్, సాంకేతికతపై సహకారం అందించడంపైనా చర్చించుకున్నారు. జపాన్, కొరియా పారిశ్రామిక క్లస్టర్ల తరహాలో ఇజ్రాయెల్ కూడా రాష్ట్రంలో ఒక పారిశ్రామిక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆ దేశ మంత్రి బర్కత్‌ను చంద్రబాబు కోరారు. ఈ ప్రతిపాదన పట్ల బర్కత్ సానుకూలంగా స్పందించారు.



ప్రకృతి సేద్యం ప్రత్యామ్నాయ ఆహార ఉత్పత్తిపై రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి

కట్టుదిట్టమైన సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం అందించడంపైనా చర్చ జరిగింది. సాంకేతిక సహకారం అందించడానికి ఇజ్రాయెల్ మంత్రి సూత్రప్రాయంగా అంగీకరించారు.

యూఏఈ విదేశీ, వాణిజ్య మంత్రితో భేటీ

ఏపీలో దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ విదేశీ, వాణిజ్య మంత్రి థాని బిన్ అహ్మద్ సానుకూలంగా స్పందించారు. సీఎం చంద్రబాబుతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురూ పలు అంశాలపై చర్చించారు. అగ్రిటెక్, ఫుడ్ టెక్, ఆక్వా టెక్‌తో పాటు ఫుడ్ పార్కులు, ఎయిర్ పోర్టులు, రోడ్డు, రైలు నెట్‌వర్క్ ఏపీలో విస్తృతంగా ఉన్నాయని చంద్రబాబు వివరించారు. వీటితో పాటు జాతీయ పారిశ్రామిక కారిడార్లు కూడా రాష్ట్రంతో అనుసంధానమై ఉన్నాయని వివరించారు. యూఏఈకి చెందిన డీపీ వరల్డ్, షరాఫ్ గ్రూప్, ట్రాన్స్ వరల్డ్, ఏడీపోర్ట్స్, యాడ్‌నాక్ లాంటి కంపెనీలు ఏపీలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఏపీ నుంచి ఉద్యాన, ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశాలు పరిశీలించాలని కోరారు. యూఏఈ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు మంచి అవకాశాలున్నాయన్నారు. పునరుత్పాదక విద్యుత్తు రంగంలో 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. యూఏఈకి చెందిన లాక్వా, మజ్జార్ లాంటి కంపెనీలతో పాటు ఏడీబీఏ, ముబాద్లా, ఏడిక్యూ లాంటి ఫండింగ్ సంస్థల ద్వారా పెట్టుబడులకు అవకాశాలున్నాయని వివరించారు. స్పేస్, డ్రోన్ సిటీల్లో యూఏఈ భాగస్వామ్యం వహించాలని కోరారు.

చంద్రబాబుతో స్విట్జర్లాండ్ బృందం భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్విట్జర్లాండ్ ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. ఆ దేశ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి హెలెన్ బడ్లిగర్ ఆర్టిడా, ఆర్థిక వ్యవహారాల ప్రతినిధి అంబాసిడర్ ఆండ్రియా రేలర్, స్విస్ పార్లమెంటు సభ్యుడు నిక్ గగ్గర్ చర్చలు జరిపారు. ఏపీ-స్విట్జర్లాండ్ మధ్య వాణిజ్య సంబంధాలు, ఏపీలో స్విస్ కంపెనీల కార్యకలాపాలు, విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. కాగా ఎన్‌విడియా గ్లోబల్ ఏఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మండ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడంతోపాటు యువతకు నైపుణ్య శిక్షణ ఉపాధి అవకాశాలను అందిస్తూ ఏఐ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటుచేసేలా ఏపీ ప్రభుత్వంతో కలసి పని చేస్తున్నట్లు కాలిస్టా రెడ్మండ్ తెలిపారు. అమరావతిలో దేశంలోనే తొలి ఏఐ వర్సిటీ ఏర్పాటుపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. దీనిపై ఇప్పటికే ఏపీతో ఒప్పందం చేసుకున్నట్లు కాలిస్టా తెలిపారు.

నేను ఆశావాదిని. భారీ లక్ష్యాలు నిర్దేశించుకోవడం, వాటికోసం నిరంతరం పనిచేయడం నా అలవాటు. ముందు చూపుతో వ్యవహరించి, వినూత్నంగా ఆలోచించి, చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధ్యమేనని నమ్ముతా. యువతకు నేను ఇదే చెబుతా. ఆ దిశగా ప్రోత్సహిస్తా.

మాది పరిశ్రమల ఫ్రెండ్లీ గవర్నెన్స్. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు పాలనను మార్చేశాం. పెట్టుబడులతో ముందుకు వచ్చినవారికి తక్షణమే అనుమతులు ఇస్తున్నాం. పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ద్వారా నేరుగా ప్రోత్సాహకాలను అందజేస్తున్నాం. అనుమతుల నుంచి పరిశ్రమల స్థాపన దాకా ప్రతి అంశాన్ని రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తున్నాం.

జాతీయ, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక రంగం ఇప్పుడు ఏపీ గురించి చర్చిస్తోంది. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఏపీలో ఉత్పత్తికి అడుగులు వేశాం. అమ్మోనియా ఉత్పత్తి పరిశ్రమలను స్థాపిస్తున్నాం. విదేశాలకు గ్రీన్ అమ్మోనియాను ఎగుమతి చేసేందుకు ఇప్పటికే చర్చలు జరుపుతున్నాం.

- దావోస్ సదస్సులో అంతర్జాతీయ మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు

4 నెలల్లో 2 లక్షల సౌర విద్యుత్ కనెక్షన్లు!

- పునరుత్పాదక ఇంధనంలో రాష్ట్రాన్ని రోల్‌మోడల్‌గా నిలపాలి: సీఎస్

తిరుపతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రూఫ్ టాప్ సౌర విద్యుత్ వినియోగాన్ని వేగవంతంగా విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. మార్చి నాటికి సుమారు 1.5 లక్షల రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లు, మే నాటికి మొత్తం 2లక్షల కనెక్షన్లను పూర్తి చేసి లక్ష్యాన్ని సాధించాలన్నారు. నిర్దేశిత సమయంలో లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సిబ్బంది, అధికారుల పర్యవేక్షణ కీలకమని చెప్పారు. బుధవారం తిరుపతిలో ఎస్పీడీసీఎల్ సీఎండీ ఎల్.శివ శంకర్, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీ సత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల కలెక్టర్లు, నెడ్‌క్యాప్ ఎండీ ఎం.కమలాకరబాబు, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ఆయుబ్ ఖాన్ తదితరులతో విద్యుత్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సౌర వ్యవస్థలు, ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) చార్జింగ్ మౌలిక సదుపాయాల అమలును నిర్దిష్ట కాల పరిమితితో వేగవంతం చేయాలని ఎస్పీడీసీఎల్, నెడ్‌క్యాప్ అధికారులను ఆదేశించారు. పీఎం సూర్య ఘర్- ముఫ్త్‌బిజ్లీ యోజనపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, అనుమతులు, కమిషనింగ్ ప్రక్రియలను సులభతరం చేయాలని సూచించారు. ఫిబ్రవరి రెండో వారంలో జరగనున్న కలెక్టర్ల సదస్సులో వీటి పురోగతిని సమీక్షిస్తామని తెలిపారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా వెంటనే మీటరింగ్ పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలు జరిగినా డీఈలు, ఏడీఈలు వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని, వినియోగదారుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎస్ విజయానంద్

రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి 'కృషి రోడ్ మ్యాప్'!

- సీఎం విజ్ఞప్తితో కమిటీ ఏర్పాటు చేసిన కేంద్రం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఏపీలో రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు రాష్ట్ర స్థూల విలువ జోడింపులో 15 శాతం వృద్ధి లక్ష్యంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ 'కృషి రోడ్ మ్యాప్(వ్యవసాయ ప్రణాళిక)' కమిటీని ఏర్పాటు చేశారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ సంజయ్‌కుమార్ అగర్వాల్ కన్వీనర్‌గా కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖల చెందిన ఐఏఎస్‌లు, రీసెర్చ్ హెడ్‌లతో కలిపి 13 మంది కమిటీలో ఉన్నారు. కమిటీ తొలి సమావేశం బుధవారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ డైరెక్టరేట్‌లో జరిగింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్ మాట్లాడుతూ.. 'రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయ ఆధారిత వ్యవస్థ నుంచి ఉద్యాన ఆధారిత వ్యవస్థగా మార్పు సాధించనున్నాం' అని తెలిపారు. దీనిపై కమిటీ కన్వీనర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ... 'సీఎం ఆశయాలకు అనుగుణంగా ఏపీలో వ్యవసాయ అభివృద్ధికి కేంద్రం తోడ్పాటుకు కమిటీ అన్ని విధాలా సహకరిస్తుంది. విలువ ఆధారిత పంటల సాగు, కేంద్ర-రాష్ట్ర పథకాల అమలుకు అధికారుల సమన్వయం అత్యంత కీలకం' అని పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ప్రగతి, జీవీఏ, రైతుకు నికరాదాయం పెంపుదల అవకాశాలపై కేంద్ర కమిటీకి రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన ఈ కమిటీ... గురువారం ఏలూరు జిల్లాలో పర్యటించనుంది.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ. 60 కోట్లు విడుదల

- 3,617 మందికి రాయితీల లబ్ధి: మంత్రి కొండపల్లి

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రెండో విడత పారిశ్రామిక రాయితీ నిధులను విడుదల చేసినట్లు ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3,122 మంది ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.53.05 కోట్లు, 495 మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.7.16 కోట్లు కలిపి మొత్తం రూ.60.21 కోట్లను మంగళవారమే విడుదల చేసినట్లు చెపారు. రాష్ట్రంలో దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా.. పారిశ్రామిక ప్రోత్సాహకాల బకాయిలను పూర్తిగా చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్ వద్ద మంగళవారం నుంచి వారు ధర్నా చేస్తున్నారు. బుధవారం పోలీసులు వారిని అరెస్టు చేసి తాడేపల్లి స్టేషన్‌కు తరలించారు.

పశుసంవర్ధకశాఖ పథకాలపై కేంద్ర బృందం సమీక్ష

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖకు సంబంధించి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై క్షేత్ర స్థాయిలో పరిశీలనకు జాతీయ స్థాయి పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధిశాఖ ప్రతినిధుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. బుధవారం నుంచి 27వరకు తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పర్యటించి, జాతీయ పథకాల యూనిట్లను పరిశీలించి, లబ్ధిదారులతో ముఖాముఖీ మాట్లాడి, పథకాల పురోగతిని అంచనా వేయనుంది. కేంద్ర బృందంలోని లలిత్‌జోషి, మంజునాథ్, హిరేమత్, ముకేశ్‌దత్ శర్మ, జగత్ హజారిక బుధవారం విజయ వాడలోని వెటర్నరీ డైరెక్టరేట్‌ను సందర్శించారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు అధ్యక్షతన సంబంధిత అధికారులతో సమావేశమై, కేంద్ర పథకాలైన రాష్ట్రీయ గోకుల్ మిషన్, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్, నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్, లైవ్‌స్టాక్ హెల్త్, డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్‌పై సమీక్షించారు.

ఉదయం 10 వరకు పొగమంచు

- వాహనాల రాకపోకలకు అంతరాయం

విశాఖపట్నం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఒడిశా పరిసరాల్లో కొనసాగుతున్న అధికపీడనం ప్రభావంతో ఉత్తరకోస్తాలో అనేకచోట్ల బుధవారం పొగమంచు కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మంచు ప్రభావం ఎక్కువగా కనిపించింది. దీంతో వాహనాల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అల్లూరి జిల్లా హుకుంపేటలో 5.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలోని పలు జిల్లాల్లో పొగమంచు కురుస్తుందని, కోస్తా, రాయలసీమల్లో చలి తీవ్రత నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది.



మెటా వైస్ ప్రెసిడెంట్ కెల్విన్ మార్టిన్‌తో చర్చిస్తున్న లోకేశ్





ఆర్పీ సంజీవ్ గోయంకా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ శశ్వంత్ గోయాంకా, వెస్టాస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోర్టెన్‌ను సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

పరిశ్రమలకు ఆంధ్రా అనుకూలం

కనెక్టివిటీకి అనువుగా పోర్టులు.. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి పలు అవకాశాలు

- దావోస్‌లో పారిశ్రామికవేత్తలతో లోకేశ్

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో రాష్ట్ర మంత్రి లోకేశ్ బుధవారం పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, సమకూరుస్తున్న వసతులను వివరించారు. సుదీర్ఘ కోస్తా తీరం, పోర్టులు పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. పోర్టులకు అనుసంధానంగా ఉండే ఏపీ పారిశ్రామిక నోడ్‌లలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. జెరా గ్లోబల్ సీఈవో యుకియా కానితో లోకేశ్ భేటీ అయ్యారు. గ్రీన్ అమ్మోనియా తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆయన్ను కోరారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, జపాన్, ఇతర ఆసియా మార్కెట్లకు లోకార్బన్ అమ్మోనియా సరఫరా చేయడానికి రాష్ట్రంలో మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ మౌలిక సదుపాయాలను ఉపయోగించుకుని సమీపంలోని గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని యుకియా కానికి లోకేశ్ సూచించారు. పారిశ్రామిక వినియోగదారులకు అవసరమైన క్లీన్ ఎనర్జీ కోసం రాయలసీమలో సౌర, పవన హైబ్రీడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని కోరారు. పునరుత్పాదక ఇంధన వనరులు, లిక్విడ్ నైట్రోజన్, లోకార్బన్ అమ్మోనియా తయారీకి అనుకూలంగా ఏపీ ఉంటుందన్నారు. అమ్మోనియా యాంకర్ పరిశ్రమలకు ఏపీ అనువైనదన్నారు. థర్మల్ ప్లాంట్లలో అమ్మోనియా కోఫైరింగ్‌ను పరిశీలించడానికి పైలట్ ప్రాజెక్టును చేపట్టాలని సూచించారు. యుకియా కాని మాట్లాడుతూ.. భవిష్యత్తులో క్లీన్ ఇంధన దిగుమతులకు మద్దతు ఇవ్వడానికి భారత్‌లోని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చెయిన్‌లను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.



యూఎస్-ఇండియా భాగస్వామ్య సదస్సులో లోకేశ్



జెరోదా వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌తో లోకేశ్ సెల్ఫీ

డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయండి

ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ జెరోధా ఫౌండర్ నిఖిల్ కామత్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫామ్ ఇంజనీరింగ్, బ్యాకెండ్ సిస్టమ్స్, ట్రేడింగ్ అవరోధాలు, డేటా ఇంటెలిజెన్స్, ఫిన్‌టెక్ ఆర్‌అండ్‌డీపై విశాఖలో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కామత్‌ను లోకేశ్ కోరారు. రాష్ట్ర ఎంటర్‌ప్రెన్యూషిప్‌లను ప్రోత్సహించడం, ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడానికి లీడ్ మెంటార్‌గా వ్యవహరించాలని సూచించారు. దేశంలో మొదటిసారిగా మల్టిపుల్ డెలివరీ చానెళ్ల ద్వారా పాఠశాల నుంచి కళాశాల దాకా రాష్ట్ర వ్యాప్తంగా ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమాన్ని రూపొందించి, అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని లోకేశ్ కోరారు. దీనికి నిఖిల్ కామత్ సానుకూలంగా స్పందించారు.

కడప స్టీల్ ప్లాంట్ పనులు త్వరగా ప్రారంభించండి: కడప స్టీల్ ప్లాంట్‌ను త్వరితగతిన ప్రారంభించాలని జెఎస్‌డబ్ల్యూ ఎండీ పార్థ్ జిందాల్‌ను మంత్రి లోకేశ్ కోరారు. అలాగే రాష్ట్రంలో పెయింట్స్ తయారీ ప్లాంటును స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. దావోస్‌లో కలిసిన సందర్భంగా కడప స్టీల్ ప్లాంట్ భూమిపూజ, పనుల షెడ్యూల్‌పై ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో ఇప్పటికే బర్జర్, ఏసియన్ వంటి కంపెనీల కార్యక్రమాలు సాగుతున్నాయని వివరించారు. రాష్ట్రంలో డెకొరేటివ్, ఇండస్ట్రియల్ పెయింట్స్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని జిందాల్‌ను కోరారు. జేఎస్‌డబ్ల్యూ-ఎల్జీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయతలబెట్టిన బ్యాటరీ తయారీ యూనిట్‌ను శ్రీసిటీ లేదా విశాఖలో ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. జేఎస్‌డబ్ల్యు గ్రూప్ చేపట్టిన వారసత్వ కట్టడాల దత్తత కార్యక్రమంలో భాగంగా ఏపీలోని గండికోట, ఉండవల్లి గుహలు వంటి వారసత్వ ప్రదేశాలను తీసుకోవాలని కోరారు. ఈ ప్రతిపాదనపై చర్చించి త్వరలోనే నిర్ణయాన్ని ప్రకటిస్తానని జిందాల్ వెల్లడించారు.

ప్రాజెక్టులు వేగవంతం చేయండి

విశాఖ భాగస్వామ్య సదస్సులో బ్రూక్‌ఫీల్డ్ కంపెనీతో జరిగిన ఒప్పందంలో దావోస్ కేంద్రంగా మరో అడుగు ముందుకు పడింది. ఆ కంపెనీ ప్రెసిడెంట్ కానర్ టెస్కీతో లోకేశ్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 12 బిలియన్ డాలర్ల ఒప్పందాలకు సంబంధించి చర్చలు జరిపారు. ఫాస్ట్‌ట్రాక్ మోడ్‌లో ఆ ఒప్పందాలను కార్యరూపం దాల్చేలా చూడాలని లోకేశ్ కోరారు. అలాగే పోర్టు ఆధారిత ఇండస్ట్రియల్ క్లస్టర్లలో ఎనర్జీ స్టోరేజీ, సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులపై వీరి మధ్య చర్చ జరిగింది. బ్రూక్‌ఫీల్డ్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా ఏపీలో నిర్మాణమయ్యే యాక్సిస్ ఎనర్జీ, ఎవ్రాన్ ప్రాజెక్టులపైనా వారు చర్చించారు. బ్రూక్‌ఫీల్డ్ లాంటి కంపెనీ రావడం ఏపీకి పెద్ద ఉత్సాహాన్ని ఇస్తుందని లోకేశ్ చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.